సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14+12 వెల: ₹ 5.00
సంపుటి: 12
సంచిక: 268
SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'గ్రామం ప్రగతిపథంలో ఉంటే ఎవ్వరూ ముఠా కక్షల జోలికి వెళ్లరు'



## మిస్త్రీకి టాటా చెల్లదు!

చైర్మన్‌గా చంద్రశేఖరన్ నియామకం చట్టవిరుద్ధం: ఎన్‌సీఎల్‌టీ -బిజినెస్‌లో



## విశాఖలో విధ్వంసం...

మెరిసిన రోహిత్, రాహుల్, కుల్దీప్. రెండో వన్డేలో భారత్ ఘనవిజయం - స్పోర్ట్స్‌లో

# నిర్భయ దోషికి మరణశిక్షే

- నిర్భయ అత్యాచారం, హత్య కేసులో దోషి అక్షయ్ కుమార్ సింగ్ తనకు విధించిన మరణశిక్షను సమీక్షించాలంటూ దాఖలు చేసిన రివ్యూ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టేసింది. అక్షయ్ కుమార్ దాఖలు చేసిన రివ్యూ పిటిషన్‌ను బుధవారం జస్టిస్ ఆర్.భానుమతి, జస్టిస్ అశోక్ భూషణ్, జస్టిస్ ఏఎస్ బొప్పన్నలతో కూడిన ధర్మాసనం విచారించింది.

- వివరాలు 4లో

# భూముల రిజిస్ట్రేషన్ విలువల సవరణ!

- రాష్ట్రంలోని వ్యవసాయ, వ్యవసాయేతర భూముల రిజిస్ట్రేషన్ విలువలను సవరించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ మేరకు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కసరత్తు ప్రారంభించింది. ఇటీవల జరిగిన కేబినెట్ భేటీలో ఆదాయ పెంపుపై జరిగిన చర్చలో భూముల రిజిస్ట్రేషన్ విలువల సవరణ అంశాన్ని అధికారులు సీఎం కేసీఆర్ దృష్టికి తెచ్చారు.

- వివరాలు 2లో

# పల్లె నాడి పట్టని డాక్టర్



జిల్లా కేంద్రాలు, రాజధాని చుట్టుపక్కల ఆసుపత్రుల్లోనే ఉద్యోగానికి సిద్ధం

దూర ప్రాంతాలకు పోస్టింగ్ ఇస్తే దీర్ఘకాల సెలవులో వెళ్తున్న వైనం

ప్రభుత్వ వైద్యం అందక ఇబ్బందులు పడుతున్న గ్రామీణ ప్రజలు

పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, ఏరియా ఆసుపత్రుల్లో డాక్టర్లు లేక ప్రైవేటు వైద్యం

హేతుబద్ధీకరణే పరిష్కారమన్న సర్కారు.. అసాధ్యమంటున్న వైద్యాధికారులు

మంత్రి ఈటల సూచన బేఖాతర్..

90% డాక్టర్లు నివాసం ఉండేది ఇతర ప్రాంతాల్లోనే

సాక్షి, హైదరాబాద్

డాక్టర్ కృష్ణమోహన్ (పేరు మార్చాం) సూర్యాపేట జిల్లాలోని ఓ పీహెచ్‌సీలో మెడికల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. ఆయన హైదరాబాద్‌లో ఉంటూ అప్పుడప్పుడూ వెళ్లి వస్తుంటారు. వారానికి రెండుసార్లకు మించి వెళ్లడు. హైదరాబాద్‌లో క్లినిక్ నడుపుతున్నందున దీనిపైనే దృష్టి అంతా. దీంతో ఆ పీహెచ్‌సీ పరిధిలోని రోగులు ప్రైవేటు ఆసుపత్రులకే వెళ్తున్నారు.

నగరాలకు సమీపంలోని ఏరియా ఆసుపత్రులు, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో అనేకచోట్ల పూర్తిస్థాయిలో వైద్యులు, ఇతర సిబ్బంది ఉంటున్నారు. కానీ సుదూర ప్రాంతాల్లోని అవే కేటగిరీ ఆసుపత్రుల్లో వైద్య సిబ్బంది కొరత భారీగా ఉంది. హైదరాబాద్ సమీపంలో పనిచేసే వారంతా సొంత క్లినిక్‌లు లేదా కార్పొరేట్ ఆసుపత్రుల్లో పనిచేస్తున్నారు. సుదూర ప్రాంతాల్లో పోస్టింగ్‌లు ఉన్నవారు కూడా హైదరాబాద్‌లోనో ఇతర నగరాల్లోనో ఉంటూ అప్పుడప్పుడు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి వస్తున్నారు.

**90% మంది అంతే..**

ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేసేవారిలో 90% మంది వైద్యులు

మిగతా 2వ పేజీలో ▶

# విద్యార్థులు తక్కువ.. ఖర్చు ఎక్కువ!



| రూ.63,637 | రూ.39,814 |
| --- | --- |
| 30 మందిలోపున్న స్కూళ్లలో ఒక్కో విద్యార్థిపై ప్రభుత్వం చేస్తున్న ఖర్చు | 30-100 మంది లోపున్న స్కూళ్లలో ఒక్కో విద్యార్థిపై వెచ్చిస్తున్న మొత్తం |

- ఒక్కో టీచర్‌కు ఏటా సరాసరి జీతం రూ.5,78,772
- లెక్కలు తేల్చిన జే–పాల్ సంస్థ విద్యా విభాగం
- హేతుబద్ధీకరణ కసరత్తు నేపథ్యంలో ప్రాధాన్యం సంతరించుకున్న లెక్కలు

- వివరాలు 2లో







## ఇదం జగత్



రాజధానిని ఎవరైనా గ్రాఫిక్స్‌లో కడతారా అని రివర్స్‌లో అడుగుతున్నార్సార్!



# మీ తరఫున ఢిల్లీలో గొంతెత్తుతాం..

- తెలంగాణలాంటి రాష్ట్రాలతో అమెరికా సంస్థలు నేరుగా సంప్రదించాలి.. పెట్టుబడులతో వస్తే ఎలాంటి అవాంతరాలనైనా పరిష్కరిస్తాం..
- ప్రపంచ స్థాయి ప్రమాణాలతో ఎయిరోస్పేస్ వర్సిటీ ఏర్పాటు.. అంతర్జాతీయ అవసరాలను తీరుస్తున్న హైదరాబాద్ డిఫెన్స్ ఉత్పత్తులు
- భారత్, అమెరికా రక్షణ సంబంధాల సదస్సులో మంత్రి కేటీఆర్ వెల్లడి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలాంటి వేగంగా పురోగమిస్తున్న రాష్ట్రాలను నేరుగా సంప్రదిస్తే అమెరికా పెట్టుబడి సంస్థలు స్థానికంగా ఎదుర్కొనే అవాంతరాల పరిష్కారం దిశగా చొరవ తీసుకుంటామని ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి కె.తారకరామారావు చెప్పారు. రాష్ట్రానికి పెట్టుబడులతో వచ్చే అమెరికా సంస్థలకు ప్రోత్సాహం అందించడంతో పాటు మద్దతు ఇస్తామన్నారు. తెలంగాణతో నేరుగా భాగస్వామ్య ఒప్పందాలు కుదుర్చుకునే సంస్థల పక్షాన వారు ఎదుర్కొనే అవాంతరాల పరిష్కారం కోసం ఢిల్లీ స్థాయిలో గొంతెత్తుతామని ఆయన ప్రకటించారు. హైదరాబాద్‌లో భారత్, అమెరికా రక్షణ

మిగతా 2వ పేజీలో ▶

## లోకాయుక్తగా జస్టిస్ పుర్కర్?

- హెచ్చార్సీ చైర్మన్‌గా జస్టిస్ చంద్రయ్య
- ప్రభుత్వ పరిశీలనలో పేర్లు

సాక్షి, హైదరాబాద్: లోకాయుక్తగా హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ విలాస్ వి అఫ్జల్ పుర్కర్, ఉప లోకాయుక్తగా జిల్లా రిటైర్డ్ జడ్జి నిరంజన్ రావు, రాష్ట్ర మానవ హక్కుల సంఘం చైర్మన్‌గా హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ చంద్రయ్యను రాష్ట్ర ప్రభుత్వం నియమించనున్నట్లు తెలిసింది. సీఎం కేసీఆర్ నేతృత్వంలోని ఎంపిక కమిటీలు గురువారం లోకాయుక్త, ఉప లోకాయుక్త, హెచ్ఆర్సీ చైర్మన్, సభ్యుల ఎంపికపై నిర్ణయం తీసుకోనున్నాయి.

## 'శప్తభూమి'కి అకాడెమీ అవార్డు

- బండి నారాయణ స్వామి నవలకు గుర్తింపు
- శశిథరూర్ సహా 23 మందికి సాహిత్య అకాడెమీ పురస్కారాలు

4లో

## మహారాష్ట్రలోనూ 'దిశ' తరహా చట్టం

ఏపీలో తీసుకువచ్చిన దిశ తరహా చట్టాన్ని మహారాష్ట్రలో కూడా చేయాలని భావిస్తున్నట్లు హోం మంత్రి ఏక్‌నాథ్ షిండే శాసన మండలిలో చెప్పారు.

4లో



## అగ్నిమాపక శాఖకు 42 మంది ఆర్టీసీ డ్రైవర్లు

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీలోకొన్ని బస్సు సర్వీసులను రద్దు చేయటంతో 'అదనం'గా మారిన డ్రైవర్లలో కొందరిని ఇతర విభాగాలకు పంపే కసరత్తు మొదలైంది. ఇందులో భాగంగా తొలుత 42 మంది డ్రైవర్లను విపత్తు నిర్వహణ, అగ్నిమాపక శాఖకు డిప్యూటేషన్‌పై పంపనున్నారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటవుతున్న ఫైర్ స్టేషన్లకు డ్రైవర్లు కావాలంటూ ఆ శాఖ ప్రభుత్వాన్ని కోరగా..అందుకు ప్రభుత్వం అంగీకరించింది. అగ్నిమాపక శాఖకు డ్రైవర్లుగా వెళ్లేందుకు ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలంటూ అధికారులు సూచించారు. ఆర్టీసీ ఉద్యోగులుగానే వారు కొనసాగుతారని, ఏడాది కాలానికి డిప్యూటేషన్‌పై వెళ్లాల్సి ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. యాదగిరిగుట్ట, తుంగతుర్తి(మోత్కూరు),ఆలేరు,గజ్వేల్, పెద్ద శంకరంపేట, దుబ్బాక, చెన్నూరు, ఖానాపూర్, చొప్పదండి, మానకొండూరు, వేములవాడ, నిజామాబాద్ రూరల్, పాలకుర్తి, భూపాలపల్లి, వర్ధన్నపేట, పాలేరు, వైరా, దేవరకొండ, జడ్చర్ల, కొడంగల్, యాఖుత్‌పురా, సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లలో కొత్తగా ఏర్పాటు చేసే ఫైర్ స్టేషన్లలో వీరు డ్రైవర్ ఆపరేటర్లుగా పనిచేయాల్సి ఉంటుంది.

## 15వేల డాక్టర్ పోస్టులు భర్తీ చేయాలి

సాక్షి, హైదరాబాద్: వైద్య, ఆరోగ్య శాఖ పరిధిలోని ఆస్పత్రుల్లో ఖాళీగా ఉన్న దాదాపు 15 వేల డాక్టర్ల పోస్టులను యుద్ధప్రాతిపదికన భర్తీ చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధులతో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్‌ను కలిసి వినతి పత్రాన్ని అందించారు. చాలా ఆస్పత్రుల్లో స్పెషలైజ్డ్ డాక్టర్ పోస్టులు ఖాళీగా ఉండటంతో వివిధ రకాల రోగులు ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లి చికిత్స అందక ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారని వివరించారు. వైద్యం పూర్తి ఉచితంగా ఇవ్వాలని, ఈమేరకు ప్రభుత్వ ఆస్పత్రులను మరింత అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. వైద్యుల పోస్టులతో పాటు కింది స్థాయి సిబ్బంది ఉద్యోగాలను తక్షణమే భర్తీ చేయాలని మంత్రిని కోరారు. ఆస్పత్రుల్లో ఖాళీల జాబితాను రూపొందించి భర్తీకి చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

## డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్‌గా బెండి రాజగోపాలరావు



సాక్షి, హైదరాబాద్: డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్‌గా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్న బెండి రాజగోపాలరావును పదోన్నతిపై అదే పదవిలో నియమిస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆంధ్రా యూనివర్సిటీ నుంచి కెమికల్ ఇంజనీరింగ్‌లో పట్టభద్రుడైన రాజగోపాలరావు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ బోర్డులో ఏఈఈగా ఉద్యోగాన్ని ప్రారంభించారు. అనంతరం ఏపీపీఎస్సీ ద్వారా ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్‌గా నియమితులైనారు. గత 30 ఏళ్లుగా ఆయన ఫ్యాక్టరీస్ విభాగంలో అనేక హోదాల్లో పనిచేశారు.

## దేవాదాయ శాఖ కార్యదర్శిగా విశ్రాంత ఐఏఎస్ అనిల్‌కుమార్

సాక్షి, హైదరాబాద్: దేవాదాయ శాఖ కార్యదర్శిగా విశ్రాంత ఐఏఎస్ అధికారి అనిల్‌కుమార్‌ను ప్రభుత్వం నియమించింది. వాణిజ్య పన్నుల విభాగం కమిషనర్, దేవాదాయ శాఖ ఇన్‌చార్జి కమిషనర్, కాలుష్య నియంత్రణ మండలి ఇన్‌చార్జి సభ్య కార్యదర్శిగా పనిచేస్తూ అనిల్‌కుమార్ గత నెలలోనే పదవీ విరమణ చేశారు. ఆయన స్థానంలో సీనియర్ ఐఏఎస్ అధికారి నీతూకుమారి ప్రసాద్‌ను అప్పట్లో సర్కార్ నియమించింది. ఇప్పుడు అనిల్‌కుమార్‌ను రెండేళ్ల కాల పరిమితితో దేవాదాయ శాఖ కార్యదర్శిగా నియమిస్తూ ఉత్తర్వు జారీ చేసింది. ఆయనే దేవాదాయ శాఖ కమిషనర్‌గా కూడా వ్యవహరిస్తారని ఉత్తర్వులో ప్రభుత్వం పేర్కొంది.

## 31 వరకు దరఖాస్తు గడువు

హైదరాబాద్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఎంఫిల్, పీహెచ్‌డీ ప్రవేశ పరీక్ష 2020–21కి ఈ నెల 31 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని విశ్వవిద్యాలయ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. ఇంగ్లిష్, హిందీ, తెలుగు, కామర్స్, ఎడ్యుకేషన్, ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ విభాగాల్లో ఎంఫిల్, పీహెచ్‌డీ అందిస్తున్నామని పేర్కొన్నారు. ఫీజు తదితర వివరాలను విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌లో పొందవచ్చని, పూర్తి వివరాల కోసం 040–23680411 నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

## నిజామాబాద్ ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నిక నిర్వహించండి

**తెలంగాణ రాష్ట్ర జెడ్పీటీసీ సభ్యుల ఫోరం**

సాక్షి, హైదరాబాద్: నిజామాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నియోజకవర్గం ఖాళీగా ఉన్నందున వెంటనే ఎన్నిక నిర్వహించాలని రాష్ట్ర జెడ్పీటీసీ సభ్యుల ఫోరం కోరింది. ఈ మేరకు ఫోరం అధ్యక్షుడు బోళ్ల కరుణాకర్, ప్రధాన కార్యదర్శి ఉమ్మన్నగారి మనోహర్‌రెడ్డి తదితరులు బుధవారం రాష్ట్ర ఎన్నికల ముఖ్య అధికారి రజత్‌కుమార్‌ను కలసి వినతిపత్రం అందజేశారు.

# విద్యార్థులు తక్కువ.. ఖర్చు ఎక్కువ..!

- 30 మందిలోపున్న స్కూళ్లలో ఒక్కో విద్యార్థిపై ప్రభుత్వ ఖర్చు రూ.63,637
- లెక్కలు తేల్చిన జే-పాల్ సంస్థ విద్యా విభాగం



సాక్షి, హైదరాబాద్

విద్యార్థులు తక్కువగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో ఒక్కో విద్యార్థిపై ప్రభుత్వం ఏటా ఎక్కువ మొత్తాన్ని వెచ్చించాల్సి వస్తుండగా, ఎక్కువమంది విద్యార్థులున్న పాఠశాలల్లో ఒక్కో విద్యార్థిపై తక్కువ మొత్తంలో ఖర్చు చేస్తోంది. నోబెల్ అవార్డు గ్రహీత, ఆర్థికవేత్త అభిజిత్ బెనర్జీ ఏర్పాటు చేసిన అబ్దుల్ లతీఫ్ జమీల్ పావర్టీ యాక్షన్ ల్యాబ్(జే–పాల్)కు చెందిన విద్యా విభాగం పాఠశాల విద్యపై రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ఖర్చుల లెక్కలు తేల్చింది. కాలిఫోర్నియా యూనివర్సిటీలో ఎకనామిక్స్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ప్రొఫెసర్ మురళీధరన్ కో– చైర్‌గా వ్యవహరించే ఈ విభాగం రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపు, నాణ్యమైన విద్యను అందించేందుకు చేపట్టాల్సిన చర్యలపై ఐదేళ్లపాటు పనిచేసేందుకు ఇటీవల పాఠశాల విద్యాశాఖతో ఒప్పందం చేసుకుంది. ఇందులో భాగంగా ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్లు, వారి వేతనాలు, విద్యా పథకాల నిధులు తదితర వివరాలను క్రోడీకరించింది. వాటిని విశ్లేషించి పాఠశాల విద్యాశాఖకు లెక్కలు అందజేసింది. అందులో పలు ఆసక్తికర అంశాలు వెల్లడయ్యాయి. అయితే ఆ సంస్థ ప్రభుత్వ పాఠశాలలు, టీచర్ల హేతుబద్ధీకరణకు ఎలాంటి ప్రతిపాదనలు, సిఫారసులు చేయలేదు. కానీ విద్యార్థులు తక్కువగా ఉన్న పాఠశాలల హేతుబద్ధీకరణ, విలీనం చేసేందుకు కసరత్తు చేస్తున్న నేపథ్యంలో ఈ లెక్కలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

### 9,505 స్కూళ్లలో 30 మందిలోపే..

ప్రస్తుతం రాష్ట్రంలో ఒక్క విద్యార్థీ, ఒక్క టీచర్ కూడా లేని పాఠశాలలను మినహాయించగా, విద్యార్థులు, టీచర్లు గల పాఠశాలలు 24,550 ఉన్నట్లు తేల్చింది. అందులో 30 మందిలోపు విద్యార్థులు గల పాఠశాలలు 9,505 ఉన్నట్లుగా పేర్కొంది. వాటిల్లో ఒక్కో విద్యార్థిపై ఏటా రూ.63,637 వెచ్చిస్తోందని లెక్కలు తేల్చింది. అదే ఎక్కువమంది విద్యార్థులు ఉన్న స్కూళ్లలో ఖర్చు గణనీయంగా తగ్గుతోందని పేర్కొంది. 30 నుంచి 100 మంది వరకు విద్యార్థులు ఉన్న పాఠశాలల్లో ఒక్కో విద్యార్థిపై ప్రభుత్వం ఏటా రూ.39,814 ఖర్చు చేస్తుండగా, 100 నుంచి 200 మందిలోపు విద్యార్థులున్న స్కూళ్లలో ఒక్కో విద్యార్థిపై ఏటా రూ.30,234 ఖర్చవుతోందని తెలిపింది. 200 మంది కంటే ఎక్కువ విద్యార్థులు ఉన్న స్కూళ్లలో ఒక్కో విద్యార్థిపై ఏటా రూ.22,715 ఖర్చు అవుతోందని వెల్లడించింది. అంటే 200కు పైగా విద్యార్థులున్న పాఠశాలల్లో ఒక్కో విద్యార్థిపై అయ్యే ఖర్చు కంటే 30 మందిలోపు విద్యార్థులు ఉన్న స్కూళ్లలో ఒక్కో విద్యార్థిపై 3 రెట్లు అదనంగా వెచ్చించాల్సి వస్తోందని తేలింది.

### హేతుబద్ధీకరణ కోసమేనా..

విద్యార్థుల్లేని స్కూళ్లను, విద్యార్థులు తక్కువగా ఉన్న స్కూళ్లను సమీప పాఠశాలల్లో విలీనం చేసేందుకు ఇదివరకే విద్యా శాఖ కసరత్తు ప్రారంభించింది. విద్యార్థులు తక్కువగా ఉన్న పాఠశాలల నిర్వహణ కష్టమని, మానవ వనరులు వృథా అవుతున్నాయని, సుశిక్షితులైన టీచర్ల సేవలను సద్వినియోగం చేసుకునేందుకు హేతుబద్ధీకరణ తప్పదని నిర్ణయానికి వచ్చింది. అయితే దానిని ఎలా చేయాలన్న కోణంలో అనేక రకాల ఆలోచనలు చేస్తోంది. విద్యార్థుల్లేని స్కూళ్లను, తక్కువ ఉన్న స్కూళ్లను సమీప పాఠశాలల్లో విలీనం చేయడం, ఆయా ఆవాస ప్రాంతాల విద్యార్థులకు రవాణా సదుపాయం కల్పించడం లేదా రవాణా భత్యం ఇవ్వడం వంటి ఆలోచనలు చేసింది. అలాగే తక్కువమంది విద్యార్థులు ఉన్న ఉన్నత పాఠశాలలను సమీపంలోని ఒక ఉన్నత పాఠశాలలో విలీనం చేయడం ద్వారా ఎక్కువ సంఖ్యతో ఉన్నత పాఠశాలలను కొనసాగించాలని భావించింది. గతంలోనే దీనిపై టీచర్ల సంఘాల నుంచి వ్యతిరేకత వ్యక్తం కావడంతో ముందుకు వెళ్లలేదు. మరోవైపు ఆవాస ప్రాంతానికి కిలోమీటరు దూరంలో ప్రాథమిక పాఠశాల, 3 కిలోమీటర్ల దూరంలో ప్రాథమికోన్నత పాఠశాల, 5 కిలోమీటర్ల పరిధిలో ఉన్నత పాఠశాల ఉండాలని విద్యా హక్కు చట్టం చెబుతోంది. అయితే అన్నింటికి 5 కిలోమీటర్ల దూరాన్ని పరిగణనలోకి తీసుకునేలా విద్యాహక్కు చట్టంలో మార్పులకు అవకాశాలపై ఉన్నతాధికారులతో కమిటీ వేసింది. దీనిపైనా తీవ్ర వ్యతిరేకత రావడంతో ఆగిపోయింది. తాజాగా జే–పాల్ తేల్చిన లెక్కలు హేతుబద్ధీకరణ అవసరమన్న వాదనకే బలం చేకూర్చుతున్నాయి.

### లెక్కల్లోని మరికొన్ని అంశాలు..

- ప్రస్తుతం 30 మందిలోపు విద్యార్థుల ఉన్న పాఠశాలల్లో 17,808 మంది టీచర్లు పనిచేస్తున్నారు.
- ఇద్దరికంటే ఎక్కువమంది టీచర్లు గల పాఠశాలలు 3,750 ఉన్నట్లుగా పేర్కొంది.
- రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తంగా 1,37,471 మంది టీచర్లు పనిచేస్తుండగా, వారికి ఏటా వేతనాల రూపంలో రూ.7956,44,31,195 వెచ్చించాల్సి వస్తోందని పేర్కొంది.
- సగటున ఒక్కో టీచర్‌కు ఏటా రూ.5,78,772 వేతన రూపంలో చెల్లిస్తున్నట్లు తేల్చింది.
- మరోవైపు రాష్ట్రంలో ఒక్క విద్యార్థీ లేని స్కూళ్లు 916 ఉంటే వాటిల్లో 748 మంది టీచర్లు ఉన్నారు (పై లెక్కలకు ఇవి అదనం).

# ...గొంతెత్తుతాం..

మొదటి పేజీ తరువాయి

సంబంధాలపై జరుగుతున్న రెండ్రోజుల అంతర్జాతీయ సదస్సులో భాగంగా బుధవారం కేటీఆర్ కీలకోపన్యాసం చేశారు. అంతర్జాతీయ బిజినెస్ కౌన్సిల్, భారతీయ పరిశ్రమల సమాఖ్య (సీఐఐ), యూఎస్ రాయబార కార్యాలయం సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ సదస్సు గురువారం ముగియనుంది.

### ఐదేళ్లలో గణనీయమైన పురోగతి..

'రాష్ట్రంలో ఆదిబట్ల, నాదరగుల్, జీఎంఆర్, ఆదానీ ఎయిరోస్పేస్ పార్కులతో పాటు రాష్ట్రంలోని వివిధ ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్లు, హార్డ్‌వేర్ పార్కులు, ఎస్‌ఈజెడ్‌లను కేంద్రంగా చేసుకుని పెద్ద సంఖ్యలో ఎయిరోస్పేస్, డిఫెన్స్ కంపెనీలు తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. ఈ రంగానికి అవసరమైన మానవ వనరులను తయారు చేయడం లక్ష్యంగా త్వరలో ఏర్పాటు చేసే ప్రపంచ స్థాయి ఎయిరోస్పేస్ యూనివర్సిటీ ద్వారా తక్కువ ఫీజులతో సర్టిఫికెట్ కోర్సులు అందిస్తాం'అని కేటీఆర్ తెలిపారు. 'ఎయిరోస్పేస్, డిఫెన్స్‌కు సంబంధించి ప్రైవేటు రంగం లోనూ 25కు పైగా పెద్ద కంపెనీలు, వేయికి పైగా చిన్న, మధ్య తరహా పరిశ్రమలు పనిచేస్తున్నాయి. ఈ రంగంలో రాష్ట్రంలో గత ఐదేళ్లలో గణనీయ మైన పురోగతి సాధించగా, అమెరికాకు చెందిన లాక్‌హీడ్ మార్టిన్, బో యింగ్, జీఈ, హనీవెల్ వంటి ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ మాన్యుఫ్యాక్చ రింగ్ (ఓఈఎం) కంపెనీలు పెద్ద ఎత్తున పెట్టుబడులతో తరలివచ్చాయి. అమెరికా అధ్యక్షుడు ప్రయాణించే సికోర్స్కీ హెలికాప్టర్‌తో పాటు, ఎఫ్ 16 యుద్ధ విమానాల రెక్కలు హైదరాబాద్‌లోనే తయారవుతున్నాయి. భారత్‌లో ఎయిరోస్పేస్, డిఫెన్స్ రంగాల వాటా రూ.1.13 లక్షల కోట్లు కాగా, ఇది మరింత పెరగాల్సిన అవసరం ఉంది'అని కేటీఆర్ అన్నారు.

### బంధం మరింత బలోపేతమవ్వాలి: అమెరికా

ఇండో–పసిఫిక్ ప్రాంతంలో భారత్ తమకు వ్యూహాత్మక భాగస్వామి అని, రెండు దేశాల నడుమ రక్షణ బంధం మరింత బలోపేతం కావాల్సిన అవసరముందని అమెరికా రాజకీయ, రక్షణ వ్యవహారాల విభాగం డిప్యూటీ అసిస్టెంట్ సెక్రటరీ జోయల్ స్టార్ అన్నారు. మానవ రహిత యుద్ధ విమానాలు, బాలిస్టిక్ మిస్సైల్స్ తదితరాలకు సంబంధించిన అత్యున్నత సాంకేతికతను భారత్‌కు అందజేస్తున్నామని చెప్పారు. ఇప్పటికే భారత్–అమెరికా కంపెనీలు సంయుక్తంగా సీ130 రవాణా విమానాలు, ఎఫ్ –16 యుద్ధ విమానాలతో పాటు అపాచే యుద్ధ హెలికాప్టర్లను సంయుక్తంగా హైదరాబాద్‌లో తయారు చేస్తున్నాయన్నారు. భారత్ సొంతంగా డిఫెన్స్, ఎయిరోస్పేస్ రంగాన్ని అభివృద్ధి చేసుకోవడాన్ని అభినందించారు. రక్షణ రంగంలో పరస్పర సహకారం, సంయుక్త సైనిక విన్యాసాలు, రక్షణ వాణిజ్యం ఉభయ దేశాల నడుమ బంధాన్ని బలోపేతం చేస్తాయన్నారు. టీఎస్‌ఐపాస్ ద్వారా రక్షణ, బయోటెక్, ఐటీ రంగాలకు తెలంగాణ చిరునామా హైదరాబాద్‌లో యూఎస్ కాన్సుల్ జనరల్ జోయల్ రీఫ్‌మాన్ అన్నారు. సమావేశంలో ఐటీ కార్యదర్శి జయేశ్ రంజన్, కేంద్ర రక్షణ రంగ ఉత్పత్తుల శాఖ సంయుక్త కార్యదర్శి సంజయ్ జాజు పాల్గొన్నారు.



బుధవారం హైదరాబాద్‌లో ప్రారంభమైన అంతర్జాతీయ సదస్సులో జోయల్ స్టార్‌తో కరచాలనం చేస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో జయేశ్‌రంజన్, జోయల్ రీఫ్‌మన్, ముఖేశ్ భార్గవ

# రక్షణ సంబంధాలు మరింత బలోపేతం

- భారత్ మా వ్యూహాత్మక భాగస్వామి
- యూఎస్ రాజకీయ, మిలిటరీ వ్యవహారాల విభాగం డిప్యూటీ అసిస్టెంట్ సెక్రటరీ జోయల్ స్టార్

సాక్షి, హైదరాబాద్: భారత్–అమెరికా రక్షణ సంబంధాలు భవిష్యత్తులో మరింత బలోపేతమయ్యే అవకాశం ఉందని అమెరికా రాజకీయ, మిలటరీ వ్యవహారాల విభాగం డిప్యూటీ అసిస్టెంట్ సెక్రటరీ జోయల్ స్టార్ అన్నారు. హైదరాబాద్‌లో యూఎస్ కాన్సుల్ జనరల్ జోయల్ రీఫ్‌మన్, ఢిల్లీ యూఎస్ రాయబార కార్యాలయ అధికారి కెప్టెన్ డేనియల్ ఫిలియన్‌తో కలసి బుధవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. రక్షణ రంగంలో ఇరు దేశాల వ్యూహాత్మక సంబంధాల కారణంగా ఇండో పసిఫిక్ ప్రాంతంలో సంయుక్త పరిశోధన, అభివృద్ధి, అత్యాధునిక రక్షణ పరికరాల ఉత్పత్తి, పరస్పర సహకారం మరింతగా మెరుగుపడుతుందని జోయల్ స్టార్ అన్నారు. ఇప్పటికే భారత్– అమెరికా కంపెనీలు సంయుక్తంగా సీ–130 రవాణా విమానాలు, ఎఫ్–16 యుద్ధ విమానాలతో పాటు అపాచీ యుద్ధ హెలికాప్టర్లను సంయుక్తంగా హైదరాబాద్‌లో తయారు చేస్తున్నాయి. బలమైన భారత్– అమెరికా ప్రైవేట్‌రంగ భాగస్వామ్యంతో హైదరాబాద్‌తో పాటు భారతదేశంలోని ఇతర ప్రాంతాల్లో కూడా కీలకమైన ఏరోస్పేస్, రక్షణ రంగ ఉత్పత్తి కేంద్రాలు పెరిగే అవకాశం ఉందన్నారు.

### విశాఖ తీరంలో 'టైగర్ ట్రంప్'

విశాఖ సముద్ర తీరంలో ఇటీవల 'టైగర్ ట్రంప్'పేరిట తొలిసారిగా ఉభయ దేశాలకు చెందిన త్రివిధ దళాలు మిలిటరీ విన్యాసాలు జరిపాయని జోయల్ స్టార్ వెల్లడించారు. విశాఖ తీరంలో గతేడాది మూడు అమెరికా నావికాదళ నౌకలతో విన్యాసాలు నిర్వహించామన్నారు. ఇండో అమెరికా సైన్యాలు సంయుక్తంగా పనిచేయడం వల్ల ఇండో పసిఫిక్ ప్రాంతంలో శాంతి నెలకొంటుందని, ఇందులో భారత్‌ను తాము వ్యూహాత్మక భాగస్వామిగా భావిస్తున్నామని పేర్కొన్నారు. ఇరు దేశాల నడుమ రక్షణ సంబంధాల కారణంగా పరిశ్రమల మధ్య సహకారంతో పాటు కొత్త ఆవిష్కరణలు, ఉపాధి కల్పన అవకాశాలు పెరుగుతాయన్నారు. భారత్‌లో డిఫెన్స్, ఏరోస్పేస్ రంగంలో వాణిజ్యం సున్నా స్థాయి నుంచి పదేళ్ల కాలంలో 16 బిలియన్ డాలర్లకు చేరడం అభినందనీయమన్నారు. అమెరికా రక్షణ రంగం అనుసరిస్తున్న అత్యున్నత సాంకేతికతను భారత్‌కు అందజేయడంపై సంప్రదింపులు జరుగుతున్నట్లు వెల్లడించారు.

# పల్లె నాడి పట్టని డాక్టర్!

మొదటి పేజీ తరువాయి

ఇతర ప్రాంతాల్లోనే నివసిస్తున్నారని తాజాగా వైద్య ఆరోగ్య శాఖ విడుదల చేసిన నివేదికలో స్పష్టం చేసింది. 40 శాతం మంది వైద్య సిబ్బంది విధులకు గైర్హాజరు అవుతున్నారని, సమయ పాలన లేకుండా డ్యూటీలకు హాజరవుతున్నారని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఇటీవల నిర్వహించిన సమీక్షలో జిల్లా వైద్యాధికారులు వెల్లడించారు. అంటే గ్రామీణ ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన వైద్యులు సుదూర ప్రాంతాల్లో ఉండటంతో రోగులకు అవసరమైనప్పుడు వైద్య సేవలు అందట్లేదు. ఒకవేళ డాక్టర్లకు ఇష్టం కాని ప్రాంతాలకు పోస్టింగ్ ఇస్తే అంతే సంగతులు.. దీర్ఘకాలిక సెలవులపై వెళ్తున్నారు. విచిత్రమేంటంటే గతేడాది వైద్య విధాన పరిషత్ పరిధిలోని ఆసుపత్రుల కోసం 919 మంది స్పెషలిస్టు వైద్యుల పోస్టులను భర్తీ చేస్తే, తమకు ఇష్టమైన చోట పోస్టింగ్ ఇవ్వలేదని ఏకంగా 200 మంది తమ ఉద్యోగాలను వదిలేసుకున్నారు. ఆ తర్వాత 90 మంది స్పెషలిస్టులు సమాచారం లేకుండా గైర్హాజరవుతున్నారని షోకాజ్ నోటీసులు ఇచ్చారు. అయినా మార్పు లేకపోవడంతో వారిని విధుల నుంచి తొలగించారు.

### పేరుకుపోయిన ఖాళీలు..

రాష్ట్రంలో 885 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీ) ఉన్నాయి. 30 నుంచి 40 పడకలున్న సామాజిక ఆరోగ్య కేంద్రాలు (సీహెచ్‌సీ) 41 ఉన్నాయి. అలాగే ఏరియా ఆసుపత్రులు, జిల్లా కేంద్ర ఆసుపత్రులు, బోధనాసుపత్రులు ఉన్నాయి. పీహెచ్‌సీలకు మంజూరైన పోస్టులకు, వాస్తవంగా పనిచేస్తున్న సిబ్బందికి మధ్య తేడా కనిపిస్తోంది. ఒక్కో పీహెచ్‌సీకి ఒక మెడికల్ ఆఫీసర్, ఒక స్టాఫ్ నర్సు సహా ఇతర పారామెడికల్ సిబ్బందితో కలిపి మొత్తం 8 మంది ఉండాలి. 24 గంటలు పని చేసే పీహెచ్‌సీల్లో ఇద్దరు మెడికల్ ఆఫీసర్లు, ముగ్గురు స్టాఫ్‌నర్సులు సహా ఇతర పారామెడికల్ సిబ్బందితో కలిపి 12 మంది ఉండాలి. ఇక 30–40 పడకలున్న సీహెచ్‌సీల్లో ఒక సూపరింటెండెంట్, ముగ్గురు సివిల్ అసిస్టెంట్ సర్జన్లు, ఆరుగురు స్టాఫ్ నర్సులు సహా మొత్తం 14 మంది ఉండాలి. ఏరియా ఆస్పత్రుల్లో గైనిక్, పీడియాట్రిక్, జనరల్ సర్జన్, అనస్థీషియా స్పెషాలిటీ సేవలు అందుబాటులో ఉండాలి. జిల్లా ఆస్పత్రుల్లో దాదాపు అన్ని రకాల స్పెషాలిటీ వైద్య సేవలు ఉండాలి. కానీ ఖాళీలు మాత్రం చాలా ఉన్నాయి. వైద్య ఆరోగ్యశాఖ అంచనా ప్రకారం రాష్ట్రంలో పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, బోధనాసుపత్రులు, వైద్య విధాన పరిషత్ ఆసుపత్రుల్లో వైద్యులు, నర్సులు, ఆరోగ్య కార్యకర్తలు, ఆరోగ్య సహాయకులు మొత్తం కలిపి 26,404 మంది ఉండాలి. అందులో 17,148 మంది పనిచేస్తుండగా.. 9,256 ఖాళీలున్నాయి. అందులో వైద్య ఖాళీలే ఏకంగా 4,201 ఉండటం గమనార్హం. అందులో వైద్య విధాన పరిషత్ ఆసుపత్రుల్లో 4,500 మంది వైద్యులు ఉండాల్సి ఉండగా, 2,100 మంది మాత్రమే ఉన్నారు. 2,400 ఖాళీలు ఉండటం గమనార్హం. ఈస్థాయిలో ఖాళీలు ఏర్పడటంతో ఎక్కడికక్కడ వైద్య సిబ్బంది కొరత రోగులపాలిట శాపంగా మారింది.

### సర్కారు వర్సెస్ వైద్యాధికారులు..

ఖాళీలను ఇప్పటికిప్పుడు నింపే పరిస్థితి లేదు. కాబట్టి ఉన్న వైద్యులను, ఇతర వైద్య సిబ్బందిని సర్దుబాటు చేయాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఈటల పదేపదే చెబుతున్నారు. హేతుబద్ధీకరించడం ద్వారా వైద్యుల కొరతను తాత్కాలికంగా తీర్చొచ్చని ఉన్నతాధికారులను ఆదేశించారు. పీహెచ్‌సీ, సీహెచ్‌సీలకు నిబంధనల ప్రకారం 1512 స్టాఫ్ నరులు కావాలి. కానీ 1276 మాత్రమే ఉన్నారు. ఇంకా 236 మంది స్టాఫ్‌నర్సుల కొరత ఉంది. వారిలో కొందరిని అవసరం లేని చోట నుంచి అవసరమున్న చోటకు తరలించాలని ఆదేశించారు. అయితే హేతుబద్ధీకరణకు సంబంధించి ఇప్పటివరకు ఒక్క అడుగు కూడా ముందుపడలేదు. దీని అమలును వైద్యాధికారులే అడ్డు పడుతున్నారు. 'ప్రైవేటు ప్రాక్టీస్ అలవెన్స్ 20 శాతం వరకు ఇస్తే, వైద్యులను ఒప్పించొచ్చని వీలుంటుందని'ఓ కీలక వైద్యాధికారి వ్యాఖ్యానించారు.

### ఎంబీబీఎస్ డాక్టర్లే పరిష్కారం

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆస్పత్రుల్లో ఎలాగూ స్పెషలిస్టులు పని చేయడానికి ముందుకు రావట్లేదు. దీన్ని దృష్టిలో ఉంచుకుని పేద ప్రజల కనీస అవసరాలు తీర్చేందుకు ఎంబీబీఎస్ డాక్టర్లను నియమిస్తే బాగుంటుందని ఓ ఉన్నతాధికారి అభిప్రాయపడ్డారు. జ్వరం, కడుపునొప్పి, విరేచనాలు వంటి చిన్న చిన్న జబ్బుల చికిత్స కోసం ప్రైవేటు ఆస్పత్తులకు వెళ్లాల్సి వస్తోందని, దీన్ని నివారించేందుకు ఎంబీబీఎస్ డాక్టర్ల నియామకం అత్యవసరమని అభిప్రాయపడ్డారు. ఎంబీబీఎస్ వైద్యులు తక్కువ వేతనాలతో ప్రైవేట్ ఆస్పత్రుల్లో పని చేస్తున్నారని, వారిని ప్రభుత్వం ప్రోత్సహిస్తే గ్రామీణ ప్రాంతాలు, చిన్న పట్టణాల్లో ప్రజలకు మేలు కలుగుతుందన్నారు.

### ఎక్కడికంటే అక్కడికి వెళ్లే పరిస్థితి లేదు

వైద్యుల హేతుబద్ధీకరణ నిర్ణయం మంచిదే. కానీ స్పెషలిస్టు వైద్యులు తమకు నచ్చని చోటకు బదిలీ చేస్తే వెళ్లడానికి ముందుకు రావట్లేదు. అవసరమైతే తమ ఉద్యోగాలను వదిలేసుకోవడానికి సిద్ధమవుతున్నారు. సర్దుబాటు చేయడం అంత సులువైన వ్యవహారం కాదు. దీనిపై పెద్ద ఎత్తున కసరత్తు చేయాలి. వైద్యులతో మాట్లాడి కౌన్సిలింగ్ చేసి వారిని ఒప్పించి పంపాలి. ఒత్తిడి చేస్తే వెళ్లే పరిస్థితి ఉండట్లేదు. ఎందుకంటే సొంత ప్రాక్టీసు వారికి ముఖ్యం. ఆ ధీమాతోనే వారు ఎక్కడికీ వెళ్లట్లేదు.

– డాక్టర్ రమేశ్‌రెడ్డి, వైద్య విద్య డైరెక్టర్

# భూముల రిజిస్ట్రేషన్ విలువల సవరణ!

### కసరత్తు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

- ఏడేళ్లుగా సవరించకపోవడంతో మార్కెట్, రిజిస్ట్రేషన్ విలువలకు 50 రెట్ల వరకు తేడా
- ఇటీవల కేబినెట్ భేటీలో సీఎం వద్ద ప్రస్తావించిన అధికారులు
- శాస్త్రీయంగా ప్రతిపాదనలు పంపాలన్న సీఎం కేసీఆర్
- విలువలు సవరించాలని రెవెన్యూ అధికారుల సమావేశంలో కోరిన బిల్డర్లు
- ప్రాంతాలనుబట్టి 10 నుంచి 100 శాతం వరకు పెంపు ప్రతిపాదనలు పంపిన అధికారులు
- సీఎం గ్రీన్‌సిగ్నల్ ఇస్తే వారం రోజుల్లో సవరణకు అవకాశం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని వ్యవసాయ, వ్యవసాయేతర భూముల రిజిస్ట్రేషన్ విలువలను సవరించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ మేరకు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కసరత్తు ప్రారంభించింది. ఇటీవల జరిగిన కేబినెట్ భేటీలో ఆదాయ పెంపుపై జరిగిన చర్చలో భూముల రిజిస్ట్రేషన్ విలువల సవరణ అంశాన్ని అధికారులు సీఎం కేసీఆర్ దృష్టికి తెచ్చారు. ప్రజలపై అధిక భారం పడకుండా శాస్త్రీయంగా ప్రతిపాదనలు పంపాలని ఆయన ఆదేశించారు. అలాగే రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ సమక్షంలో నిర్వహించిన బిల్డర్ల సమావేశంలో కూడా రిజిస్ట్రేషన్ విలువల సవరణ అంశం చర్చకు రావడంతో ఈ ప్రక్రియ ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది. సీఎం గ్రీన్‌సిగ్నల్ ఇస్తే వారం రోజుల్లోనే రిజిస్ట్రేషన్ విలువలు సవరించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.

### ఇప్పటివరకు జరగని సవరణ...

వాస్తవానికి, రాష్ట్రంలో భూముల రిజిస్ట్రేషన్ విలువల సవరణ 2013, ఆగస్టులో జరిగింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత ఇంతవరకు ఈ విలువలను సవరించలేదు. ప్రతియేటా ఆగస్టు 1 నుంచి సవరించిన రిజిస్ట్రేషన్ విలువలు అందుబాటులోకి రావాల్సి ఉండటంతో రిజిస్ట్రేషన్ల శాఖ ప్రతిపాదనలు పంపడం, ప్రభుత్వం అంగీకరించకపోవడం జరిగేది. కానీ, విలువలు సవరించి ఏడేళ్లు కావడంతో భూముల రిజిస్ట్రేషన్ విలువలకు, మార్కెట్ ధరలకు పొంతన లేకుండా పోయింది. ఉప్పల్ భగాయత్‌లో ఇటీవల భూముల వేలం జరగ్గా గజం రూ.79 వేలకు పైగా ధర పలికింది. కానీ, అక్కడ రిజిస్ట్రేషన్ విలువ గజం రూ.7 వేలు మాత్రమే. వ్యవసాయ భూములకు కూడా ఇదే పరిస్థితి నెలకొంది. కొన్ని చోట్ల అయితే ఏకంగా రిజిస్ట్రేషన్ ధర కన్నా మార్కెట్ ధర 50 రెట్లు ఎక్కువకు చేరింది. దీంతో రిజిస్ట్రేషన్ ధరలను సవరించడం అనివార్యంగా కనిపిస్తోంది. దీనికి తోడు ఇటీవల జరిగిన కేబినెట్ భేటీలో రెవెన్యూ అధికారులు ఈ అంశాన్ని సీఎం దృష్టికి తెచ్చారు. అయితే ప్రజలపై అధిక భారం పడకుండా చూడాలని, శాస్త్రీయంగా పరిశీలించి ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. అలాగే బిల్డర్ల సమావేశంలోనూ రిజిస్ట్రేషన్ ధరలను సవరించకపోతే రియల్ ఎస్టేట్ వ్యాపారంలో సమస్యలు వస్తున్నాయని, వీలున్నంత త్వరగా సవరించాలని రెవెన్యూ ఉన్నతాధికారులను వారు కోరారు. ఈ నేపథ్యంలో దీనిపై మరోసారి స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కసరత్తు ముమ్మరం చేసింది. ప్రాంతాలను ఆధారంగా 10 శాతం నుంచి 100 శాతం వరకు రిజిస్ట్రేషన్ విలువల పెంపు ప్రతిపాదనలను అధికారులు సీఎం వద్దకు పంపారు. ప్రభుత్వం నిర్ధారించిన భూముల రిజిస్ట్రేషన్ విలువను బట్టి సాధారణ సేల్ డీడ్‌పై స్టాంపు డ్యూటీ కింద 6 శాతం ఫీజులు వసూలు చేస్తారు. రిజిస్ట్రేషన్ విలువల సవరణతో ఆ మేరకు స్టాంపు డ్యూటీ కూడా ప్రభుత్వానికి అధికంగా రానుంది. రిజిస్ట్రేషన్ల శాఖ ప్రతిపాదనలకు సీఎం అంగీకారం లభిస్తే ఈ వారం రోజుల్లో రిజిస్ట్రేషన్ విలువల సవరణలు అమల్లోకి రానున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం పెరగనున్న నేపథ్యంలో దాదాపు విలువల సవరణ ఖాయమని తెలుస్తోంది.

## కాలకేయలా పర్యావరణానికి హాని కలిగించొద్దు



త్వరలో జరగనున్న మేడారం జాతరకు కోటి మందికి పైగా భక్తులు వస్తారని అంచనా! రెండేళ్లకోసారి జరిగే ఈ జాతర ముగిశాక భారీగా ప్లాస్టిక్ కవర్లు పేరుకుపోయి రైతులు, మూగజీవాలు ఇబ్బంది పడాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో ములుగు జిల్లాలో కొద్ది రోజులుగా ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి ఈసారి మేడారం జాతరను కూడా 'ప్లాస్టిక్ ఫ్రీ'గా నిర్వహించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా భక్తులకు అవగాహన కల్పించేందుకు జాతరకు వెళ్లే దారిలో ములుగు జిల్లా కేంద్రంలోని గట్టమ్మ ఆలయం వద్ద 'ప్లాస్టిక్ కాలకేయుడు'పేరిట భారీ కటౌట్ ఏర్పాటు చేయించారు. అలాగే దీని పక్కనే పర్యావరణానికి హాని కలిగించకుండా సమ్మక్క – సారలమ్మలను దర్శించుకోవాలని కోరుతున్నాము' అంటూ బోర్డు ఏర్పాటు చేయించారు.

*– గుర్రం సంపత్‌గౌడ్ స్టాఫ్, ఫొటోగ్రాఫర్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా*

## ఉద్యోగుల మృతి కలచివేసింది: సునీల్ శర్మ

**సాక్షి, హైదరాబాద్:** సమ్మె సమయంలో మృతిచెందిన ఆర్టీసీ ఉద్యోగుల కుటుంబ సభ్యులకు ప్రభుత్వం ఉద్యోగావకాశం కల్పించిన నేపథ్యంలో వారికి సంస్థ శిక్షణను ప్రారంభించింది. 38 మందికిగాను ఖమ్మంకు చెందిన డ్రైవర్ శ్రీనివాసరెడ్డి కుటుంబం ఉద్యోగం బదులు నగదు సాయం కోరగా.. మరో నలుగురు గైర్హాజరయ్యారు. మిగతా వారికి హకీంపేటలోని ఆర్టీసీ శిక్షణా కేంద్రంలో బుధవారం నుంచి శిక్షణ ప్రారంభించారు. అంతకుముందు వారితో ఆర్టీసీ ఇన్‌చార్జి ఎండీ సునీల్ శర్మ బస్‌భవన్‌లో భేటీ అయ్యారు. సమ్మె సమయంలో అంతమంది ఉద్యోగులు చనిపోవటం కలిచివేసిందన్నారు. సంస్థలోకి వస్తున్న వారికి చక్కటి భవిష్యత్తు ఉంటుందన్నారు.

## నదుల్లోకి చేరే నీటిని శుభ్రపరచాలి

**సీఎం దృష్టిలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ సిస్టం: మంత్రి నిరంజన్‌రెడ్డి**

**సాక్షి, హైదరాబాద్:** కృష్ణా, గోదావరి జలాలు కలుషితం అవుతున్నాయని, నదుల్లోకి చేరే నీటిని శుభ్రపరచాల్సిన అవసరముందని వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. బుధవారం కృష్ణా–గోదావరి నది పరీవాహక ప్రాంత పునరుజ్జీవన ప్రాజెక్టు డీపీఆర్ రూపకల్పన సన్నాహక సమావేశంలో నిరంజన్‌రెడ్డి మాట్లాడారు. గోదావరి, కృష్ణా పరీవాహక ప్రాంతాల పరిరక్షణ కోసం కేంద్రం నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. నదులకు 5 కిలోమీటర్ల దూరం నుంచి రైతుల పొలాలలో నీడనిచ్చే చెట్లు, ఉద్యాన పంటలు వంటివి వేయాలన్నారు. వాగులకు 2 కిలోమీటర్ల పరిధిలో పచ్చదనాన్ని పెంచాలన్నారు. ఇరిగేషన్, ఉద్యాన, రూరల్ డెవలప్‌మెంట్, వ్యవసాయ శాఖలు ఈ విషయంలో సంయుక్తంగా పని చేయాలన్నారు. కృష్ణా, గోదావరి పరీవాహక ప్రాంతంలో ఈ ప్రాజెక్టు ద్వారా 25 లక్షల ఎకరాల్లో పచ్చదనం వెల్లివిరుస్తుందన్నారు. ఆగ్రో ఫారెస్ట్రీకి తోడు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న వ్యవసాయ అభివృద్ధి కార్యక్రమాల ద్వారా భవిష్యత్ తెలంగాణ ముఖచిత్రం ఉజ్వలంగా ఉంటుందన్నారు. గ్రామాలు, పట్టణాలలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టంతోపాటు సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేయాలన్న ఆలోచన సీఎం దృష్టిలో ఉందన్నారు.

# రాష్ట్ర ప్రాజెక్టులకు నిధులివ్వండి

- మిషన్ భగీరథ, కాకతీయ, కాళేశ్వరం ప్రాజెక్టులకు సహాయం అందించండి
- రాష్ట్రంలో ఉక్కు కర్మాగారానికి చర్యలు చేపట్టండి
- ప్రీబడ్జెట్, జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో హరీశ్‌రావు విన్నపం



బుధవారం ఢిల్లీలో నిర్వహించిన జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న మంత్రి హరీశ్‌రావు

**సాక్షి, న్యూఢిల్లీ:** కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ ప్రాజెక్టులకు తగినన్ని నిధులు కేటాయించాలని ఆర్థిక మంత్రి తన్నీరు హరీశ్‌రావు కేంద్రాన్ని కోరారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, రాష్ట్రాల ఆర్థికమంత్రులతో బుధవారం ఇక్కడ నిర్వహించిన సంప్రదింపుల సమావేశం, జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో హరీశ్‌రావు పాల్గొన్నారు. ఏపీ పునర్ వ్యవస్థీకరణ చట్టం పరిధిలో వెనుకబడిన ప్రాంతాలకు ఇవ్వాల్సిన నిధులను, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయలకు ప్రత్యేక సాయంగా కేటాయించేలా 2020–21 కేంద్ర బడ్జెట్ రూపొందించాలని ఆయన నిర్మలా సీతారామన్‌కు విన్నవించారు.

**జీఎస్టీ అమలులో సమస్యలు పరిష్కరించాలి**

జీఎస్టీ ప్రవేశపెట్టడానికి అంగీకరిస్తూ రాష్ట్రాలు కేంద్రంపై నమ్మకం పెట్టుకున్నాయని, జీఎస్టీ అమలులో ఉన్న పలుసమస్యలను పరిష్కరించి కేంద్రం ఆ నమ్మకాన్ని నిలబెట్టాలని హరీశ్ కోరారు. కేంద్రం రాష్ట్రాలకు ఇచ్చే జీఎస్టీ పరిహారం, ఇంటిగ్రేటెడ్ గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ (ఐజీఎస్టీ) పంపకంలో తలెత్తిన సమస్యలను ఆయన ఆర్థిక మంత్రి దృష్టికి తెచ్చారు. ఐజీఎస్టీ కింద రాష్ట్రాలకు రావలసిన వాటాను, జీఎస్టీ కింద రాష్ట్రాలకు ఇవ్వాల్సిన పరిహార పన్నులను నియమాలకు విరుద్ధంగా కేంద్రం కన్సాలిడేటెడ్ ఫండ్ ఆఫ్ ఇండియాలో, పబ్లిక్ అకౌంట్‌లో చేర్చి తన ఖర్చులకు వాడుకుంటోందని ఆరోపించారు. జీఎస్టీ అమలు వల్ల రాష్ట్రాలు నష్టపోయిన సొమ్మును పరిహారంగా చెల్లించడంలో కేంద్రం చేస్తోన్న జాప్యం వల్ల రాష్ట్రాలు చిక్కులపాలవుతున్నాయని చెప్పారు.

**తెలంగాణ ప్రాజెక్టులకు కేటాయింపులు జరపాలి**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన అన్యాయం కారణంగా తెలంగాణ రాష్ట్రంలోని 10 జిల్లాల్లో 9 జిల్లాలు.. వెనుకబడిన ప్రాంతాలకు గ్రాంటు అందుకునే ప్రాంతాల కింద ఉండేవని తెలిపారు. నీటిపారుదల రంగంలో ఈ జిల్లాలు తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయని, ఈ ప్రాంతాల అభివృద్ధికి ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం సెక్షన్ 94(2) కింద కేంద్రం సహాయం అందించాల్సి ఉంటుందని హరీశ్ ప్రస్తావించారు. ఈ గ్రాంటు కింద తెలంగాణకు 2019–20 సంవత్సరంలో మంజూరు చేయవలసిన రూ. 450 కోట్లను ఇంకా విడుదల చేయలేదని కేంద్ర ఆర్థిక మంత్రి దృష్టికి తెచ్చారు. వాటిని ఈ నెలలో విడుదల చేసేలా చూడాలని కోరారు.

**మిషన్ కాకతీయ, భగీరథలకు..**

తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో తాగునీటి కోసం ప్రారంభించిన మిషన్ భగీరథ, 45 వేల చెరువుల పూడికతీత కోసం చేపట్టిన మిషన్ కాకతీయ, దాదాపు ఒక కోటి ఎకరాల భూమికి నీరందించడం కోసం చేపట్టిన చిన్న, మధ్య తరహా నీటిపారుదల ప్రాజెక్టులకు సహాయం అందించాలని హరీశ్ కోరారు. మిషన్ భగీరథకు రూ.19,205 కోట్లు, మిషన్ కాకతీయకు రూ.5 వేల కోట్లు మూడేళ్లలో ప్రత్యేక సహాయంగా అందించాలని నీతి ఆయోగ్ సిఫార్సు చేసిందని గుర్తు చేశారు. ఇవి దీర్ఘకాలిక ప్రాజెక్టులన్న మిషతో కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ ఈ సిఫార్సు తోసిపుచ్చిందని, కానీ ఈ ప్రాజెక్టులు దీర్ఘకాలిక ప్రాజెక్టులు కావని, దాదాపుగా పూర్తికావొచ్చాయని హరీశ్ తెలిపారు. నీతి ఆయోగ్ సిఫార్సు చేసిన నిధులను ఈ ప్రాజెక్టులకు 2020–21 బడ్జెట్‌లో కేటాయించాలని కోరారు.

**కాళేశ్వరంను జాతీయ ప్రాజెక్టుగా గుర్తించాలి**

ఒక లక్ష కోట్ల రూపాయల అంచనా వ్యయంతో బీడు భూములకు నీరందించే ఉద్దేశంతో చేపట్టిన కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు తగిన నిధులను రానున్న బడ్జెట్‌లో అందించాలని ఆయన కోరారు. అప్పులు తెచ్చి ప్రాజెక్టు నిర్మించడం రాష్ట్ర ప్రభుత్వానికి భారంగా ఉందని, జాతీయ ప్రాజెక్టుగా గుర్తింపు పొందే అర్హత కలిగిన కాళేశ్వరంను జాతీయ ప్రాజెక్టుగా గుర్తించి రానున్న బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించాలని హరీశ్ కోరారు.

**స్టీలు ప్లాంటు ఏర్పాటు చేయాలి**

ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం రాష్ట్రంలో ఇంటిగ్రేటెడ్ ఉక్కు కర్మాగారం నెలకొల్పవలసి ఉందని, దీనికి వేగిర చర్యలు చేపట్టాలని కోరారు.

**పన్ను మాఫీ పథకం ప్రకటించాలి:**

రాష్ట్రాల పెట్టుబడి అవసరాలకు ప్రోత్సాహాన్ని ఇవ్వడం కోసం ఆకర్షణీయమైన పన్ను మాఫీ పథకాన్ని ప్రవేశపెట్టాలని హరీశ్‌రావు సూచించారు. ఎగ్గొట్టిన పన్నుపై తక్కువ వడ్డీ పథకాన్ని ప్రకటించి ప్రకటిత సొమ్మును పది సంవత్సరాల పాటు రాష్ట్రాలకు సహాయం అందించే నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్‌లో ఉంచే పథకం ద్వారా రాష్ట్రాల అభివృద్ధికి ఊతమివ్వవచ్చని హరీశ్‌రావు సూచించారు.

**రాష్ట్రాలకు ఆర్థిక సాధికారత కల్పించాలి:**

ఆర్థిక వ్యవస్థ మందగమనాన్ని అరికట్టడం కోసం ఆర్థిక వనరుల పరంగా రాష్ట్రాలకు అధికారాన్ని, స్వేచ్ఛను కల్పించాలని హరీశ్‌రావు సూచించారు. భారీ ఆర్థిక విధానాలను పక్కనపెడితే ఇతరత్రా ఆర్థిక కార్యకలాపాలు ఎక్కువగా రాష్ట్రాల్లోనే జరుగుతాయని ఆయన తెలిపారు. బలమైన రాష్ట్రాలు బలమైన దేశాన్ని, టీమ్ ఇండియాను నిర్మిస్తాయని, ఇందుకోసం రాష్ట్రాలకు రాజ్యాంగబద్ధమైన సహాయాన్ని అందించే చర్యలతో సహకార సమాఖ్య స్ఫూర్తిని పెంపొందించాలని నీతి ఆయోగ్ సూచించినప్పటికీ ఐదేళ్లుగా కేంద్రం ఈ దిశగా చర్యలు చేపట్టలేదని ఆయన ఆరోపించారు. కేంద్ర ప్రాయోజిత పథకాల క్రమబద్ధీకరణపై 2016లో ముఖ్యమంత్రుల సబ్ గ్రూప్ చేసిన సిఫారసులను రానున్న బడ్జెట్‌లో చేర్చాలని హరీశ్‌రావు విజ్ఞప్తి చేశారు. అలాగే రాష్ట్ర, ఉమ్మడి జాబితాలలోని అంశాలపై కేంద్రం చేసే వ్యయాన్ని తగ్గించి ఆ సొమ్మును రాష్ట్రాలకు ఇవ్వడం వల్ల రాష్ట్రాలు మౌలిక సదుపాయాలపై మరింత ఖర్చు పెట్టుకోగలుగుతాయని హరీశ్‌రావు సూచించారు.

ADVERTORIAL

## ప్రెస్టీజ్ స్వచ్ఛ్ - భారతదేశంలో వెదజల్లడాన్ని నియంత్రించే మొదటి ప్రెషర్ కుక్కర్

గుర్తుంచుకోండి మీ ప్రెషర్ కుక్కర్ విజిల్స్ వచ్చిన ప్రతీసారి ఏమి జరుగుతోంది? అది ఆహార పదార్థాలను నురగలాగ పైకి వెదజల్లుతోంది, దానివలన మీ ప్రెషర్ కుక్కర్, కిచెన్ శ్లాబ్, గ్యాస్ స్టౌవ్ మురికిగా తయారవుతాయి!

ఏళ్ళ తరబడి వినియోగదార్లు ఈ సమస్యను ఎదుర్కొంటున్నారు. ఇప్పుడు భారతదేశంలో ప్రెషర్ కుక్కర్లలో అగ్రగామి అయిన ఈ సంస్థ ఈ సమస్యకు పరిష్కారాన్ని కనుగొంది.

వినూత్నమైన డిజైన్‌తో గంజినీరు మీ కుక్ టాప్ ప్రక్కన, పైన పడకుండా ఉండే విధంగా డీప్‌లిడ్‌తో రూపొందించిన ప్రెషర్ కుక్కర్ల శ్రేణిని ప్రెస్టీజ్ స్వచ్ఛ్ రేంజ్ ప్రవేశపెడుతోంది. దీనివలన వినియోగదారు వంటగదిలో సర్వ సాధారణంగా జరిగే వెదజల్లే ప్రక్రియ గురించి ఇబ్బంది పడకుండా వంట చేసుకోడానికి, కుక్కరుకు జరిగే నష్టాన్ని తగ్గించేందుకు వీలు కల్పిస్తుంది.







"మా విలువైన వినియోగదార్లకు రోజువారీ పనులను సులభతరం చేయడానికి TTK ప్రెస్టీజ్ ఆకర్షణీయమైన కిచెన్ అప్లియన్సెస్‌ను నిరంతరం ప్రవేశపెడుతోంది. దేశంలో మేము ప్రెషర్ కుక్కర్స్ లీడర్లము, భారతదేశంలో మొట్టమొదటి ప్రెషర్ కుక్కర్‌ను 1955లో ప్రారంభించాము. ప్రెషర్ కుక్కర్ వినియోగించే కుటుంబానికి మా సరికొత్త ఇన్నోవేషన్, అది వంటగదులను పరిశుభ్రంగా ఉంచుకోడానికి, వంటగదిలో తక్కువ సమయంలో సౌకర్యవంతంగా కుకింగ్‌కు వీలు కల్పించే నిర్దిష్టమైన గాడ్జెట్ అని సగర్వంగా తెలియజేస్తున్నాము"

**శ్రీ చంద్రు కల్రో,**
**మేనేజింగ్ డైరెక్టర్, TTK ప్రెస్టీజ్**

ప్రెషర్‌కుక్కర్స్ స్వచ్ఛ్ రేంజ్ నేడే తీసుకోండి మీ వంటగదికి అందే ఉత్తమశ్రేణి ప్రయోజనాన్ని అందుకోండి, వెదజల్లడాన్ని నియంత్రించే, మీ వంటగదిని పరిశుభ్రంగా ఉంచే, నిర్వహణకు సులువైన ప్రెషర్ కుక్కర్ అంతకంటే మీకు ఇంకేం కావాలి?




**స్వచ్ఛ్ ప్రెషర్ కుక్కర్ రిటైల్ ధర రూ. 1325/- నుంచి ఉంటుంది. అన్ని ప్రెస్టీజ్ ఎక్స్‌క్లూజివ్ స్టోర్స్, ప్రత్యేకమైన డీలర్ అవుట్ లెట్స్‌లో లభిస్తుంది.**



# రాజ్యాంగ బద్ధతపై విచారిస్తాం

## పౌరసత్వ సవరణ చట్టంపై సుప్రీంకోర్టు స్పష్టీకరణ

- చట్టం అమలుపై స్టేకు నిరాకరణ
- చట్టంపై సామాన్యులకు అవగాహన కల్పించాలని కేంద్రానికి ఆదేశాలు

**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా తీవ్ర నిరసనలకు కారణమైన వివాదాస్పద పౌరసత్వ సవరణ చట్ట(సీఏఏ) రాజ్యాంగ బద్ధతపై విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు అంగీకరించింది. అయితే, ఆ చట్టం అమలుపై స్టే విధించేందుకు నిరాకరించింది. పాకిస్తాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్తాన్‌ల్లో మతపరమైన వేధింపులను ఎదుర్కొని డిసెంబర్ 31, 2004లోపు భారత్‌కు వలస వచ్చిన హిందూ, క్రిస్టియన్, సిక్, జైన్, పార్సీ, బౌద్ధ మతస్తులకు పౌరసత్వం కల్పించేందుకు ఉద్దేశించిన బిల్లు ఇటీవలే పార్లమెంట్ ఆమోదం పొంది, రాష్ట్రపతి ఆమోద ముద్రతో చట్టంగా మారిన విషయం తెలిసిందే. ఈ చట్టాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. పౌరసత్వ సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధమైనదని, మత ప్రాతిపదికన పౌరసత్వం కల్పించడం రాజ్యాంగ ఉల్లంఘనేనని పేర్కొంటూ సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. ఆ పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎస్‌ఏ బాబ్డే నేతృత్వంలోని ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. అనంతరం, చట్టం రాజ్యాంగ బద్ధతపై విచారణ జరుపుతామని పేర్కొంది. వివరణ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసి, తదుపరి విచారణను జనవరి 22వ తేదీకి వాయిదా వేసింది. సీఏఏపై ప్రజలకు అవగాహన కల్పించాలని విచారణ సందర్భంగా న్యాయవాది అశ్విని ఉపాధ్యాయ చేసిన సూచనను ధర్మాసనం సమర్థించింది. 'చట్టం లక్ష్యాలను, నియమ నిబంధనలను, చట్టంలోని కీలకాంశాలను ప్రజలకు వివరించండి. అందుకు దృశ్య, శ్రవణ మాధ్యమాలను ఉపయోగించుకునే అవకాశాన్ని పరిశీలించండి' అని కేంద్రం తరఫున వాదనలు వినిపించిన అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్‌ను ఆదేశించింది. అందుకు వేణుగోపాల్ అంగీకరించారు. చట్టం అమలును అడ్డుకోవాలని ఒక పిటిషనర్ తరఫు న్యాయవాది జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ సూర్యకాంత్ కూడా సభ్యులుగా ఉన్న ధర్మాసనాన్ని కోరారు. అస్సాం ఆందోళనల్లో ఐదుగురు విద్యార్థులు చనిపోయారన్నారు. అయితే, నోటీఫై చేసిన తరువాత చట్టంపై స్టే విధించడం సాధ్యం కాదని సుప్రీంకోర్టు గత తీర్పులను ప్రస్తావిస్తూ అటార్నీ జనరల్ వేణుగోపాల్ వాదించారు. ఈ సమయంలో జోక్యం చేసుకున్న సీనియర్ న్యాయవాది రాజీవ్ ధావన్, కపిల్ సిబల్‌లు చట్టం అమలుపై విధివిధానాలు రూపొందలేదని, అమలుపై ఆందోళన అవసరం లేదన్నారు. దాంతో చట్టం అమలుపై స్టే విధించడానికి కోర్టు నిరాకరించింది.



ఢిల్లీలో జామియా వర్సిటీ విద్యార్థిని నిరసన

## 'పౌర' ఆందోళనలు చరిత్రలో నిలుస్తాయి: కన్హయ్య

పౌరసత్వ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ నిరసనలు కొంత తగ్గుముఖం పట్టాయి. ఢిల్లీలోని జామియా మిలియా యూనివర్సిటీ వద్ద జరిగిన ఆందోళనల్లో జేఎన్‌యూ విద్యార్థి సంఘ మాజీ అధ్యక్షుడు కన్హయ్య కుమార్ పాల్గొన్నారు. యూనివర్సిటీ 7 వ నెంబర్ గేట్ వద్ద విద్యార్థులు, ఇతర నిరసనకారులను ఉద్దేశించి ప్రసంగించారు. సీఏఏను వ్యతిరేకిస్తూ జరిపే నిరసనలు ముస్లింలను రక్షించడానికి కాదని, మొత్తం దేశాన్ని రక్షించేందుకని వ్యాఖ్యానించారు. పౌరసత్వ చట్టం కన్నా జాతీయ పౌర పట్టిక(ఎన్నార్సీ) మరింత ప్రమాదకరమైందని స్పష్టం చేశారు. 'పౌరసత్వ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఇప్పుడు దేశవ్యాప్తంగా జరుగుతున్న ఆందోళనలు రాజ్యాంగాన్ని పరిరక్షించిన వాటిగా చరిత్రలో నిలిచిపోతాయి' అన్నారు. 'ఎన్నార్సీని దేశవ్యాప్తంగా అమలు చేస్తే.. మనమంతా నోట్ల రద్దు సమయంలో నిల్చున్నట్లు భారీ లైన్లలో నిల్చుని మన పౌరసత్వాన్ని నిరూపించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది' అన్నారు. పశ్చిమబెంగాల్‌లోని దినాజ్‌పూర్ జిల్లాలో సీఏఏ నిరసన ప్రదర్శనపై దుండగులు నాటు బాంబులు విసరడంతో ఐదుగురు గాయపడ్డారు.

**మద్రాస్ వర్సిటీకి కమల్ హాసన్:** మద్రాస్ వర్సిటీలో దర్నా చేస్తున్న విద్యార్థులకు సినీ నటుడు, మక్కల్ నీది మయ్యం అధినేత కమల్ హాసన్ సంఘీ భావం తెలిపారు. క్యాంపస్ లోపలికి వెళ్లేందుకు అనుమతించకపోవడంతో, వెలుపలి నుంచే విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు.

**జామియా కేసు చీఫ్ జస్టిస్‌కు బదిలీ**

జామియా మిలియాలో హింసాత్మక ఘటనలకు సంబంధించి పోలీసులు చర్యలు తీసుకోకుండా తాత్కాలికంగా రక్షణ కల్పించాలని ఇద్దరు విద్యార్థినులు పెట్టుకున్న పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు తిరస్కరించింది. జామియా వర్సిటీ విద్యార్థినులు లడీదా ఫర్జానా, ఆయేషా రీనా పెట్టుకున్న పిటిషన్ వేశారు. అయితే, సీఏఏ వ్యతిరేక హింసాత్మక ఘటనలకు సంబంధించిన కేసులను హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులే విచారించాలన్న సుప్రీం ఆదేశాలను కేంద్రం తరఫు న్యాయవాది జస్టిస్ విభూ దృష్టికి తెచ్చారు. దాంతో విచారణను ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి బదిలీ చేస్తూ జస్టిస్ విభూ నిర్ణయం తీసుకున్నారు. 'పౌరసత్వం'పై నిరసనలు చేపట్టకూడదంటూ కర్ణాటకలోని బెంగళూరు, మంగళూరులలో పోలీసులు ఆంక్షలు విధించారు. బెంగళూరులో గురువారం ఉదయం 6 నుంచి 21 అర్ధరాత్రి వరకు అమల్లో ఉంటాయి.

ముంబైలో ర్యాలీలో పాల్గొన్న వందలాది మంది నిరసనకారులు



## దేశాన్ని మంటల్లోకి తోస్తున్నారు

**కేంద్రంపై నిప్పులు చెరిగిన మమతా బెనర్జీ**

**కోల్‌కతా:** 'దేశంలోని మంటలను ఆర్పాల్సింది పోయి.. దేశాన్ని మంటల్లోకి నెడుతున్నారు. ఇది మీ ఉద్యోగం కాదు'అని హోం మంత్రి అమిత్‌షాపై బెంగాల్ సీఎం మమతా బెనర్జీ విరుచుకుపడ్డారు. 'సబ్‌కా సాత్.. సబ్‌కా వికాస్..'అంటూ ప్రధాని నరేంద్ర మోదీ చెబుతున్నారు కానీ.. దేశంలోని ప్రతి ఒక్కరిని వినాశనాన్ని తీసుకొచ్చారని దుయ్యబట్టారు. దేశం మంటల్లో కాలిపోకుండా చూడాలని అమిత్‌షాను కోరారు.దేశాన్ని మంటల్లోకి తోసేయడం మీ ఉద్యోగం కాదు.. కానీ మంటలు ఆర్పేయండి చాలు'అని ఎద్దేవా చేశారు. కోల్‌కతాలో కోల్‌కతాలో నిర్వహించిన ర్యాలీలో ఆమె మాట్లాడారు.

## ప్లాస్టిక్ తెచ్చి.. భోజనం చేసి వెళ్లండి

**భువనేశ్వర్:** ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణను ప్రోత్సహించడం, వాటి కాలుష్యంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు భువనేశ్వర్ మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) సరికొత్త ఆలోచనకు శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా అర కిలో ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి భోజన సదుపాయాన్ని కల్పిస్తోంది. 'మీల్ ఫర్ ప్లాస్టిక్' పేరిట చేస్తున్న ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆహార్ పథకంలో చేర్చారు. దీని ద్వారా ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణతోపాటు భోజన సదుపాయం కూడా కల్పిస్తున్నట్లు బీఎంసీ కమిషనర్ ప్రేమ్ చంద్ర చౌదరి తెలిపారు.

## మరిన్ని సుప్రీం బెంచ్‌లు అవసరం

**ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు**



**సాక్షి, న్యూఢిల్లీ:** దేశంలో మరిన్ని సంస్కరణలు రావాల్సిన అవసరం ఉందని ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు ఆకాంక్షించారు. బుధవారం దక్షిణాది రాష్ట్రాలకు చెందిన మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. 'విభిన్న రంగాల్లో సంస్కరణలు రావాల్సిన అవసరం ఉంది. కక్షిదారుల వ్యయప్రయాసలను తగ్గించేందుకు, సత్వర న్యాయం అందే దిశగా, దేశంలో మరికొన్ని ప్రాంతాల్లో సుప్రీం కోర్టు ధర్మాసనాలను ఏర్పాటు చేయాలి. రాజకీయ నేతలపై క్రిమినల్ కేసుల విషయంలో వేగం అవసరం. ఫిరాయింపులకు పాల్పడినవారిపై పరిమిత కాలంలో నిర్ణయం తీసుకోవాలి. రాజ్యసభలో సభ సజావుగా జరగని సందర్భాల కంటే నిర్మాణాత్మక చర్చలను మీడియా చూపించాలి' అని పేర్కొన్నారు.

# 'శప్తభూమి'కి అకాడెమీ అవార్డు

- బండి నారాయణస్వామి నవలకు గుర్తింపు
- కాంగ్రెస్ నేత శశిథరూర్ సహా 23 మందికి..
- అవార్డులు ప్రకటించిన కేంద్ర సాహిత్య అకాడెమీ


నారాయణస్వామిని అభినందిస్తున్న అకాడెమీ సభ్యులు

**సాక్షి, న్యూఢిల్లీ:** ప్రముఖ తెలుగు రచయిత బండి నారాయణస్వామికి కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు లభించింది. రాయలసీమ చరిత్ర నేపథ్యంగా ఆయన రాసిన 'శప్తభూమి'నవలకు ఈ గౌరవం దక్కింది. కేంద్ర సాహిత్య అకాడెమీ 23 భారతీయ భాషలలో రచనలకు వార్షిక అవార్డులను బుధవారం ప్రకటించింది. 7 కవితా సంకలనాలు, 4 నవలలు, 6 లఘు కథలు, 4 వ్యాసాలు, ఒక నాన్ ఫిక్షన్, ఒక ఆటోబయోగ్రఫీ, ఒక బయోగ్రఫీని అవార్డుల కోసం ఎంపిక చేసినట్లు అకాడెమీ తెలిపింది. 23 భారతీయ భాషలలో జ్యూరీ సభ్యులు సిఫారసు చేసిన రచనలను అకాడెమీ కార్యనిర్వాహక బోర్డు ఆమోదించి అవార్డులను ప్రకటించింది. తెలుగులో కేతు విశ్వనాథరెడ్డి, శీలా వీర్రాజు, డాక్టర్ వి.చినవీరభద్రుడు జ్యూరీ సభ్యులుగా వ్యవహరించారు. బండి నారాయణస్వామి రాయలసీమ రచయితగా గుర్తింపు పొందారు. శప్తభూమి అంటే శాపగ్రస్త ప్రదేశమని కూడా చెప్పుకోవచ్చు. అదేవిధంగా, గడ్డం మోహన్‌రావు రాసిన 'కొంగవాలు కత్తి'నవలకు అకాడెమీ యువ పురస్కార్ లభించింది. 'తాత మాట వరాల మూట'రచనకు గాను బెలగం భీమేశ్వరరావుకు అకాడెమీ 'బాల సాహిత్య పురస్కారం'ప్రకటించింది.

**థరూర్ పుస్తకం, నంది కిశోర్ కవిత**

కాంగ్రెస్ నేత, రచయిత శశిథరూర్, నాటక రచయిత నంద కిశోర్ ఆచార్య తదితర 23 మంది రచయితలున్నారు. థరూర్ ఆంగ్లంలో రాసిన 'యాన్ ఎరా ఆఫ్ డార్క్‌నెస్'పుస్తకం, నందకిశోర్ ఆచార్య హిందీలో రాసిన 'చలాతే హుయే ఆప్నే కో'కవితకు ఈ పురస్కారం లభించింది. విజేతలకు వచ్చే ఫిబ్రవరి 25వ తేదీన ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో తామ్ర పత్రంతోపాటు రూ.లక్ష నగదు అందజేస్తారు.

**ఏపీ సీఎం జగన్ అభినందనలు**

**సాక్షి, అమరావతి:** ప్రముఖ రచయిత బండి నారాయణస్వామికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు రావడంపై సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అభినందనలు తెలిపారు. ఉపాధ్యాయుడిగా, రచయితగా సమాజాన్ని అధ్యయనం చేస్తూ ఆయన చేసిన రచనలు మరెందరికో స్ఫూర్తినిస్తాయని అన్నారు.

## జామియా మసీదులో మళ్లీ ప్రార్థనలు

**శ్రీనగర్:** ఆర్టికల్ 370 రద్దు అనంతరం జమ్మూ కశ్మీర్లోని నౌహరిహట్టా ప్రాంతంలోని జామియా మిలియా మసీదులో జరిగే రోజువారీ సామూహిక ప్రార్థనలు బుధవారం తొలిసారిగా ప్రారంభమయ్యాయి. జమ్మూ కశ్మీర్‌ను రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజన, ఆర్టికల్ 370 రద్దు చేసిన తర్వాత అధికారులు ఆగస్టు 5న ఈ మసీదుకు సంబంధించిన అన్ని మార్గాలను మూసివేశారు. అప్పట్నుంచి మసీదులో ప్రార్థనలు జరుపుకునేందుకు వీలులేకుండా పోయింది. అయితే 136 రోజుల అనంతరం ఈ మసీదును బుధవారం మధ్యాహ్నం నుంచి తెరిచి సామూహిక ప్రార్థనలకు ఆహ్వానించినట్లు అధికారులు తెలిపారు.


శ్రీనగర్ జామియా మసీదులో ప్రార్థనలు

## ముషార్రఫ్‌కు పాక్ ప్రభుత్వం మద్దతు

**ఇస్లామాబాద్:** దేశద్రోహం కేసులో ఉరిశిక్ష పడ్డ పాకిస్తాన్ మాజీ అధ్యక్షుడు పర్వేజ్ ముషార్రఫ్‌కు మద్దతివ్వాలని పాక్ ప్రభుత్వం నిర్ణయించింది. దీనిపై చర్చించేందుకు బుధవారం పాకిస్తాన్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ పార్టీ కోర్ కమిటీతో అత్యవసర సమావేశం అయ్యారు. ఆశ్చర్యమేంటంటే.. ఇమ్రాన్ ఖాన్ ప్రతిపక్షంలో ఉండగా.. ముషారఫ్ రాజద్రోహం కేసుకు ఇమ్రాన్ ఖాన్ మద్దతు తెలపగా, ఇప్పుడు వ్యతిరేకిస్తున్నారు. కాగా, ముషార్రఫ్‌కు మద్దతుగా ఆర్మీ కూడా నిలుస్తోంది. మాజీ సైనికాధ్యక్షుడైన ముషార్రఫ్.. ఎప్పటికీ ద్రోహి కాదని, కోర్టు తీర్పును ఖండిస్తున్నట్లు ప్రకటించింది.

## హంతకుడిని పట్టించిన గుండీ

**ఔరంగాబాద్ పోలీసుల ఘనత**



**ఔరంగాబాద్:** చిన్న ఆధారం కూడా క్రిమినల్ కేసులో ఎంత కీలకంగా మారుతోందో చెప్పే ఘటన మహారాష్ట్రలో చోటుచేసుకుంది. ఔరంగాబాద్‌లో బికన్ నిలోబ జాదవ్‌ను ఏడు నెలల క్రితం కొందరు హత్య చేశారు. ఘటనా స్థలంలో పోలీసులకు గుండీ మాత్రమే దొరికింది. గుండీ మీద రోప్‌లాస్ట్ స్టిచ్ అనే అక్షరాలు ఉండటంతో పోలీసులు ఆయా విక్రేతల నుంచి ఎవరెవరు చొక్కాలు కొనుగోలు చేశారో పరిశీలించారు. దాదాపు 10 వేల మంది వారి నుంచి చొక్కాలను కొనగా అందులో 246 మందికి నేరచరిత్ర ఉంది. అందులో హత్యకు నాలుగు రోజుల ముందు రగాడే అనే వ్యక్తి కత్తులను కొనుగోలు చేశాడు. అతన్ని అదుపులోకి తీసుకొని విచారించడంతో మిగిలిన వారి పేర్లు కూడా బయటకు వచ్చాయి. అజయ్ రగాడే, చేతన్ గైక్వాడ్ , సందీప్ గైక్వాడ్‌లు ఈ హత్య చేసినట్లు పోలీసులు అభియోగాలు మోపారు. నిందితులను పట్టుకోవడంలో సమయస్ఫూర్తితో వ్యవహరించిన పోలీసులకు ఎస్పీ మోక్షద పాటిల్ రూ. 30 వేల బహుమతి ప్రకటించారు.

## భారత్-అమెరికా 2+2 చర్చలు

**వాషింగ్టన్:** భారత్–అమెరికాల మధ్య 2+2 ఉన్నత స్థాయి సమావేశాలు ప్రారంభమయ్యాయి. బుధవారం అమెరికాలో అమెరికా విదేశాంగ మంత్రి మైక్‌పాంపియో, రక్షణ శాఖ మంత్రి మార్క్ ఎస్పర్‌లతో భారత విదేశాంగ మంత్రి ఎస్ జై శంకర్, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ భేటీ అయ్యారు. ప్రధానంగా వీరంతా ద్వైపాక్షిక, జాతీయ, అంతర్జాతీయ పరిణామాలపై చర్చించనున్నారు.

## లాటరీపై 28 శాతం పన్ను

**న్యూఢిల్లీ:** లాటరీలపై 28 శాతం పన్ను విధిస్తూ జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయం తీసుకుంది. బుధవారం జరిగిన 38వ కౌన్సిల్ మీటింగ్‌లో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కూడా ఈ భేటీలో పాల్గొన్నారు. లాటరీ పన్ను పెంపు 2020 మార్చి నుంచి అమల్లోకి వస్తుందని రెవిన్యూ సెక్రటరీ అజయ్ భూషన్ పాండే తెలిపారు. అల్లిన బ్యాగులపై పన్నును 12 నుంచి 18 శాతానికి పెంచినట్లు పేర్కొన్నారు. మరిన్ని ఇండస్ట్రియల్ పార్కులు వచ్చేందుకు ఇండస్ట్రియల్ ప్లాట్స్ మీద పన్ను మినహాయించామని చెప్పారు. గతంలో జరిగిన 37 కౌన్సిల్ సమావేశాల్లో జీఎస్టీ రేట్లపై అందరూ కలిసి ఒకే నిర్ణయం తీసుకోగా, ఈ భేటీలో మొదటిసారి ఓటింగ్ ప్రక్రియను అమలు చేశారు.

## 17 రోజుల్లోనే జీవిత ఖైదు

**చిన్నారిపై రేప్ కేసులో పోక్సో కోర్టు తీర్పు**



**జైపూర్:** చిన్నారి బాలికపై అత్యాచారం చేసిన వ్యక్తికి 17 రోజుల్లోనే తీర్పు ప్రకటించి రాజస్తాన్‌లోని ఒక పోక్సో (ప్రివెన్షన్ ఆఫ్ చిల్డ్రెన్ ఫ్రమ్ సెక్సువల్ అఫెన్సెస్ యాక్ట్) ప్రత్యేక కోర్టు చరిత్ర సృష్టించింది. చురు జిల్లాలో నవంబర్ 30వ తేదీన 21 ఏళ్ల దయారాం మేఘ్వాల్ నాలుగేళ్ల చిన్నారిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆ మర్నాడే అతడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఐపీసీతో పాటు పోక్సో చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. డిసెంబర్ 7వ తేదీన చార్జిషీటు దాఖలు చేశారు. డిసెంబర్ 17న దయారాంకు జీవిత ఖైదు విధిస్తూ ప్రత్యేక కోర్టు తీర్పు వెలువరించింది. అంటే, 17 రోజుల్లోనే పోలీసు దర్యాప్తు, కోర్టు విచారణ, తీర్పు.. అన్నీ ముగిశాయి. 'పోలీసులు చురుగ్గా పనిచేశారు. సకాలంలో శాస్త్రీయ ఆధారాలను సేకరించారు. బాధిత బాలిక వాంగ్మూలం కీలక పాత్ర పోషించింది. కోర్టు రోజువారీ విచారణ జరిపింది. దాంతో త్వరితగతిన తీర్పు సాధ్యమైంది' అని చురు జిల్లా ఎస్పీ తేజస్విని గౌతమ్ వివరించారు. దోషి దయారాం తండ్రికి కూడా గతంలో ఒక రేప్ కేసులో జైలు శిక్ష విధించారు.

# నిర్భయ దోషికి మరణ శిక్షే

## అక్షయ్ రివ్యూ పిటిషన్‌ను కొట్టేసిన సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ:** నిర్భయ అత్యాచారం, హత్య కేసులో దోషి అక్షయ్ కుమార్ సింగ్ తనకు విధించిన మరణ శిక్షను సమీక్షించాలంటూ దాఖలు చేసిన రివ్యూ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టేసింది. అక్షయ్ కుమార్ దాఖలు చేసిన రివ్యూ పిటిషన్‌ను బుధవారం జస్టిస్ ఆర్.బానుమతి, జస్టిస్ అశోక్ భూషణ్, జస్టిస్ ఏఎస్ బొప్పన్నలతో కూడిన ధర్మాసనం విచారించింది. 2017లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై సమీక్షకు ఎలాంటి ఆధారాలు లేవని ఈ సందర్భంగా ధర్మాసనం స్పష్టం చేసింది.


సుప్రీం తీర్పుపై నిర్భయ తల్లి ఆనందం

అక్షయ్‌కు మరణశిక్షను ధ్రువీకరిస్తూ తీర్పు వెలువరించింది. గత ఏడాది జులై 9న ఈ కేసులో మరో ముగ్గురు దోషులు ముఖేష్, పవన్‌గుప్తా, వినయ్ శర్మల రివ్యూ పిటిషన్‌ను కోర్టు కొట్టివేసిన విషయం తెలిసిందే. వారి రివ్యూ పిటిషన్లకి, అక్షయ్ పిటిషన్‌కి ఎలాంటి తేడా లేదని ఈ సందర్భంగా ధర్మాసనం తెలిపింది. దీంతో అక్షయ్ తరఫు లాయర్ రాష్ట్రపతిని క్షమాభిక్ష కోరడానికి మూడు వారాల గడువివ్వాలని కోరారు. రాజకీయపరమైన, మీడియా ఒత్తిళ్ల వల్లనే తన క్లయింట్‌ను దోషిగా తేల్చారని ఆరోపించారు. ఇక దోషులకు న్యాయ పరంగా క్యూరేటివ్ పిటిషన్ దాఖలు చేసుకునే అవకాశం మాత్రం మిగిలుంది.

**డెత్ వారెంట్లపై విచారణ 7కి వాయిదా**

నిర్భయ దోషులు ఉరిశిక్షపై రాష్ట్రపతిని క్షమాభిక్ష కోరుకుంటారో లేదో వారంలోగా వారి స్పందనను తెలుసుకోవాలని ఢిల్లీ కోర్టు తీహార్ జైలు అధికారుల్ని ఆదేశించింది. డెత్ వారెంట్లు జారీపై విచారణను జనవరి 7వ తేదీకి వాయిదా వేసింది.

## బిహార్‌లో మరో ఘోరం

**ససారాం:** బిహార్‌లోని రోహ్తాస్ జిల్లాలో ఓ దళిత మహిళపై నలుగురు వ్యక్తులు అత్యాచారానికి యత్నించగా ఆమె తప్పించుకుని పోలీసులకు ఫిర్యాదు చేసింది. అనంతరం మంగళవారం రాత్రి బాధితురాలిపై గుర్తు తెలియని వ్యక్తులు కాల్పులు జరపగా తీవ్రంగా గాయపడింది. నిందితులను ఆదివారమే అరెస్టు చేశామని ఎస్పీ వెల్లడించారు. కాల్పులు జరిపిన వారికోసం గాలిస్తున్నామన్నారు.

## మహారాష్ట్రలోనూ 'దిశ' తరహా చట్టం

**నాగపూర్:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి మహిళల భద్రతకు సంబంధించి యావత్ జాతికి దిశానిర్దేశం చేసేలా తీసుకువచ్చిన దిశ చట్టంపై సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. దిశ చట్టాన్ని దేశవ్యాప్తంగా అమలు చేయాలన్న డిమాండ్లు పుట్టుకొస్తున్నాయి. దిశ చట్టం ఎంత శక్తిమంతమైనదో గ్రహించిన మహారాష్ట్ర ప్రభుత్వం ఏపీ బాటలో నడవాలని యోచిస్తోంది. మహిళల అకృత్యాలపై 21 రోజుల్లోగా విచారణ జరిపి, అత్యాచారం కేసుల్లో మరణ దండన విధించాలని దిశ చట్టం చెబుతోంది. ఈ తరహాలోనే చట్టం చేయాలని భావిస్తున్నట్లు హోం మంత్రి ఏక్‌నాథ్ షిండే బుధవారం శాసన మండలిలో చెప్పారు. 'మహిళలపై అకృత్యాల విషయంలో చట్టాలను అమలు చేయడంతో పాటు ఆంధ్రప్రదేశ్‌లో దిశ చట్టం తరహాలో సత్వర న్యాయం కోసం ఒక కొత్త చట్టం తీసుకువచ్చే ఆలోచన ఉంది' అని హోం మంత్రి వెల్లడించారు. మహిళలు, చిన్నారులపై రోజు రోజుకి పెరిగిపోతున్న నేరాల విషయంలో విపక్షాలిచ్చిన సావధాన తీర్మానానికి హోం మంత్రి ఈ మేరకు బదులిచ్చారు.

## పనుల పురోగతిపై ప్రధాని సమీక్ష

**న్యూఢిల్లీ:** వరుసగా రెండోసారి బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత, ఆరు నెలల్లో వివిధ మంత్రిత్వ శాఖలు సాధించిన పురోగతిని ప్రధాని మోదీ శనివారం సమీక్షించనున్నారని అధికార వర్గాలు వెల్లడించాయి. గత ఆరు నెలల్లో తీసుకున్న నిర్ణయాలపై మంత్రిత్వ శాఖలు సంక్షిప్త ప్రెజెంటేషన్లు ఇవ్వనున్నాయి. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, సామాజిక రంగంపై ప్రధాని దృష్టి సారించినట్లు తెలుస్తోంది. సాధారణంగా మంత్రి మండలి ప్రతి నెలా కేబినెట్ భేటీ తరువాత సమావేశం అవుతుంది. కానీ ఈసారి సమావేశం ప్రత్యేకంగా జరుగుతోంది.

## ఎల్‌వోసీలో పరిస్థితి విషమించవచ్చు: రావత్

**న్యూఢిల్లీ:** నియంత్రణ రేఖ (ఎల్‌వోసీ) వద్ద పరిస్థితి ఏ క్షణమైనా తీవ్రరూపం దాల్చే అవకాశం ఉందని ఆర్మీ చీఫ్ జనరల్ బిపిన్ రావత్ తెలిపారు. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి పాకిస్తాన్ పదే పదే కాల్పులు జరుపుతోందని అన్నారు. ఏ చర్యలనైనా ఎదుర్కోవడానికి ఆర్మీ సిద్ధంగా ఉందని అన్నారు. ఆర్టికల్ 370 రద్దు చేసిన నాటి నుంచి పాకిస్తాన్ కవ్వింపు చర్యలకు పాల్పుడుతోన్న సంగతి తెలిసిందే. 2019 ఆగస్టు నుంచి అక్టోబర్ మధ్య పాకిస్తాన్ 950 సార్లు కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించినట్లు కేంద్ర హోంశాఖ సహాయక మంత్రి జి.కిషన్‌రెడ్డి లోక్‌సభలో గత నెలలో తెలిపారు.

## సైన్స్ ఆర్టికల్స్ ప్రచురణలో భారత్‌కు మూడో స్థానం

**వాషింగ్టన్:** ప్రపంచవ్యాప్తంగా సైన్స్, ఇంజనీరింగ్ రంగాలకు సంబంధించి అత్యధిక ఆర్టికల్స్ ప్రచురించిన దేశాల జాబితాలో భారత్ మూడో స్థానంలో నిలిచిందని అమెరికాకు చెందిన నేషనల్ సైన్స్ ఫౌండేషన్ (ఎన్‌ఎస్‌ఎఫ్) వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా 2008లో సైన్స్, ఇంజనీరింగ్ రంగాలకు సంబంధించి మొత్తం 17.5 లక్షల ఆర్టికల్స్ ప్రచురితమవ్వగా.. 2018 నాటికి ఆ సంఖ్య 25.5 లక్షలకు పెరిగిందని తెలిపింది. ఎన్‌ఎస్‌ఎఫ్ తాజాగా విడుదల చేసిన గణాంకాల ప్రకారం... అత్యధిక ఆర్టికల్స్ ప్రచురించిన దేశాలుగా చైనా, అమెరికా, భారత్ వరుసగా మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి. భారత్‌లో 2008లో 48,998 ఆర్టికల్స్ ప్రచురితమవ్వగా.. ఆ సంఖ్య 2018 నాటికి 1.35 లక్షలకు పెరిగింది.

తెలంగాణ ప్రభుత్వం
పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ
టెండరు నోటీసు
NIT No.RO/PRED/RR/185-211/2019-20 తేది:18-12-2019
పనుల సంఖ్య (27), పనుల పేరు: రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, వికారాబాద్ జిల్లాలలో వివిధ గ్రామాలు మరియు మండలాలలో R/F PWD రోడ్ ఏర్పాటు చేయుట, ఘట్‌కేసర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వాటర్ ప్లాంట్ & సివిల్ పనులు, కాంపౌండ్ వాల్, బాత్‌రూమ్స్ నిర్మాణం, R/F PWD రోడ్‌పై BT ఏర్పాటు చేయుట మరియు ఇతర అన్ని సివిల్ పనులు కొరకు దిగువ సంతకందారుచే ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫాం క్రింద ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. మొత్తం ECV: రూ. 60.70 కోట్లు. టెండరుదారులు టెండరు షెడ్యూల్సును తేది : 27-12-2019 నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును మరియు చివరి తేది :04-01-2020. తదుపరి అన్ని వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అంటే www.tender.telangana.gov.in నెట్‌లో చూడవచ్చును.ఇ-మెయిల్:se_pr_rr@telangana.gov.in. సం/- రీజినల్ ఆఫీసర్, P.R.E.D., రంగారెడ్డి
DIPR RO.No.1996-DP/CL/Advt/1/2019-20, Dt: 18.12.2019

APS RTC
TENDER NOTICE
పల్లె వెలుగు
APSRTC invites e-tenders for the following Ad contracts. Tender document can be downloaded from https://apsrtc.ap.gov.in/T_Advertisements.aspx, wef 19.12.2019. Bids to be submitted through https://tender.apeprocurement.gov.in only by obtaining digital keys.

| e-tender Id.No. | Contract & period | Bid sub.Date |
|---|---|---|
| 303476 | Ads on Sup-lux,Ultra deluxe buses (Incl.Hire) in NEC/VSP/EG/WG/KRI/GNT/OGL/KDP/KRNL/ATP regions (3yrs) | 06.01.2020 |
| 303019 | Ads on Passenger Seat Backs (NEC, EG, WG, KDP) (3 yrs) | 07.01.2020 |
| 303577 | Ads on Telugu velugu,Exp.City ord buses (incl hire) in NEC/VSP/EG/WG/KRI/GNT/OGL/NLR/CTR/KRNL/ATP (3 Yrs) | 08.01.2020 |
| 303547 | Ads on C.C.TV s (KRI,GNT regions)(3yrs) | 09.01.2020 |

No.C1/9(1)/2019-Dy.CTM(C-I),dt.17-12-2019. Chief Manager (Commercial)

Department of Agriculture
Government of Andhra Pradesh
Request for Proposal (RFP)
Department of Agriculture, AP invites information in prescribed formats in sealed covers from the interested manufacturers and MoU holder for Supply of Tarpaulins for empanelment towards supply of 250 GSM Black colour HDPE Tarpaulins Conforming to IS: 7903/2017 (Type-II) of Size (8x6) Mts in Andhra Pradesh State. for other details please visit www.apagrisnet.gov.in
Sd/- H Arun Kumar IAS,
Special Commissioner of Agriculture
DIPR RO.No.277PP/CL/Advt/1/2019-20, Dt.18.12.2019

IISER TIRUPATI
INDIAN INSTITUTE OF SCIENCE EDUCATION AND RESEARCH, TIRUPATI
(An Autonomous Institution of Ministry of HRD., Govt. of India)
EXPRESSION OF INTEREST FOR SUPPLY OF PRE-PRINTED STATIONERY FOR SEMESTER GRADE CARDS, FINAL CONSOLIDATED MARKSHEET AND DEGREE CERTIFICATE TO IISER, TIRUPATI
A pre-Indent conference is proposed to be held on 27th December, 2019 at IISER, Tirupati with the prospective manufactures, their authorized channel partners or agents/suppliers to discuss with the Committee on the aspects of Material, Quality, Feature, Design, any other essential parameters for the supply of Pre-Printed Stationery for Semester Grade Cards, Final Consolidated Mark sheet, Degree Certificates and Convocation Folders at IISER, Tirupati on yearly basis as and when required.
For further details please visit our website http://www.iisertirupati.ac.in
Sd/- Director

TSPSC
TELANGANA STATE PUBLIC SERVICE COMMISSION
Prathibha Bhavan, M.J.Road, Nampally, Hyderabad
ASSISTANT REGISTRAR AND STATISTICAL OFFICER IN THE KALOJI NARAYANA RAO UNIVERSITY OF HEALTH SCIENCES, WARANGAL
(GENERAL RECRUITMENT)
Applications are invited online from qualified candidates through the proforma application to be made available on Commission's website (www.tspsc.gov.in) for the Notifications pertaining to the posts in Kaloji Narayana Rao University of Health Sciences, Warangal, Telangana.

| Notification Number | Name of the Post | No. of Vacancies |
|---|---|---|
| 08/2019 | Assistant Registrar | 04 |
| 09/2019 | Statistical Officer | 01 |

The Candidates are advised to visit commission's website : (www.tspsc.gov.in) for detailed Notifications, submission of online application and last date for Submission of Applications, which will be uploaded later.
Hyderabad Sd/-
Dt : 18/12/2019 SECRETARY
DIPR RO. No. 548PP/CL/Advt/1/2019-20 Dt: 18.12.2019

## క్లుప్తంగా...

### ఎన్‌పీఏ డైరెక్టర్‌గా అతుల్ కర్వాల్



**సాక్షి, హైదరాబాద్:** సర్దార్ వల్లభ్‌భాయ్ నేషనల్ పోలీస్ అకాడమీ (ఎన్‌పీఏ) నూతన డైరెక్టర్‌గా అతుల్ కర్వాల్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం కేంద్ర హోంశాఖ నిర్ణయం తీసుకుంది. 1988 ఐపీఎస్ బ్యాచ్, గుజరాత్ కేడర్‌కు చెందిన అతుల్ ప్రస్తుతం సీఆర్‌పీఎఫ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. అడిషనల్ డైరెక్టర్ జనరల్ (ఏడీజీ) ర్యాంకులో ఉన్న ఆయన 2021 డిసెంబరు 5 వరకు ఎన్‌పీఏ డైరెక్టర్‌గా కొనసాగుతారని సమాచారం.

### చైతన్య మహిళా సంఘం నాయకురాలు దేవేంద్ర అరెస్ట్

**మావోయిస్టులతో సంబంధాలు ఉన్నట్లు ఆరోపణ**



**మేడిపల్లి:** మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పర్వతాపూర్‌లో నివసిస్తున్న చైతన్య మహిళా సంఘం నాయకురాలు దేవేంద్రను మావోయిస్టులతో సంబంధాలు ఉన్నట్లు ఆరోపిస్తూ కొత్తగూడెం పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. అయితే తమ కుమార్తెను పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారని ఆమె తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. బుధవారం తెల్లవారుజామున పోలీసులు అక్రమంగా తమ ఇంట్లోకి చొరబడి పుస్తకాలను చిందరవందర చేశారని, అనంతరం వారి వెంట తెచ్చుకున్న పుస్తకాలను తమ కళ్ల ముందు ఇంట్లో పడేశారని చెబుతున్నారు. అనంతరం తమ కూతురిని అక్రమంగా అరెస్టు చేసి తీసుకెళ్లినట్లు దేవేంద్ర తండ్రి సోమయ్య, తల్లి యాదమ్మ మీడియాకు తెలిపారు.

### వీణా వాణీలకు వేర్వేరుగానే అడ్మిషన్లు

**ప్రభుత్వ అనుమతి కోరాలని విద్యాశాఖ నిర్ణయం**

**సాక్షి, హైదరాబాద్:** అవిభక్త కవలలు వీణా వాణీలను పదో తరగతిలో చేర్పించిన నేపథ్యంలో వారి ప్రవేశాలను వేర్వేరుగానే (ఇద్దరుగా) గుర్తించాలని, అప్పుడే పదో తరగతి పరీక్షలు ఇద్దరు వేర్వేరు పేర్లతో రాయడం సాధ్యమవుతుందని విద్యాశాఖ భావిస్తోంది. ఈ నేపథ్యంలో వారి పరిస్థితిని ప్రత్యేకంగా పరిగణించి అనుమతి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరాలని నిర్ణయించింది. ఈ మేరకు ఒకట్రెండు రోజుల్లో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించనుంది. తాము వేర్వేరుగానే పరీక్షలు రాస్తామని, తమను ఇద్దరుగానే పరిగణించాలని వీణా వాణీలు అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో, ఈ మేరకు విద్యాశాఖ నిర్ణయం తీసుకుంది.

# సూపర్ డూపర్ కంప్యూటర్లు అవసరమే..



ట్రాఫిక్ చిక్కుల నుంచి తప్పించుకోవడం మొదలుకొని ప్రాణాంతక కేన్సర్ చికిత్స వరకు.. కంప్యూటర్ల వాడకం లేని రంగమంటూ లేదంటే అతిశయోక్తి కాదు.. ఏటా కంప్యూటర్ల వేగం పెరుగుతూనే ఉన్నా.. మరింత వేగవంతమైన యంత్రాల కోసం ప్రయత్నాలు ఊపందుకుంటున్నాయి.. ఎందుకు? నిజంగానే వీటి అవసరముందా? అడ్డంకులు ఏంటి? అధిగమించేందుకు చేస్తున్న ప్రయత్నాలు ఎలా సాగుతున్నాయి? ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానాలు తెలుసుకునేందుకు కంప్యూటర్ శాస్త్రవేత్త చిరంజీబ్ సుర్‌ను 'సాక్షి' కలిసింది. అత్యధిక సామర్థ్యంతో పనిచేసే కంప్యూటింగ్ వ్యవస్థలపై హైదరాబాద్‌లో జరుగుతున్న హెచ్‌ఐపీసీ అంతర్జాతీయ సదస్సుకు అధ్యక్షుడు చిరంజీబ్ సమాధానాలు.. – సాక్షి, హైదరాబాద్

**త్వరలో మన యాసను కూడా గుర్తుపట్టే వ్యవస్థలు**

**హెచ్‌ఐపీసీ అధ్యక్షుడు చిరంజీబ్**

**'మూర్స్'ను అధిగమించేందుకు గ్రాఫిక్ ప్రాసెసింగ్ యూనిట్లు**

**'ఫీల్డ్ ప్రోగ్రామబుల్ గేట్ అరే'ల ద్వారా హార్డ్‌వేర్ సామర్థ్యం పెంపు**

**ప్ర: హై పర్ఫార్మెన్స్ కంప్యూటింగ్ (హెచ్‌పీసీ) అవసరం ఏంటి?**

**జ:** చాలా ఉంది. ఉదాహరణకు మనలో చాలామంది ఉపయోగిస్తున్న గూగుల్ మ్యాప్స్‌ను తీసుకుందాం. ఇప్పుడైతే మీరు స్క్రీన్‌పై వేలిని కదిలిస్తూ సమాచారాన్ని రాబట్టుకుంటున్నారు గానీ.. భవిష్యత్తులో మీ మాటతోనే అన్ని పనులు చక్కబెట్టుకోవచ్చు. పర్సనల్ అసిస్టెంట్ల రూపంలో ఇప్పటికే మాటలకు స్పందించే వ్యవస్థలు ఉన్నా.. హెచ్‌పీసీ కారణంగా భాషతోపాటు.. యాసను కూడా గుర్తించి తదనుగుణంగా స్పందించే వ్యవస్థలు అందుబాటులోకి వస్తాయి. వాతావరణ అంచనాలను మరింత కచ్చితంగా తెలుసుకునేందుకు, కొత్త కొత్త మందుల ఆవిష్కరణలోనూ కీలక ప్రాత పోషించనుంది. సమాచారాన్ని ఎప్పటికప్పుడు విశ్లేషించి అందరికీ ఉపయోగపడే కొత్త కొత్త విషయాలను తెలుసుకునేందుకు, వాటిని ఆచరణలో పెట్టేందుకు కూడా కంప్యూటర్ల వేగం, సామర్థ్యం మరింత పెరగాల్సి ఉంది.

**ప్ర: కంప్యూటర్ల వేగం, సామర్థ్యం ప్రతి 18 నెలలకు రెట్టింపు అవుతుందని మూర్స్ నిబంధన చెబుతుంది. ప్రస్తుతం ట్రాన్సిస్టర్ల సైజు 9 నానోమీటర్లు. ఇంతకంటే తక్కువ సైజువి తయారు చేసే అవకాశం లేదు. మరి.. కంప్యూటర్ల వేగం పెంచడం ఎలా సాధ్యం?**

**జ:** మూర్స్ నిబంధనను అధిగమించేందుకు గ్రాఫిక్ ప్రాసెసింగ్ యూనిట్లను ఉపయోగిస్తున్నారు. అలాగే 'ఫీల్డ్ ప్రోగ్రామబుల్ గేట్ అరే'ల వంటి పరికరాల ద్వారా హార్డ్‌వేర్ సామర్థ్యాన్ని పెంచుతున్నారు. సాఫ్ట్‌వేర్లు పనిచేసే తీరులోనూ మార్పులు చేయడం ద్వారా డెస్క్‌టాప్ కంప్యూటర్‌కే సూపర్ కంప్యూటర్ సామర్థ్యం ఇవ్వగలుగుతున్నాం. వైద్య రంగంలోనూ హెచ్‌పీసీతో అద్భుతాలు సృష్టించొచ్చు. ఒకసారి ఎంఆర్ఐ తీసుకుంటే రేడియేషన్ వస్తుందని మనకు తెలుసు. ఈ సమస్యను అధిగమించేందుకు హెచ్‌ఐపీసీ పనికొస్తుంది. ఒకసారి తీసిన ఎంఆర్ఐ ఆధారంగా సమస్యను క్షుణ్నంగా అర్థం చేసుకోవడం, కేన్సర్ కణితుల స్థానం, సైజు, ఆకారాలను కచ్చితంగా నిర్ధారించడం సాధ్యమవుతాయి.

**ప్ర: హెచ్‌ఐపీసీ–2019 గురించి చెప్పండి**

**జ:** సుమారు 500 మంది దేశ, విదేశీ ప్రతినిధులు పాల్గొంటున్నారు. ఈ సదస్సు నిర్వహణ మొత్తాన్ని యువ ఇంజనీర్లు, విద్యార్థులు చేపట్టారు. హెచ్‌ఐపీసీ లాభాపేక్ష లేని సంస్థ. హెచ్‌ఐపీసీని విస్తృత స్థాయిలో అందుబాటులోకి తెచ్చేందుకు అటు బోధనారంగంలో ఉన్న వారిని, పారిశ్రామిక వర్గాలను ఒకచోట చేర్చేందుకు ప్రయత్నిస్తోంది.

**భారత్‌లో హెచ్‌ఐపీసీ పరిస్థితి ఏంటి?**

నేషనల్ సూపర్ కంప్యూటింగ్ మిషన్‌ను కేంద్రం ఇప్పటికే అమలు చేస్తోంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయి సమస్యల పరిష్కారానికి సూపర్ కంప్యూటర్లను ఉపయోగించడం, అందుకు తగ్గ మానవ వనరులు అభివృద్ధి చేయడం ఈ మిషన్ ప్రధాన ఉద్దేశం. ఇందులో భాగంగానే ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రధాని నరేంద్రమోదీ 'పరమ్ శివాయ్'పేరుతో ఓ అత్యాధునిక సూపర్ కంప్యూటర్‌ను అభివృద్ధి చేశారు. సెకనుకు 833 టెరాఫ్లాప్స్ వేగంతో పనిచేస్తుంది ఇది. అయితే దేశంలో హై పర్ఫార్మెన్స్ కంప్యూటింగ్‌పై కోర్సులు అందించే విద్యాసంస్థలు చాలా తక్కువగా ఉన్నాయి. విశ్వవిద్యాలయాల స్థాయిలోనూ ఈ రంగంలో కోర్సులు మొదలైతే సమీప భవిష్యత్తులో డేటా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాల్లో దేశ యువత ఉద్యోగాలు సంపాదించుకునే అవకాశం ఉంటుంది. హెచ్‌ఐపీసీ రంగంలో పరిశోధనలను ముమ్మరం చేసేందుకు, అంతర్జాతీయ పురోగతిని అర్థం చేసుకునేందుకు హెచ్‌ఐపీసీ వంటి సదస్సులు ఏర్పాటు చేస్తున్నాం.

## బెల్టు షాపులు, పర్మిట్ రూంలు వెంటనే మూసేయాలి: భట్టి



**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం చేసిన అప్పులను ప్రజలపై మద్యం రూపంలో రుద్దుతోందని కాంగ్రెస్ శాసన సభాపక్ష (సీఎల్పీ) నేత మల్లు భట్టి విక్రమార్క ఆరోపించారు. మద్యంపై వచ్చే ఆదాయంతో రాష్ట్రాన్ని పాలించాలని కేసీఆర్ చూస్తున్నారని వ్యాఖ్యానించారు. బుధవారం అసెంబ్లీ మీడియా హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భట్టి మాట్లాడుతూ మిషన్ భగీరథ లాంటి ప్రాజెక్టుల కోసం చేసిన అప్పులను మద్యం అమ్మకాల ద్వారా వచ్చే ఆదాయంతో తీర్చేందుకు కేసీఆర్ ప్రణాళిక రూపొందించినట్టు కనిపిస్తోందని ఎద్దేవా చేశారు. సామాన్య ప్రజలను మద్యానికి బానిసలు చేసేలా విచ్చలవిడిగా మద్యాన్ని అమ్ముతున్నారని, అదనపు ఆదాయం కోసం ధరలు కూడా పెంచారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం అప్పులు చేయడం మానితే సామాన్య ప్రజలపై భారం తగ్గుతుందన్నారు. రాష్ట్రంలో మద్యాన్ని నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, వెంటనే బెల్టు షాపులు, పర్మిట్ రూంలు, హైవేలపై మద్యం విక్రయాలు నిలిపివేయాలని భట్టి డిమాండ్ చేశారు. మద్యంపై ప్రభుత్వం వెనక్కు తగ్గకపోతే ప్రజా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. దీనిపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమ కార్యాచరణకు త్వరలోనే శ్రీకారం చుడతామన్నారు.

## నెలాఖరులో చైతన్య సదస్సులు: లక్ష్మణ్



**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో టీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల నిజ స్వరూపాన్ని బయట పెట్టేందుకు ఈ నెలాఖరులో చైతన్య సదస్సులు నిర్వహించనున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ తెలిపారు. దేశ ప్రయోజనాలకు భంగం కలిగిస్తూ మత రాజకీయాలకు పాల్పడుతున్న ఆ రెండు పార్టీలను ప్రజల ముందు దోషులుగా నిలబెడతామన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని నగరాలు, పట్టణాల్లో మేధావులు, విద్యావంతులతో పెద్దఎత్తున సదస్సులు నిర్వహిస్తామని, వాటిల్లో పార్టీ జాతీయ, రాష్ట్ర నాయకులు పాల్గొంటారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్‌లో స్థిరపడిన పొరుగు రాష్ట్ర ప్రజలపై విషం చిమ్మిన కేసీఆర్ ఇప్పుడు పాక్ ముస్లింలకు వకాల్తా పుచ్చుకొని మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన పౌరసత్వ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేయడం విడ్డూరంగా ఉందన్నారు. పాక్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్‌లో మత హింసను ఎదుర్కొలేక మనదేశానికి వచ్చిన శరణార్థులను రక్షించేందుకే తెచ్చిన చట్టాన్ని వ్యతిరేకించడంలో ఎవరి ప్రయోజనాలను ఆశిస్తున్నారో కేసీఆర్ స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. కులం, మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చు పెట్టి చలి మంట కాచుకునే కాంగ్రెస్ ఇప్పుడు మరో సారి పౌరసత్వ బిల్లుపై మైనారిటీలను రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవాలని చూస్తోందని దుయ్యబట్టారు. చూస్తుంటే పాక్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌కు కూడా భారత పౌరసత్వం ఇవ్వాలని కాంగ్రెస్ డిమాండ్ చేసినా పెద్దగా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదన్నారు. దేశంలో 11 ఏళ్లపాటు నివసిస్తే పౌరసత్వం దక్కించుకునే వెసులుబాటు ఇప్పటికీ 1955 చట్టం ద్వారా కొనసాగుతోందన్నారు. ఎక్కడికీ పోలేక భారత్‌కే తిరిగి వచ్చిన మన వాళ్లను మనమే కడుపులో పెట్టుకోవాలన్న సదుద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నారన్నారు.

## నష్టాల డిపోలపై మంత్రి పువ్వాడ దృష్టి



**సాక్షి, హైదరాబాద్:** ఆర్టీసీని గాడిలో పెట్టేందుకు సీఎం కేసీఆర్ స్వయంగా సంస్థను పర్యవేక్షిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పుడు రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మొదలు ఆర్టీసీ ఎండీ సునీల్ శర్మ, ఇతర ఉన్నతాధికారులు ఆయనను అనుసరిస్తున్నారు. దీనిలో భాగంగా నష్టాలు ఎక్కువగా ఉన్న అన్ని ఆర్టీసీ డిపోలపై మంత్రి పువ్వాడ ప్రత్యేక దృష్టి సారిస్తారు. ఎండీ సునీల్ శర్మ కూకట్‌పల్లి డిపోను దత్తత తీసుకున్నారు. కూకట్‌పల్లిలో నష్టాలు ఎక్కువగా ఉండటంతోపాటు అది కీలక డిపో కావడంతో ఆయన దాన్ని దత్తత తీసుకున్నారు. హైదరాబాద్ సిటీ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వర్‌రావు కాచిగూడ డిపోను.. ఇంజనీరింగ్ విభాగంతోపాటు ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్ ప్రాంతాలను పర్యవేక్షిస్తున్న మరో ఈడీ వినోద్ తొర్రూరు డిపోను దత్తత తీసుకున్నారు. ఈడీలే కాకుండా అన్ని విభాగాల అధిపతులు, రీజినల్ మేనేజర్లు సైతం ఒక్కో డిపోను దత్తత తీసుకోవాలని ఎండీ ఆదేశించారు. ప్రస్తుతం దత్తత తీసుకున్న డిపోలను పర్యవేక్షించడం ద్వారా వాటిల్లోని లోపాలను గుర్తించి, సరిదిద్దాలని.. అవే లోపాలు ఇతర డిపోల్లోనూ ఉండే అవకాశం ఉన్నందున.. వాటిని కూడా సరిదిద్దేందుకు అవకాశం కలుగుతుందని ఎండీ భావిస్తున్నారు.

## పురపాలికల్లో కొత్త పనులకు నో!

**అనుమతులు జారీ చేయొద్దని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు..**

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(టీయూఎఫ్‌ఐడీసీ) ఆధ్వర్యంలో రాష్ట్రంలోని పురపాలికల్లో కొత్త అభివృద్ధి పనులకు పరిపాలనాపర అనుమతులు జారీ చేయవద్దని జిల్లా కలెక్టర్లకు కార్పొరేషన్ వైస్ చైర్మన్, ఎండీ, పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి అరవింద్ కుమార్ లేఖ రాశారు. పురపాలికలకు ఇప్పటికే మంజూరు చేసిన మౌలిక సదుపాయాల అభివృద్ధి పనుల వ్యయం.. టీయూఎఫ్ఐడీసీకి బ్యాంకులు మంజూరు చేసిన రుణాల పరిమితిని మించి పోయిందని తెలిపారు. ఇకపై కార్పొరేషన్ అనుమతి లేకుండా కొత్త పనులకు అనుమతులు జారీ చేయవద్దని జిల్లా కలెక్టర్లకు స్పష్టంచేశారు. ఏదైనా పురపాలికకు పనులు మంజూరు చేస్తూ ఇప్పటికే పరిపాలనాపర ఉత్తర్వులు జారీ చేసినా, తమ అనుమతి లేకుండా సాంకేతిక అనుమతులు జారీ చేయరాదని అన్నారు. ఈ ఉత్తర్వులను ఉల్లంఘిస్తే తీవ్ర చర్యలు తప్పవని హెచ్చరించారు. పురపాలికల్లో స్థానిక పాలకవర్గాల ప్రమేయం లేకుండా నేరుగా రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రూ.3 వేల కోట్లతో మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులు చేపట్టేందుకు గతేడాది మార్చిలో ఉత్తర్వులు జారీ అయ్యాయి. స్థానిక పాలకవర్గాల ఆధ్వర్యంలో చేపడుతున్న పనుల్లో నాణ్యత లేకపోవడం, తీవ్రమైన అవినీతి జరుగుతున్నట్లు ఆరోపణలు రావడంతో రాష్ట్ర ప్రభుత్వమే నేరుగా పనులు చేపట్టాలని అప్పట్లో నిర్ణయించింది. పబ్లిక్ హెల్త్ అండ్ మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో, జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణలో ఈ పనులను నిర్వహిస్తోంది. ఈ పనుల కోసం కార్పొరేషన్ ఆధ్వర్యంలో సమీకరించిన రుణాలు ఇప్పటికే ఖర్చయిపోవడంతో కొత్త పనులకు అనుమతులు ఇవ్వరాదని తాజాగా ప్రభుత్వం నిర్ణయించింది.

## ట్రైనీ ఐపీఎస్‌ను ఎలా సస్పెండ్ చేస్తారు?

**కేంద్ర హోంశాఖను ప్రశ్నించిన క్యాట్**

**సాక్షి, హైదరాబాద్:** ట్రైనీ ఐపీఎస్ అధికారి కేవీ మహేశ్వర్‌రెడ్డిని సస్పెండ్ చేసిన విధానంపై సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ (క్యాట్) పలు కీలక ప్రశ్నలను సంధించింది. ఆరోపణలు వస్తే దర్యాప్తులో భాగంగా సర్వీస్ నుంచి మాత్రమే సస్పెండ్ చేసేందుకు నిబంధనలు అనుమతిస్తున్నాయని, నియామక ఉత్తర్వులను ఎలా సస్పెండ్ చేస్తారని కేంద్ర హోంశాఖను ప్రశ్నించింది. దీనిపై వివరణ ఇవ్వాలని క్యాట్ అడ్మినిస్ట్రేటివ్ మెంబర్ బీవీ సుధాకర్ బుధవారం కేంద్ర హోంశాఖను ఆదేశించారు. సెంట్రల్ సర్వీసెస్ ఆఫీసర్స్ రూల్స్‌కు వ్యతిరేకంగా మహేశ్వర్‌రెడ్డిని ఎలా సస్పెండ్ చేశారో వివరణ ఇవ్వాలని కోరారు. తనను పెళ్లి చేసుకున్నాక మోసం చేశాడని భువన అనే మహిళ ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీనిపై మహేశ్వర్‌రెడ్డి వివరణ ఇచ్చాక ఏం జరిగిందో చెప్పాలని ముస్సోరీలోని కేంద్ర సర్వీసుల శిక్షణ కేంద్రం డైరెక్టర్‌ను క్యాట్ ఆదేశించింది. మహేశ్వర్‌రెడ్డి వివరణను జాతీయ పోలీస్ అకాడమీ, కేంద్ర హోం శాఖలకు తెలియజేశారో లేదో చెప్పాలని వివరణ అడిగింది. తదుపరి విచారణ ఈ నెల 24కి వాయిదా వేసింది. కాగా.. కేవలం ఆరోపణల ఫిర్యాదు ఆధారంగా తనను సస్పెండ్ చేయడం చట్ట వ్యతిరేకమని ప్రకటించాలని కోరుతూ మహేశ్వర్‌రెడ్డి క్యాట్‌ను ఆశ్రయించారు. ఆరోపణలు వస్తేనో, దాని ఆధారంగా పోలీసు కేసు నమోదైతేనో సస్పెండ్ చేయడం చట్ట వ్యతిరేకమని మహేశ్వర్‌రెడ్డి తరఫు న్యాయవాది కె.సుధాకర్‌రెడ్డి వాదించారు. ఆరోపణలపై కోర్టులో నిరూపణ కాకుండానే తప్పు చేశారనే నిర్ణయానికి వచ్చేసి సస్పెండ్ చేయడం చెల్లదన్నారు. ఆలిండియా సర్వీస్ రూల్ 11(2) ప్రకారం ఆరోపణల నేపథ్యంలో మహేశ్వర్‌రెడ్డిని సస్పెండ్ చేసే అధికారం కేంద్రానికి ఉందని కేంద్ర హోంశాఖ న్యాయవాది వాసిరెడ్డి వినోద్‌కుమార్ ప్రతివాదన చేశారు.

## కోర్టు ధిక్కార కేసులో ఎమ్మెల్యేకు నోటీసు

**పలువురు అధికారులకూ హైకోర్టు నోటీసులు**

**సాక్షి, హైదరాబాద్:** కోర్టు ఆదేశాలను ధిక్కరించారనే కేసులో కామారెడ్డి శాసనసభ్యుడు (టీఆర్‌ఎస్) గంప గోవర్దన్‌తోపాటు పలువురు అధికారులకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. గంప గోవర్దన్‌తోపాటు రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి సోమేశ్‌కుమార్, కామారెడ్డి జిల్లా కలెక్టర్ సత్యనారాయణ, ఆర్డీవో కె.రాజేంద్రకుమార్, ఎమ్మార్వో జి.రాజేంద్రకుమార్‌లపై ఫారం–1 కింద కోర్టు ధిక్కార చర్యలు ఎందుకు తీసుకోరాదో తెలియజేయాలని నోటీసులో పేర్కొంది. ఈమేరకు బుధవారం న్యాయమూర్తి జస్టిస్ చల్లా కోదండరాం ఉత్తర్వులు జారీ చేశారు. టీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయ నిర్మాణం కోసం తమ భూమిని తీసుకోరాదని ఈ ఏడాది సెప్టెంబర్ 9న హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వులను వారంతా ఉల్లంఘించారని కామారెడ్డికి చెందిన నాగన్నగారి ప్రతాప్‌రెడ్డి, బూసాని ప్రభాకర్‌లు కోర్టు ధిక్కార వ్యాజ్యాలను దాఖలు చేశారు. టీఆర్‌ఎస్ పార్టీ ఆఫీసు నిర్మాణం కోసం కామారెడ్డి మండలం వడ్లూరు గ్రామం సర్వే నెంబర్ 527లోని 1.20 ఎకరాలను రెవెన్యూ అధికారులు కేటాయించడాన్ని పిటిషనర్లు గతంలో హైకోర్టులో సవాల్ చేశారు. భూమి విషయంలో జోక్యం చేసుకోరాదని, ఆ భూమిలో రైతులు వ్యవసాయం చేసుకునేందుకు ఎలాంటి అడ్డంకులు కలిగించరాదని గతంలో హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను చూపించినా అధికారులు ఖాతరు చేయకుండా ఎకరం భూమిలో పార్టీ కార్యాలయ భవన నిర్మాణ పనుల్ని చేయడమే కాకుండా పక్కనే ఉన్న 20 కుంట్ల భూమిని కూడా కేటాయింపు చేయబోతున్నారని పిటిషనర్ల తరఫు న్యాయవాది హైకోర్టు దృష్టికి తెచ్చారు. దీంతో ప్రతివాదులందరికీ హైకోర్టు కోర్టు ధిక్కార నోటీసులు జారీ చేస్తూ, విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.




సాక్షి
గురువారం, డిసెంబర్, 19

# తగునా ఇది సూకీ!

ఉన్నట్టుండి పాత్రలు తారుమారైతే, స్వరం మారిపోతే దిగ్భ్రాంతిపడటం... కలో నిజమో తెలియక కంగారుపడటం ఎలాంటివారికైనా తప్పదు. నోబెల్ శాంతి పురస్కార గ్రహీత ఆంగ్‌సాన్ సూకీ అంతర్జాతీయ న్యాయస్థానం(ఐసీజే) ముందు హాజరుకావడం, ఈ శతాబ్దంలోనే అత్యంత దారుణమైన మానవ హననమని ప్రపంచమంతా ముక్తకంఠంతో నిరసించిన క్రౌర్యాన్ని కప్పెట్టే యత్నం చేయడం కళ్లారా చూసినవారికి అలాగే అనిపించింది. ఆంగ్‌సాన్ సూకీ సాధారణ మహిళ కాదు. పదిహేనేళ్లపాటు మయన్మార్ సైనిక దుశ్శాసకుల ఉక్కు నిర్బంధంలో మగ్గినా ఆమె మొక్కవోని పోరాట దీక్ష ప్రదర్శించారు. అలాంటి నాయకురాలు గత వారం ఐసీజే ముందు దాదాపు 30 నిమిషాలపాటు సైనిక పాలకులను సమర్థిస్తూ మాట్లాడటం ఎవరూ ఊహించలేరు. 2017లో మయన్మార్‌లో సైన్యం రోహింగ్యా తెగవారిపై విరుచుకుపడి గ్రామాలకు గ్రామాలు తగలబెట్టి, వేలాదిమందిని ఊచకోత కోసిన ఉదంతంపై దర్యాప్తు జరిపించి కారకులైనవారిని కఠినంగా దండించాలని ఆఫ్రికా ఖండంలోని అతి చిన్న దేశం గాంబియా ఐసీజేలో దాఖలు చేసిన ఫిర్యాదుపై జరిగిన విచారణకు ఆమె హాజరయ్యారు. మయన్మార్ సైన్యంపై వచ్చిన ఆరోపణలన్నీ సత్యదూరమని ఆమె గట్టిగా వాదించారు. తరచు సైనికులపైనా, పౌరులపైనా సాయుధ దాడులకు పాల్పడుతున్న ఆరకాన్ రోహింగ్యా సాల్వేషన్ ఆర్మీ(అర్సా) సంస్థను అదుపు చేసేందుకు సైన్యం తీసుకున్న చర్యలపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆమె ఆరోపించారు. 2017 ఆగస్టు 25న వేలాదిమంది అర్సా సాయుధులు 30 పోలీసు పోస్టులపైనా, గ్రామాలపైనా, రఖైన్‌లోని సైనిక స్థావరంపైనా దాడులు జరిపినప్పుడు సైన్యం వాటిని తిప్పికొట్టిందేతప్ప పౌరులను ఊచకోత కోసిందనడం అబద్ధమని సూకీ సెలవిచ్చారు.

బాలికలపైనా, మహిళలపైనా అత్యాచారాలు జరిపిన సైనికులు, ఇళ్లల్లో చిన్న పిల్లల్ని నిర్దాక్షిణ్యంగా విసిరేశారని న్యాయమూర్తుల ముందు మహిళలు వాంగ్మూలం ఇస్తుండగా నిర్వికారంగా చూస్తూ ఉండిపోయిన సూకీ, ఆ మర్నాడు సైన్యాన్ని గట్టిగా వెనకేసుకొస్తూ ప్రసంగించిన తీరు అందరినీ నివ్వెరపరిచింది. దాదాపు అరవైయ్యేళ్లుగా సాగుతున్న సైనిక నియంతృత్వంనుంచి 2015లో మయన్మార్ విముక్తమైనట్టు కనిపించినా ఆ దేశంలో ఇప్పటికీ సైన్యానిదే ఆధిపత్యం. ఆంగ్‌సాన్ సూకీని విడుదల చేసి ఆమె రాజకీయ రంగ ప్రవేశానికి సైనికాధిపతులు అనుమతించినా, దేశాధినేత కాకుండా నిబంధనలు పెట్టారు. కనుక ప్రధాని పదవితో సమానమైన స్టేట్ కౌన్సిలర్ హోదాలో మాత్రమే ఆమె కొనసాగుతున్నారు. ఇప్పుడు రోహింగ్యాల విషయంలో వారి అభీష్టాన్ని కాదంటే ఆ పదవి కూడా ఉండదన్న ఆందోళనతో సైనిక పాలకులకు సూకీ వంతపాడుతున్నారు.

మయన్మార్ సైన్యం తమ దురాగతాలకు సాక్ష్యాలు లేకుండా చేయడం కోసం గ్రామాలకు గ్రామాలను కాల్చి బూడిద చేసింది. కొందరు ఆరోపిస్తున్నట్టు తమ సైనికులు అత్యాచారాలకు పాల్పడలేదని, పౌరుల్ని కాల్చి చంపలేదని వాదించడానికి అసలు రోహింగ్యాలు చెబుతున్నచోట గ్రామాలే లేవని బుకాయించడం కోసమే దీన్నంతటినీ సాగించారు. అయితే ఉపగ్రహ ఛాయా చిత్రాలు జరిగిందేమిటో స్పష్టంగా వెల్లడిస్తున్నాయి. ఇదే ఊచకోత మయన్మార్‌లో కాక మరోచోట జరిగుంటే అగ్రరాజ్యాలు తెగ ఆవేశపడేవి. ఆ దేశానికి సైన్యాన్ని తరలించేవి. పాలకుల్ని బెదిరించేవి. కానీ మయన్మార్ విషయంలో అది చెల్లుబాటు కాదు. దురాక్రమణకు ప్రయత్నిస్తే పొరుగునున్న చైనా దాన్నంతటినీ చూస్తూ ఊరుకోదు. ఆ దేశ పాలకులకు వత్తాసుగా ముందుకొస్తుంది. అందుకు సిద్ధపడదామనుకున్నా అదేమంత లాభసాటి కాదు. భూగోళంపై ఏమూల సహజవనరులున్నా వాలిపోయే తమ దేశంలోని కార్పొరేట్లకు రోహింగ్యాల గడ్డ రఖైన్ ఏమాత్రం పనికొచ్చే భూమి కాదు. అక్కడున్న సహజ వనరులు అతి స్వల్పం. కొద్దిమంది పౌరులకు పనికల్పించేందుకు కూడా ఆ వనరులు పనికి రావు. ఇక లాభాల మాటే లేదు. ప్రపంచంలో ముస్లింలకు తామే ప్రాతినిధ్యం వహిస్తున్నామని చెప్పుకునే దేశాలు చాలావున్నాయి. అందులో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, సౌదీ అరేబియావంటి సంపన్న దేశాలున్నాయి. కండబలం ప్రదర్శించడానికి వెనకాడని టర్కీ ఉంది. ఇస్లామిక్ దేశాల సంస్థ(ఓఐసీ) వంటివున్నాయి. ఎవరికీ రోహింగ్యాల వెతలు పట్టలేదు. కళ్లముందు అన్యాయం జరుగుతుంటే దాన్ని ఎదిరించడానికి లేదా కనీసం అది తప్పని చెప్పడానికి దండిగా డబ్బు, కండబలం ఉండక్కర్లేదు. కాస్తంత నైతికబలం ఉంటే చాలు. కనీసం ఆఫ్రికా ఖండంలో ఎక్కడుందో ఎవరికీ తెలియని గాంబియా చేసింది ఆ పనే. అది మయన్మార్‌కు 11,265 కిలోమీటర్ల దూరానుంది. అయినా స్పందించింది. కడవలకొద్దీ కన్నీళ్లు కార్చడం తప్ప, రోహింగ్యాల కోసం ఏమీ చేయని బడా దేశాలు సిగ్గుపడేలా ఈ దారుణాన్ని ఐసీజే దృష్టికి తీసుకురావాలని అది నిర్ణయించింది.

ఇప్పుడు ఐసీజేలో సైనిక దురాగతాలను వెనకేసుకొచ్చిన సూకీ వారి బాటలోనే కనీసం రోహింగ్యాల పేరెత్తడానికి కూడా ఇష్టపడలేదు. ఒకే ఒక్క సందర్భంలో... అది కూడా 'అర్సా' గురించి చెప్పవలసి వచ్చిన సందర్భంలో ఆ పేరు ప్రస్తావించారు. కనీస అవసరాలైన తిండి, బట్ట, ఆవాసం, వైద్యం వంటివి లేక తరతరాలుగా రోహింగ్యాలు ఇబ్బందులు పడుతున్నారు. సైన్యం ఆగడాలతో పొరుగునున్న బంగ్లాదేశ్‌కు పోయి అత్యంత దైన్యస్థితిలో శిబిరాల్లో తలదాచుకుంటున్నారు. ఇప్పుడు జరిగింది ఐసీజే విచారణ మాత్రమే. ఇందులో దోషులెవరో తేల్చడానికి ఏళ్లూ పూళ్లూ పడుతుంది. బంగ్లాదేశ్‌లో ఉన్న రోహింగ్యాలను వెనక్కి తీసుకొచ్చి, అంతా సవ్యంగా ఉందని చెప్పడం కోసం 2017 నవంబర్‌లో మయన్మార్ ఆ దేశంతో అవగాహనకొచ్చింది. అయితే కనీస హక్కులకు గ్యారెంటీ ఇస్తే తప్ప వెనక్కి వెళ్లేందుకు వారు సుముఖంగా లేరు. ఐక్యరాజ్యసమితి సంస్థల ద్వారా వారికి అండదండలందించి, వారు మనుషులుగా బతకడానికి సాయపడటం ప్రపంచ దేశాల కర్తవ్యం.

## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు మార్గశిర మాసం, తిథి బ.అష్టమి రా.10.11 వరకు తదుపరి నవమి నక్షత్రం ఉత్తర రా.10.51 వరకు, తదుపరి, హస్త, వర్జ్యం ఉ.8.14 నుంచి 9.43 వరకు, దుర్ముహూర్తం ఉ.10.07 నుంచి 10.50 వరకు, తదుపరి ప.2.29 నుంచి, 3.13 వరకు, అమృతఘడియలు... సా.5.02 నుంచి 6.44 వరకు.

**సూర్యోదయం :** 6.27
**సూర్యాస్తమయం:** 5.25
**రాహుకాలం :** ప.1.30 నుంచి 3.00 వరకు
**యమగండం :** ఉ.6.00 నుంచి 7.30 వరకు

# వ్యవసాయానికి ఉద్దీపన వద్దా?

విశ్లేషణ



దేవీందర్ శర్మ

**గ్రామీణ కుటుంబాల ఆర్థిక పరిస్థితి క్షీణిస్తోందని అన్ని జాతీయ స్థాయి నివేదికలూ సూచిస్తున్నాయి. కానీ ఆర్థికవేత్తలు మాత్రం నిరుపేదలను ఆదుకోకుండా ఉండటం ఎలా అనే అంశంపై రెండుగా చీలిపోయి ఉన్నారు. ఆర్థిక మందగమనం అనే వ్యాధికి చికిత్స మాత్రం నిచ్చెనమెట్ల మీద ఉన్నవారికే అందించాలని వీరు సూచిస్తున్నారు. దేశ జనాభాలో 50 శాతానికి పైగా ప్రజలకు ఆలంబనగా ఉంటున్న వ్యవసాయం సంక్షోభంలో కూరుకుపోతున్నప్పుడు ఆర్థిక వ్యవస్థపై దాని ప్రభావం కూడా తీవ్రంగానే ఉంటుంది. అందుచేత వ్యవసాయాన్ని పునరుద్ధరించడమే కీలక విషయం. ప్రస్తుతం భారతీయ ఆర్థిక వ్యవస్థలో ఆర్థిక ఉద్దీపన అవసరం ఏ రంగానికైనా ఉంది అంటే అది వ్యవసాయ రంగం మాత్రమే. పేదల చేతికి ఎంత ఎక్కువగా డబ్బు అందిస్తే అంత ఎక్కువగా దేశంలో డిమాండ్ సృష్టించవచ్చు. ఇదే ఇప్పుడు అత్యంత అవసరమైన చర్య.**

దశాబ్దాలుగా భారతీయ వ్యవసాయం దుస్థితి బాటలో సాగుతోందని సంకేతాలు స్పష్టంగా కనబడుతున్నాయి. దేశ ప్రజలు వినియోగంపై వెచ్చిస్తున్న వ్యయంపై, లీక్ అయిన 'నేషనల్ సాంపిల్ సర్వే ఆఫీసు (ఎన్ఎస్ఎస్ఓ) 2017–18' నివేదిక ప్రకారం గ్రామీణ కుటుంబాలు ఆహారంపై అతితక్కువగా ఖర్చు పెడుతున్నట్లు తెలుస్తోంది. ఈ నివేదికను కేంద్ర ప్రభుత్వం బుట్ట దాఖలు చేయాలని నిర్ణయించిందనుకోండి. పోతే '2016 ఎకనమిక్ సర్వే' మరింత చేదు వార్తను తెలిపింది. దేశంలోని 17 రాష్ట్రాల సగటు వ్యవసాయ కుటుంబ ఆదాయం సంవత్సరానికి రూ. 20,000కు మించి లేదట. అంటే వ్యవసాయ కుటుంబాలు రోజువారీ వినియోగంపై ఎంత తక్కువగా ఖర్చుపెడుతున్నాయో దీన్నిబట్టే తెలుస్తుంది.

'వినియోగ వ్యయంపై సర్వే' ప్రకారం, గ్రామీణ ప్రాంతాల్లో ఆహారంపై నెలకు సగటున ఒక కుటుంబం రూ. 580 లు (రోజుకు 19 రూపాయలు) మాత్రమే ఖర్చుపెడుతోందని వెల్లడించగా, ఎకనమిక్ సర్వే మరింత ఆసక్తికరమైన డేటాను బయటపెట్టింది. వ్యవసాయ కుటుంబాలు అమ్మగలుగుతున్న ఉత్పత్తులపైనే కాకుండా గృహ వినియోగం కోసం వారు భద్రపర్చుకున్న ఆదాయాన్ని కూడా కలుపుకుని రైతు కుటుంబాల ఆదాయాన్ని అది వెల్లడించింది. దేశంలోని వ్యవసాయ కుటుంబాలు నెలకు రూ. 1,700 కంటే తక్కువ ఆదాయ స్థాయిలతో ఎలా జీవిస్తున్నాయా అని ఎవరికైనా ఆశ్చర్యం కలుగుతుంది. వ్యవసాయ ధరలు కనిష్టస్థాయిలో ఉంటూండగా, వ్యవసాయ ఆదాయాలు 14 ఏళ్ల కనిష్టస్థాయికి పడిపోయాయి. ఇక వ్యవసాయ వేతనాలు కూడా గత కొన్నేళ్లుగా పతనమవుతూ వస్తున్నాయి.

లీకైన మరొక డాక్యుమెంట్ 'పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే 2017–18' నివేదిక ఇంకా దారుణమైన విషయం బయటపెట్టింది. గ్రామీణ ప్రాంతాల్లో 3.4 కోట్ల మంది దినసరి కూలీలు 2011–18 మధ్య కాలంలో తమ ఉపాధిని కోల్పోయారు. వీరిలో 3 కోట్లమంది వ్యవసాయ కూలీలే. గత 45 ఏళ్లలో నిరుద్యోగం పరాకాష్టకు చేరుకోవడంతో సంక్షోభం వ్యవసాయ పరిధిని దాటిపోయింది.

ఈ అన్ని నివేదికలూ గ్రామీణ కుటుంబాల ఆర్థిక పరిస్థితి క్షీణిస్తోందని సూచిస్తున్నాయి. రైతు కుటుంబాల ఆర్థిక సంపన్నతా లేమి అనేది భవిష్యత్తులో గ్రామీణ వ్యయంపై కూడా తన ప్రభావం చూపనుంది. అయితే ఆర్థికవేత్తలు మాత్రం అధోజగత్ సహోదరులను ఆదుకోకుండా ఉండటం ఎలా అనే అంశంపై రెండుగా చీలిపోయి ఉన్నారు. బలహీనమైన వినియోగదారీ డిమాండ్, ప్రైవేట్ పెట్టుబడులు మందగించిపోవడం అనే రెండు ప్రధాన అంశాలే ఆర్థిక వ్యవస్థను మందగింప జేస్తున్నాయని ప్రధాన స్రవంతి ఆర్థిక వేత్తలు ఒప్పుకుంటున్నారు. వీటివల్లే ఈ జూలై–సెప్టెంబర్ త్రైమాసికంలో దేశీయ ఆర్థిక వృద్ధి రేటు 4.5 శాతానికి పడిపోయింది. అంటే ఆరేళ్లలో ఇది అత్యంత తక్కువ వృద్ధి రేటు అన్నమాట. కానీ ఆర్థిక మందగమనం అనే వ్యాధికి చికిత్స మాత్రం నిచ్చెనమెట్ల మీద ఉన్నవారికే అందించాలని వీరు సూచిస్తున్నారు.



అయితే పారిశ్రామిక సంస్థలు మాత్రం ఆర్థిక మందగమనాన్ని అవకాశంగా మల్చుకోవాలని చూస్తున్నాయి. చౌక శ్రమ, సరళతరమైన భూ సేకరణ, కార్పొరేట్ పన్ను తగ్గింపు, పన్నుల ఉగ్రవాదాన్ని తొలగించడం, దివాలా సమస్యలను సత్వరం తీర్చడం వంటి వాటి రూపంలో మరిన్ని సంస్కరణలను అమలు చేసేలా వ్యవస్థను ప్రభావితం చేయాలని ఇవి చూస్తున్నాయి. దీనికోసం సెక్టర్ ఆధారిత ఉద్దీపన కోసం పట్టుబడుతున్నాయి.

పిరమిడ్ పునాదిపైనే మరింత దృష్టి పెట్టాలనే అంశాన్ని ప్రధాన స్రవంతి ఆర్థికవేత్తలు అంగీకరిస్తుండగా, మరింత సంస్కరించడం ద్వారానే ఆర్థిక వ్యవస్థను ముందుకు తీసుకెళ్లాలని కొంతమంది ఆర్థికవేత్తలు సూచిస్తున్నారు. ఆర్థిక వ్యవస్థను ముందుకు నెట్టాలంటే కార్పొరేట్ పన్ను ఉద్దీపన, రియల్ ఎస్టేట్, ఆటోమొబైల్ సెక్టార్, బ్యాంక్ కన్సాలిడేషన్, మూలధన సేకరణ, ఎగుమతి ప్రోత్సాహకాలు, మైక్రో, చిన్నతరహా, మధ్య తరహా పరిశ్రమలకు కొన్నిరాయితీలు కల్పించడం అవసరమని వీరు చెబుతున్నారు. కొందరు ఆర్థికవేత్తలయితే ఇప్పటికే సంపదల మేట మీద సౌకర్యవంతంగా కూర్చున్న కొన్ని పరిశ్రమలకు పన్ను విధింపును ఎందుకు ఎత్తివేయాలని ప్రశ్నించారు. కుంగిపోతున్న ఆర్థిక వ్యవస్థను ముందుకు తీసుకుపోవడానికి ఇది మార్గం కానే కాదని వీరు చెబుతున్నారు.

ఇప్పటికే జీడీపీ 5 శాతం లోపు పడిపోయిన నేపథ్యంలో కార్పొరేట్ పన్ను రేటును భారీగా తగ్గించడం, ప్రతి సంవత్సరం 1.45 లక్షల కోట్ల ఉద్దీపనను అందించడం అనేది పన్ను రూపేణా వచ్చే ప్రభుత్వ రాబడిని మరింత బలహీన పరుస్తుంది. పన్ను రాయితీలు గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టులలో మరిన్ని పెట్టుబడులను కల్పించి వాణిజ్యాన్ని ప్రోత్సహిస్తాయని, ఇది మరిన్ని ఉద్యోగాల కల్పనకు దారితీస్తుందని చేస్తున్న వాదనను అంతర్జాతీయ అనుభవం తోసిపుచ్చుతోంది. డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడయ్యాక తగ్గించిన కార్పొరేట్ పన్నులు అటు పెట్టుబడులనూ తీసుకురాలేదని, ఇటు ఉద్యోగాలనూ కల్పించలేదని పైగా పన్నుల తగ్గింపు ద్వారా మిగిలిన మొత్తాన్ని కార్పొరేట్ రంగం స్టాక్ మార్కెట్లో మదుపు చేసిందని నోబెల్ గ్రహీత పాల్ క్రూగ్‌మన్ స్పష్టం చేశారు.

కార్పొరేట్ పన్నులు భారీగా తగ్గిస్తున్నట్లు కేంద్రం ప్రకటించగానే ఆ మరుసటి దినం భారతీయ స్టాక్ మార్కెట్లు పండుగ చేసుకున్నాయంటే ఆశ్చర్యపడాల్సిన పనిలేదు. ఆ సంబరాలు ఇంకా కొనసాగుతుండగా, పన్ను రేటు తగ్గింపు తర్వాత విదేశీ నిధుల ప్రవాహం పెరుగుతూ వచ్చింది. కానీ, కేవలం 5 రూపాయల బిస్కెట్ కూడా కొనలేకపోతున్న చాలామంది పేదవారి గురించీ, అష్టకష్టాలు పడి పండించిన పంటను మార్కెట్లో తగిన ధరకు అమ్ముకోలేకపోతున్న రైతు గురించీ, దినసరి వేతనాలను కూడా పొందడం కష్టమైపోతున్న వ్యవసాయ, వ్యవసాయేతర కూలీల గురించే నేను ఆందోళన చెందుతున్నాను.

ఇక వ్యవసాయరంగంలో నిరుపేదలకు ఎలాంటి ప్రోత్సాహకాలనూ కేంద్రం ప్రకటించడం లేదు. గిట్టుబాటు ధర లేమితో 2000–2017 మధ్య 16 ఏళ్ల కాలంలో రూ. 45 లక్షల కోట్లను రైతులు నష్టపోయారు. కాగా గత రెండేళ్లలో వ్యవసాయ రంగ నిజ ఆదాయాల పెరుగుదల దాదాపుగా జీరోగా ఉంటోందని నీతి ఆయోగ్ సొంత అంచనాలే చూపుతున్నాయి. మరోమాటలో చెప్పాలంటే, గత రెండు దశాబ్దాలుగా రైతుల ఆదాయాలు పతనబాటలోనే నడుస్తున్నాయి. వ్యవసాయ వేతనాల్లో వృద్ధి రేటు కూడా పడిపోతోంది. దేశ జనాభాలో 50 శాతానికి పైగా ప్రజలకు ఆలంబనగా ఉంటున్న వ్యవసాయం సంక్షోభంలో కూరుకుపోతున్నప్పుడు ఆర్థిక వ్యవస్థపై దాని ప్రభావం కూడా తీవ్రంగానే ఉంటుంది.

అందుచేత వ్యవసాయాన్ని పునరుద్ధరించడమే కీలక విషయం. ప్రస్తుతం భారత ఆర్థిక వ్యవస్థలో ఆర్థిక ఉద్దీపన అవసరం ఏ రంగానికైనా ఉంది అంటే అది వ్యవసాయ రంగం మాత్రమే. రైతులకు పరిహారం చెల్లించాల్సిన సమయం కూడా నేడు ఆసన్నమైంది.

పారిశ్రామిక రంగానికి రూ.1.45 లక్షల కోట్ల రూపాయల పన్ను రాయితీని కేటాయించినప్పుడు, అదే మొత్తాన్ని వ్యవసాయ రంగానికి కూడా అందిస్తే ప్రధానమంత్రి కిసాన్ స్కీమ్ కింద ఇప్పుడు ఇస్తున్న మొత్తాన్ని ప్రతి రైతు కుటుంబానికి మూడు రెట్లు పెంచి ఇవ్వవచ్చు. అంటే సంవత్సరానికి ఒక్కో రైతుకు రూ. 18,000లు, లేక నెలకు రూ. 1,500లు ఇవ్వవచ్చు. ఈ పథకాన్ని భూమి లేని రైతుకూలీలకు కూడా పొడిగించవచ్చు. ఇప్పటికే పీఎం–కిసాన్ పథకం కింద రూ. 75,000ల కోట్లు కేటాయించారు. దీనికి మరొక రూ. 1.45 లక్షల కోట్లను అదనంగా చేర్చి ఇవ్వాల్సి ఉంది. పేదల చేతికి ఎంత ఎక్కువగా డబ్బు అందిస్తే అంత ఎక్కువగా డిమాండ్ సృష్టించవచ్చు.

ఈ చర్యలతోపాటు ప్రభుత్వ ధాన్యసేకరణను మరింత సమర్థవంతంగా చేయడానికి వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ కమిటీ అజమాయిషీలో నడిచే మండీల నెట్‌వర్క్‌ని విస్తరించాలి. అన్ని రకాల పంటలకు కనీస మద్దతు ధరకు ప్రకటించిన మేరకు హామీ ఇవ్వాలి. లోటును చెల్లించడం ద్వారా కనీస మద్దతు ధర, మార్కెట్ ధరలకు మధ్య వ్యత్యాసాన్ని తగ్గించాలి. వీటికి అదనంగా కేరళ అనుభవం నుంచి పాఠాలు తీసుకుని ప్రతి రాష్ట్రంలోనూ రుణ ఉపశమన కమిషన్‌ను ఏర్పర్చాలి. గ్రామీణ రహదారులు, పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు వంటి ప్రజా రంగ సేవలపై అధిక మదుపును చేయాలి.

వ్యాసకర్త వ్యవసాయ నిపుణులు
ఈ–మెయిల్ : hunger55@gmail.com

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

### లోహ పురుష్



"కేంద్ర హోంమంత్రి అమిత్ షాను లోహ పురుష్‌గా అభివర్ణిస్తూ చెదల్లాంటి ముల్లాలను దేశం బయటకు గెంటేస్తాడని వారి ఐటీ సెల్ వాట్సాప్ గ్రూప్‌ల్లో మెసేజ్‌లు గుమ్మరిస్తోంది. కశ్మీర్ నిర్బంధాన్ని చెదలను అదుపు చేయడంగా పేర్కొంటూ, అందులో మోదీజీ బాగా విజయం సాధించారని ప్రశంసించడం సిగ్గుచేటు. మోదీలాగే షా కూడా బాగా పాపులర్ కావడం ఈ వాట్సాప్ ప్రపంచంలో ఆసక్తికర అంశం. మోదీకి ఆయనే తగిన వారసుడని భక్తులు భావిస్తున్నారు"

– స్వాతి చతుర్వేది, జర్నలిస్ట్

### విద్యార్థి



"నన్ను మద్రాస్ యూనివర్సిటీ లోపలికి వెళ్లనివ్వలేదు. చనిపోయే వరకు నన్ను నేను విద్యార్థిగానే పిలుచుకుంటా. వారిని కాపాడటానికి అదే హోదాలో ఇక్కడకు వచ్చా. నేను పార్టీ పెట్టినా, పెట్టకపోయినా నేను ప్రశ్నిస్తూనే ఉంటా. ఇప్పుడు పార్టీ పెట్టాక ఇక్కడకు రావడం నా బాధ్యత"

– కమల్‌హాసన్, నటుడు

### రాజీనామా



"అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ, జామియా యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్లు తమ రాజకీయ ఎత్తుగడలతో పక్కకు తప్పుకున్నారు. పోలీసుల దాడుల నుంచి తమ విద్యార్థులను కాపాడటంలో వాళ్లు విఫలమయ్యారు. ఈ వైస్ ఛాన్స్‌లర్లు ఇద్దరూ రాజీనామా చేయాలి. దీన్ని అందరూ పునరుద్ఘాటించండి"

– అర్ఫా ఖనుమ్ షెర్వాణీ, జర్నలిస్ట్

### దిగులు



"ఈ దేశ పౌరుడిగా, తండ్రిగా దేశవ్యాప్తంగా వివిధ విద్యాసంస్థల్లో చెలరేగిన అశాంతిని చూస్తుంటే దిగులుగా ఉంది. వీలైనంత త్వరగా శాంతియుత పరిస్థితులు నెలకొనాలని ప్రార్థిస్తున్నా. గొప్ప ఉపాధ్యాయులంతా తమ విద్యార్థుల నుంచే నేర్చుకుంటారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి నేను శాల్యూట్ చేస్తున్నా"

– హృతిక్ రోషన్, నటుడు

### ఐక్యత



"ఐదు లక్షల మంది రోహింగ్యాల కోసం 20 కోట్ల మంది ముస్లింలు వీధుల్లోకి వచ్చారు. కశ్మీర్ నుంచి ఆరు లక్షల మంది హిందువులను తరిమేసినప్పుడు ఒక్క హిందువు కూడా గొంతు విప్పలేదు. హిందూ రాజుల కాలం నుంచి నేటి వరకు హిందువులు హిందువులుగా విఫలమయ్యారు. కనీసం ఇప్పుడైనా మనం ఐక్యం కావాల్సిన అవసరం ఉంది. లేకపోతే నాశనమైపోతాం"

– మహేష్ విక్రమ్ హెగ్డే, జర్నలిస్ట్

### తిరిగి ఇవ్వొద్దు



"తన పుస్తకం 'ఆన్ ఎరా ఆఫ్ డార్క్‌నెస్'కు ఇంగ్లిష్‌లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందిన శశిథరూర్‌కు అభినందనలు. ఈ అవార్డుకు శశి అన్నివిధాలా తగినవాడు. దాన్ని అలానే ఉంచుకో. అంతేకానీ, ప్రభుత్వం చేసినవేవో నీకు నచ్చలేదని తిరిగివ్వొద్దు"

– తవ్లీన్ సింగ్, జర్నలిస్ట్

ఇన్‌బాక్స్

## ఏ విభజన కోసం ఈ చట్టం?

పౌరసత్వానికి మత విశ్వాసాలను జతచేస్తూ, కేంద్ర ప్రభుత్వం పౌరసత్వ సవరణ చట్టం 2019ను పార్లమెంటులో నెగ్గించుకున్నది. దీనిని కేవలం మతాలకు కుదించి మాత్రమే చూడలేం. పౌరసత్వ సవరణ చట్టం కలిసిమెలిసి జీవిస్తున్న భారత పౌరుల మధ్య చిచ్చు పెట్టే అవకాశం ఉంది. స్వతంత్ర భారత చరిత్రలో అత్యంత ప్రమాదకరమైన చట్టంగా ఇది నిలవనున్నది. దేశ విభజన సమయంలో తల్లికి బిడ్డలను, బిడ్డలకు తల్లిని కలవకుండా చేసి వేలాది మందిని బలిగొన్న మారణకాండకు కారణం మత జాతీయవాదమే. కేంద్రం ఈ చట్టంతో మత జాతీయవాదాన్ని తిరగదోడి మానిపోతున్న గాయాన్ని కెలికి పెద్దది చేయడం ద్వారా సావర్కర్, జిన్నాల వారసత్వాన్ని కొనసాగిస్తోంది. దేశ విభజన సృష్టించిన విపత్తు నుండి గుణపాఠం తీసుకున్న ఏ నాగరిక సమాజం కూడా మతానికి పౌరసత్వాన్ని, జాతీయతను జోడించడాన్ని సహించదు. బీజేపీ తన రాజకీయ ప్రయోజనాల కోసం దేశ భవిష్యత్తునే పణంగా పెడుతోంది.

పాకిస్తాన్, అఫ్గనిస్తాన్, బంగ్లాదేశ్ దేశాలలో మత హింసకు గురై వలస వచ్చిన మైనార్టీ మతాలకు చెందిన వారికి పౌరసత్వం ఇస్తామంటున్నారు. శ్రీలంక, బర్మా దేశాలలో మత హింసకు గురై వలస వచ్చిన మైనార్టీలకు ఎందుకు ఇవ్వరు? మత హింసకు గురవుతున్న వారి పట్ల అంత అభిమానం ఉంటే అందరినీ ఒకే విధంగా చూడాలి కానీ కొందరి పట్ల వివక్ష ఎందుకు? ఇది హిందూ, ముస్లిం మతాలకు చెందిన సమస్య కాదు భారత ప్రజలకు, దేశ భవిష్యత్తుకు సంబంధించిన సమస్య. స్వాతంత్ర్య పోరాట వారసత్వం అందించిన విలువలకి, ప్రజాస్వామ్యానికి, ప్రజలు పోరాడి సాధించుకున్న హక్కులకు భంగం కలుగుతుంది. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ మౌలిక స్వభావాన్ని కాపాడుకోవడానికి దేశం యావత్తు నడుం బిగించాల్సిన సమయం ఆసన్నమైంది.

మహమ్మద్ అబ్బాస్,
ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
మొబైల్ : 94900 98032

# ప్రజాకోర్టులో పౌరసత్వ చట్టం

సందర్భం



లక్ష్మణ వెంకట్ కూచి

నూతన పౌరసత్వ చట్టాన్ని క్షేత్రస్థాయిలో పౌరులు సవాలు చేస్తుండటంతో తూర్పు, ఈశాన్య భారతం తగలబడుతోంది. ఈ చట్టానికి వ్యతిరేకంగా తీవ్రస్థాయిలో ఆందోళనలు, నిరసనలు చెలరేగుతుండటంతో దేశం అట్టుడికిపోతోంది. అసోంలో ఎన్నార్సీ, ఆర్టికల్ 370 రద్దు, ట్రిపుల్ తలాక్, రామ మందిరంపై తీర్పు తర్వాత నరేంద్ర మోదీ ప్రభుత్వం తాజాగా పౌరసత్వ చట్టానికి సవరణలు తీసుకురావడం ఏమంత ఆశ్చర్యం కలిగించదు. ఒక ప్రత్యేక మతానికి చెందిన విదేశీయులకు భారతీయ పౌరసత్వాన్ని ఈ సవరణ బిల్లు సమర్థవంతంగా నిరోధిస్తున్నందున భారత్‌ని హిందూ దేశంగా మల్చాలనే బీజేపీ, ఆరెస్సెస్ ఎజండాను మోదీ ప్రభుత్వం మరింత ముందుకు తీసుకుపోతున్నట్లుగానే కనిపిస్తోంది.

పార్లమెంటులో పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)పై చర్చ సాగుతుండగానే అసోం, ఈశాన్య భారత్‌లో నిరసనలు వెల్లువెత్తాయి. ఈ చట్టం తమ ప్రాంత జనాభా కూర్పులో గణనీయ మార్పును తీసుకురావడమే కాక తమ సంస్కృతిపై కూడా దాడికి దిగుతుందని ప్రజలు భయాందోళనలకు గురికావడమే ఈ నిరసనలకు కారణం.

పైగా ప్రజా నిరసనలు పశ్చిమ బెంగాల్, న్యూఢిల్లీ, ఉత్తరప్రదేశ్‌లోని అలీగర్ వంటి మరెన్నో ప్రాంతాలకు విస్తరించడమే కాకుండా నిరసనలను పోలీసులు, భద్రతా బలగాలు తీవ్రంగా అణచివేయడంతో ప్రపంచం మెల్లమెల్లగా ఈ నిరసనలను పరిగణనలోకి తీసుకోవడం మొదలైంది. బంగ్లాదేశ్ మంత్రి భారత పర్యటన రద్దు కావడం, జపాన్ ప్రధాని గౌహతి సందర్శన వాయిదా పడటంతో భారత్‌కు దౌత్యపరంగా తొలి దెబ్బలు తగిలాయి.

మరీ ముఖ్యంగా ఐక్యరాజ్యసమితి విభాగం యుఎన్‌హెచ్‌సిఆర్ భారత ప్రభుత్వం తలపెట్టిన పౌరసత్వ చట్టం 'ప్రాథమికంగానే వివక్షాపూరితం'గా ఉందని తన అసమ్మతిని వ్యక్తం చేయడమే కాకుండా, భారత్ కట్టుబడిన అంతర్జాతీయ మానవ హక్కుల పరిరక్షణపై సుప్రీంకోర్టు జాగ్రత్తగా వ్యవహరిస్తుందని ఐరాస విభాగం ఆశాభావం వ్యక్తం చేసింది. అమెరికా పాలనా యంత్రాంగం కూడా భారత్‌లో పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నట్లు చెప్పింది.

ఇక దేశీయంగా చూస్తే మోదీ ప్రభుత్వ హిందుత్వ అనుకూల చర్యకు ప్రతిపక్షాలు పాలిస్తున్న కేరళ, పశ్చిమబెంగాల్, పంజాబ్, చత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాలలో తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. కేంద్రం తీసుకొచ్చిన పౌరసత్వ చట్టాన్ని తాము అమలుపర్చబోమని ఈ రాష్ట్రాల పాలకులు స్పష్టం చేశారు. దాంతో కేంద్రానికి, రాష్ట్రాలకు మధ్య తీవ్ర ఘర్షణ వాతావరణం ఏర్పడి దేశ సమాఖ్య వ్యవస్థను దెబ్బతీయనుంది.

అయితే అటు బీజేపీ, ఇటు కేంద్రప్రభుత్వం ఈ వ్యవహారంలో రాష్ట్రాలకు పెద్దగా పాత్ర ఏమీలేదని, కొత్త పౌరసత్వ నిబంధనల అమలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వాలకు పెద్దగా పాత్ర లేదని చెబుతూ వస్తున్నాయి. పైగా పౌరసత్వ చట్టం సుప్రీంకోర్టు పరిశీలనలో ఉన్నందున ప్రతిపక్షాల ఏలుబడిలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలు ఈ చట్టాన్ని ఏమేరకు అడ్డుకుంటాయన్నది చూడాల్సిందే మరి.

రాజకీయ పరంగా చూస్తే, పౌరసత్వ చట్టం రూపంలో మతపరంగా ప్రజలను విభజించడం ద్వారా దేశవ్యాప్తంగా బీజేపీకి ప్రయోజనం చేకూరే అవకాశం ఉంది. పౌరసత్వ సవరణ బిల్లును వ్యతిరేకిస్తున్న పార్టీలను పాకిస్తాన్ అనుకూల, మైనారిటీల అనుకూల సంస్థలుగా ముద్రించడం ద్వారా బీజేపీ మరింతగా మందుగుండు దట్టించింది.

కాగా, ఈ ఘర్షణలకు సంబంధించిన తొలి పరీక్ష పశ్చిమబెంగాల్‌లోనే జరగనుంది. ఎందుకంటే ఈ రాష్ట్రం లోకి మరింతగా చొచ్చుకుపోవాలని బీజేపీ తీవ్రంగా ప్రయత్నిస్తోంది. వచ్చే సంవత్సరం ఆ రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో బీజేపీ పౌరసత్వ చట్టం అంశాన్ని ఇప్పటికే ప్రచారంలోకి తీసుకొచ్చేసింది.

పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పౌరసత్వ చట్టంపై రాష్ట్ర వ్యాప్త నిరసనలకు పథక రచన చేస్తుండగా, బీజేపీ మాత్రం ఇప్పటికే పశ్చిమబెంగాల్‌లో విజయోత్సవ ర్యాలీలను మొదలుపెట్టేసింది. పైగా, పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకోవడానికి తమతో కలిసి నడవాలంటూ రాష్ట్రంలోని శరణార్థులకు పిలుపునిచ్చేసింది కూడా.

కాగా, ఢిల్లీలో జామియా వర్సిటీ విద్యార్థులపై పోలీసుల అమానుష దాడులు దేశవ్యాప్తంగా విద్యార్థుల నిరసనలకు దారితీయడం గమనార్హం.

వ్యాసకర్త సీనియర్ పాత్రికేయుడు

# అభిశప్తుడికి ఓ అభయం

బండి నారాయణ స్వామి–రాయలసీమ సాహిత్యానికి ఓ బండి చక్రం. కాదు, కాదు–ఆ బండి చక్రానికి ఇరుసు. కరువును కళ్లారా చూసి కాసిని కన్నీళ్లను అక్షరాలుగా మలిచినవాడు. ఆ అక్షరాలను నెత్తుటితో రంగరించి అనంత శక్తినొసగినవాడు. ఆ శక్తితో అనుపమానమైన సాహిత్యాన్ని సృష్టించినవాడు. చరిత్రలో మరుగున పడిపోయిన అనేకానేక సందర్భాల నుంచి సీమకు జరిగిన అన్యాయాలను, అక్రమాలను.. ఎందరో దాచేసిన అసత్యాలను, అర్థసత్యాలను అక్షర నిష్టతో వెలికితీసినవాడు. ఆ నిరంతర కృషికి ఇవాళ కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వరించింది. 'శప్త భూమి'పై రుద్రతాండవం చేసిన అభిశప్తుడికి ఓ అభయం లభించింది.



శప్తభూమి నవల క్రీ.శ. 1775వ సంవత్సరంలో ప్రారంభమవుతుంది. విజయనగర సామ్రాజ్య పతనం అనంతరం చిన్నచిన్న రాజ్యాలు ఏర్పడటం, దళిత బహుజనులతో సహా పలువురు అధికారాన్ని హస్తగతం చేసుకోవడం, వారిమధ్య ఆధిపత్య పోరు, అందులో భాగంగా చిమ్మిన నెత్తురు నవలంతా చిత్తడిగా పరచుకుంటుంది. ఈ నవలలోని సిద్ధరామప్పనాయుడు, కరిహుళి బసవప్ప, దళవాయి సుబ్బరాయుడు, బ్రౌన్, మాడల కందప్ప వంటి వారు నిజంగా ఆ కాలంలో జీవించినవారు. మిగిలిన అనేక పాత్రలకు అప్పటి సంఘటనల ఆధారంగా స్వామి ప్రాణం పోశారు. ఆ కాలంలో సాగిన సతీసహగమనం, బసివిని వంటి ఆచారాలు, సంతలు, పరసల తీరుతెన్నులు, పూజలు, పండుగలు, పెళ్లిళ్లు, ఆయా కులాల ఆచార వ్యవహారాలు, సుంకాలు, పెళ్లి పన్ను, చేను మాన్యాలు, కుల పురాణాలు, కుటుంబ చరిత్రలు, హేయమైన శిక్షలు, అత్యాచారాలు, అక్రమాలు, గాలి దేవరలు, వీరగల్లులు.. అన్నీ సవివరంగా చిత్రించిన తీరు చూస్తూ ఆయా వివరాలను సేకరించడానికి రచయిత ఎంత కష్టించి ఉంటారో అవగతమవుతుంది. 'తానా' బహుమతి నవలగా వెలువడినప్పుడే స్వామి 'శప్తభూమి'కి విశేష ఆదరణ లభించింది. ఇప్పుడు అకాడమీ అవార్డు రావడం, సాహితీ ప్రియులందరికీ సంతోషం కలిగించే అంశం. – దేశరాజు

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 425 9899

సాక్షి
# ఫ్యామిలీ
నల్లగొండ
గురువారం ॥ 19-12-2019



# రెండో పెళ్లయితే?

**సమాజం దారి ఏర్పాటు చేస్తుంది.
ఆ దారినే మళ్లీ ప్రశ్నిస్తుంది.
చిన్నచూపు చూస్తుంది.
హేళన చేస్తుంది.
సమాజంలో మొదటి పెళ్లికి
ఉన్న గౌరవం రెండో పెళ్లికి ఉందా?
రెండో పెళ్లి చేసుకోవడం వల్ల
అన్యాయం జరిగినట్టేనా?
ఈ భావనలు ఒకమ్మాయి
మనసులో తుఫాను రేపితే?**

ఫస్ట్ జరుగుతున్నది ఆ అమ్మాయి బాబాయ్ కని పెట్టాడు.

అతను కనిపెట్టకపోతే కథ ఎక్కడి దాకా పోయేదో.

* * *

ఆ రోజు సాయంత్రం ఆఫీసు దగ్గర వసుధ బాబాయ్‌ని చూసి శ్రీకాంత్ ఆశ్చర్యపోయాడు.

'నమస్తే మావయ్యా... ఇలా వచ్చారేమిటి?' అన్నాడు.

'నీతో మాట్లాడాలి శ్రీకాంత్' అన్నాడు బాబాయ్.

ఇద్దరూ దగ్గరలో ఉన్న కాఫీషాప్‌లో కూచున్నారు.

'శ్రీకాంత్... వసుధ మీద నీ ఒపీనియన్ ఏమిటి?' అడిగాడు బాబాయ్

'మంచమ్మాయి. ఆ అమ్మాయిని చేసుకొని నేను సంతోషంగా ఉన్నాను. ఎందుకలా అడిగారు?'

'ఆ అమ్మాయి హ్యాపీగా ఉందనుకుంటున్నావా?'

'ఉందనే అనుకుంటున్నాను' అయోమయంగా అన్నాడు శ్రీకాంత్.

'కాని ఆ అమ్మాయి లేదు. లేనని అనుకుంటోంది. ఎంతగా అంటే తన కాలేజీ నాటి ఫ్రెండ్‌తో డీప్‌గా ఫ్రెండ్‌షిప్ చేసేంత అనుకుంటోంది. రెండు రోజుల క్రితం తను అతనితో నాకు రెస్టరెంట్‌లో కనిపించింది'

బాబాయ్ చెప్పింది విని శ్రీకాంత్ ఒక నిమిషం బిగుసుకుపోయాడు.

'ఇందులో మన తప్పు కూడా ఉంది. ఆ అమ్మాయిని నీతో పెళ్లికి సరిగ్గా ప్రిపేర్ చేయలేదు. ఇప్పుడు ఆలస్యమైపోయింది. ఒకసారి మనం వసుధను సైకియాట్రిస్ట్ దగ్గరకు తీసుకెళ్లాలి. ఏమంటావ్?'

'మావయ్యా... నాకు వసుధ అంటే నిజంగానే ప్రేమ ఉంది. తప్పకుండా తీసుకెళదాం' అన్నాడు శ్రీకాంత్.

* * *

వసుధ ప్రవర్తన గురించి తనకు తెలిసిన విషయాన్ని పట్టుకుని ఆ రాత్రి ఇంట్లో రాద్ధాంతం చేయలేదు శ్రీకాంత్. కూల్‌గా వసుధతో మాట్లాడాడు.

'వసుధ... నువ్వు నీ కాలేజ్ మేట్ సాగర్‌తో క్లోజ్‌గా ఉంటున్నావా?'

ఒక్క క్షణం వసుధ తుళ్లిపడింది. అప్పటి వరకూ ఏదో కన్ఫ్యూజన్‌లో ఉన్నట్టు, తన ప్రవర్తన గురించి తనకే డౌట్ ఉన్నట్టు, తాను చేస్తున్నది సరైనదో కాదో తేల్చుకోలేనట్టు, ఒకవేళ భర్తకు తెలిస్తే జరిగే పరిణామాలను ఫేస్ చేయడానికి సిద్ధంగా ఉన్నానో లేనో తెలియనట్టు... వసుధ సడన్‌గా ఏడ్వడం మొదలుపెట్టింది.

'ఏడవకు... ఏడవకు' ఊరడించాడు శ్రీకాంత్.

'నేనేం చేస్తున్నానో నాకే అర్థం కావడం లేదండీ' అంది వసుధ సిన్సియర్‌గా.

'సరే... మనం ఒకసారి సైకియాట్రిస్ట్‌ను కలుద్దాం' అన్నాడు శ్రీకాంత్.

* * *

వసుధ చక్కగా ఉంటుంది. బాగా చదువుకుంది. ఎవరైనా సరే ఇష్టపడి పెళ్లి చేసుకునేలా ఉంటుంది. వాళ్లది మధ్యతరగతి కుటుంబం. తన కంటే ముందు ముగ్గురు అక్కలు ఉన్నారు. ఆ ముగ్గురికీ పెళ్ళిళ్లయ్యేలోపు వసుధకు ఒకటి రెండు మంచి సంబంధాలు వచ్చాయి. కాని పెద్దపిల్లల పెళ్లి అయ్యేంత వరకూ చివరి పిల్ల వసుధకు పెళ్లి చేయడం సాధ్యం కాదని తల్లిదండ్రులు ఊరుకున్నారు. ముగ్గురి పెళ్లిళ్లు అయ్యేసరికి ఆర్థికంగా పెద్దగా ఏం మిగల్లేదు. సరిగ్గా అప్పుడే తమ బంధువుల్లో ఉన్న శ్రీకాంత్ సంబంధం వచ్చింది. శ్రీకాంత్ ఆర్థికంగా బాగా సెటిల్ అయ్యాడు. మంచి ఉద్యోగం ఉంది. కాని పెళ్లయిన నాలుగునెలలకే భార్య నుంచి విడిపోయి సంవత్సరం తర్వాత విడాకులు తీసుకున్నాడు. అతను మంచివాడేనని ఆ అమ్మాయి ఎందుకో అతనితో అడ్జెస్ట్ కాలేకపోయిందని అతడు కూడా ఆ అమ్మాయితో హ్యాపీగా ఉండలేకపోయాడని వసుధ తల్లిదండ్రులకు సంబంధం తెచ్చినవారు చెప్పారు. వసుధను శ్రీకాంత్‌కు ఇచ్చి చేయడానికి తల్లిదండ్రులకు అభ్యంతరం ఏమీ కనిపించలేదు. వసుధను మంచి సంబంధం అని ఒప్పించారు. వసుధకు కూడా అంతా బాగానే ఉన్నట్టు అనిపించింది. ఒకే అంది.

* * *

'కాని అందరూ నన్ను బాగా హింస పెట్టారు డాక్టర్' అంది వసుధ సైకియాట్రిస్ట్‌తో.

'ఎలా?' అని అడిగాడు సైకియాట్రిస్ట్.

'పెళ్లికి నా ఫ్రెండ్స్‌ని పిలిచాను. అందరూ వచ్చారు. వెళ్లారు. పెళ్లి బాగా జరిగింది. కాని ఒక రోజు ఒక ఫ్రెండ్‌తో నేను చేసుకుంది రెండో పెళ్లి అతన్ని అని చెప్పాను. క్యాజువల్‌గా అవునా అంది. కాని మా సర్కిల్ అంతా ప్రచారం చేసింది. అందరూ నాకు ఫోన్‌లు చేసి ఒకటే సానుభూతి చూపడం. నీకేం తక్కువని... నీకేం అవసరమని... మమ్మల్ని అడిగితే రాజాలాంటి సంబంధం తెచ్చేవాళ్లం... పోయిపోయి రెండో సంబంధంవాణ్ణి చేసుకుంటావా... అయ్యో రెండో సంబంధమా... మొదటి భార్య ఎందుకు వెళ్లిపోయిందో... వాడు శాడిస్ట్ ఏమో... నిన్ను కూడా సరిగ్గా చూసుకోడులే ఇలా నా మనసు నిండా విషం నింపారు. నాకు రాను రాను అవన్నీ నమ్మాలనిపించింది. అవి నమ్మిన వెంటనే నాకు రెండో పెళ్లివాడికిచ్చి చేసిన నా తల్లిదండ్రులపై పీకల్దాకా కోపం వచ్చింది. మా ముగ్గురక్కలు ఈ పెళ్లి వద్దన్నారట. అంటే వాళ్లు వద్దనేంత అన్యాయం ఏదో నాకు జరిగిపోయినట్టే కదా. ఇవన్నీ ఆలోచించి డిస్టర్బ్ అయ్యాను' అంది వసుధ.

బయట ఆమె భర్త, బాబాయ్ కూచుని ఉన్నారు.

'తర్వాత' అన్నాడు సైకియాట్రిస్ట్.

'నా మనసు నిండా మొదటి పెళ్లివాణ్ణి చేసుకోవడం ఎంత ఇంపార్టెంటో అన్న ఆలోచన నిండిపోయింది. ఈలోకానికి ఎలాగైనా మొదటిపెళ్లివాణ్ణి చేసుకొని చూపించాలన్నంత కోపం, కసి వచ్చాయి. అప్పుడే నా కాలేజ్‌మేట్ సాగర్ కనిపించాడు. అప్పట్లో అతను నన్ను పెళ్లి చేసుకోవాలనుకున్నాడు. నేను నో చెప్పాను. కాని నా సంగతి విని ఇప్పుడైనా మించిపోయింది లేదు చేసుకుంటాను అని మాటలు మొదలెట్టాడు. ఒకటి రెండుసార్లు అతన్ని కలిశాను. కాని నాకు అది కరెక్టో కాదో అని అనిపించేది. ఇటు శ్రీకాంత్.. అటు సాగర్... మెడలో తాళి... ఇదంతా నరకంగా ఉంది డాక్టర్' అంది వసుధ.

'ఇప్పుడు నీ మనసులో ఏముంది?'

'నాకు మంచి జీవితం పొందాలని ఉంది'

'మంచి జీవితం శ్రీకాంత్ నీకు ఇస్తున్నాడు కదా. అతను నీ కన్ఫ్యూజన్ గురించి తెలిసినా రాద్ధాంతం చేయకుండా నా దగ్గరకు తీసుకొచ్చాడంటేనే నువ్వంటే ఎంత గౌరవమో అర్థమవుతోంది. సెకండ్ మేరేజ్ రాంగ్ మేరేజ్ అనే భావన నీ మనసులో తీసేయ్. నువ్వు ప్రేమించగలిగే నిన్ను ప్రేమించగలిగేవాడు దొరికిన పెళ్లే మంచి పెళ్లి. అది మొదటిదా రెండోదా అని లెక్కలు ఎందుకు? జనానిదేముంది... ప్రతిదానికీ మాట్లాడతారు. శ్రీకాంత్ మొదటిపెళ్లి నుంచి బయటపడి అలాగే ఖాళీగా ఉండిపోతే జనం ఊరుకుంటారా? రాజాలా ఉంటావు... రాణిలాంటి సంబంధం తెస్తాము చేసుకో అని వారే అంటారు. చేసుకున్నాక ఆ వచ్చిన అమ్మాయికి వాళ్లే పుల్లలు పెడతారు. కాబట్టి మనకు ఏది మంచో అది ఎంచుకుని ముందుకెళ్లాలి. నీకు నిజంగా శ్రీకాంత్ అంటే ఇష్టమేనా?'

'ఇష్టం సార్'

'ఇంకా సాగర్‌తో మాట్లాడాలని ఉందా?'

ఆ అమ్మాయి మెల్లగా ఫోన్ తీసి సాగర్ నంబర్ బ్లాక్ చేసింది.

కాసేపటికి బాబాయి, శ్రీకాంత్, వసుధ డాక్టర్‌కు థ్యాంక్స్ చెప్పి ఒక నిశ్చింతతో ఇంటికి మరలారు.

– కథనం: **సాక్షి ఫ్యామిలీ**

ఇన్‌పుట్స్: **డాక్టర్ కల్యాణ చక్రవర్తి**, సైకియాట్రిస్ట్

## తిరుప్పావై 4వ పాశురం

**ఆళి మళైక్కణ్ణా! ఒన్నుఉ నీ కై కరవేల్
ఆళి ఉళ్ పుక్కు ముగందు కొడార్ త్తేఱి
ఊళి ముదల్వన్ ఊరువం పోళ్ మెయ్ కఱుత్తు
పాళియన్ తోళుడై ప్పఱ్బనాబన్ కైయిల్
ఆళిపోల్ మిన్ని వలమ్బురిపోల్ నిన్‌అదిరుందు
తాళాదే శారుంగం ఉదెత శరమళైపోల్
వాళ ఉలగినిల్ పెయ్దిడాయ్ నాంగళుమ్
మార్గళి నీరాడ మగిళుందేలోర్ ఎమ్బావాయ్**



బొమ్మ: కేశవ్ వెంకటరాఘవన్

తిరుప్పావై వ్రతాన్ని ఆత్మార్పణభావంతో ప్రారంభిస్తే నారాయణుడికి అధీనులైన దేవీదేవతలందరి అనుగ్రహమూ సంప్రాప్తమౌతుందని సఖులకు బోధిస్తూ ఆండాళ్ వరుణదేవుడితో ఇలా విన్నవిస్తుంది : సాగరగంభీరమైన ఘనమేఘాలను వర్షించే ఓ వరుణదేవా ! నీ అనుగ్రహానికి ఏ మాత్రం కొరత లేకుండా నడి సముద్రగర్భంలోని జలాలను ధారాళంగా పీల్చి గంభీరంగా గర్జించు . ఆకాశాన్ని ఆవరించిన నీ కారుమబ్బులు జగత్కారణుని ప్రళయకాలమేఘచ్ఛాయను సంతరించుకోనిమ్ము . దేదీప్యమానమైన నీ విద్యుల్లతలు విశాలబాహువైన పద్మనాభుని చేతి చక్రంవలె మెరవగా, ఆయన మరొక చేత ధరించిన పాంచజన్య శంఖనాదాన్ని పోలిన నీ ఉరుములతో, శార్ఙ్గధన్వి శరపరంపరలను తలపించే సంతత వర్షధారలను వర్షించు (శ్రీమన్నారాయణుని శ్రీచిహ్నాలైన శంఖ , చక్ర ,ధనస్సులను ఆవాహన). ఆ సంతతధారలో జగత్తు హర్షాతిరేకంతో తడిసినప్పుడు మేము మార్గశిర వ్రతస్నానం ఆచరిస్తాము .

అంతరార్థపరంగా సదాచార్యుల కారుణ్యాన్ని ప్రస్తుతించే పాశురం ఇది . ఆండాళ్ ఆచార్యులను జ్ఞానవర్షం కురిపించే కారుణ్యమేఘాలుగా ప్రస్తుతించింది . ఆచార్యులు తమను ఆశ్రయించి, శరణు కోరినవారిని సంసారతాపకూపం నుంచి ఉద్ధరించి ఆత్మసమర్పణ బోధించి మోక్షసిద్ధికి అర్హులను చేస్తారు . సదాచార్యుని వర్షర్తు మేఘంతో పోలుస్తూ ఆచార్యవర్యులు ఎన్నో ఉపమానాలు ఉదహరించారు . ఆండాళ్ అందుకు విరుద్ధంగా మేఘాన్నే నారాయణునితో పోల్చింది. ఆమె దృష్టిలో భగవానుడే 'ఉపమానం' . దేనితోనూ పోల్చబడదు. అంతటి మహోన్నతమైనది ఆమె సమర్పణభావం.

– **శ్రీదేవి మురళీధర్**

## పవర్ ఉమన్

# సూపర్ ఎగ్జయిటెడ్



ఉపాసన

బాధ్యతలు పెరిగే కొద్దీ 'ఉపాసన' శక్తి పెరుగుతుందేమో! పెరిగే కొద్దీ కాకపోవచ్చు. ఇష్టపడే కొద్దీ అనాలి. పవర్ ఉమన్ ఉపాసన కామినేని కొణిదెల ఇప్పుడు 'సూపర్ ఎగ్జయిటెడ్'గా ఉన్నారు. ప్రపంచ ప్రసిద్ధ వన్యప్రాణి సంరక్షణ సంస్థ డబ్ల్యు.డబ్ల్యు.ఎఫ్. (వరల్డ్ వైడ్ ఫండ్) తనను రెండు తెలుగు రాష్ట్రాలకు ఫిలాంత్రోఫీ అంబాసిడర్‌గా ఎంపిక చేసిందన్న వార్తను వినగానే ఆ పచ్చని కబురును వెంటనే ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో తన ఫాలోవర్స్‌తో పంచుకున్నారు. డబ్ల్యు.డబ్ల్యు.ఎఫ్. దాతృత్వ రాయబారి (ఫిలాంత్రోఫీ అంబాసిడర్) గా ఉపాసన అటవీ శాఖకు చెందిన 20 వేల మంది కార్మికుల ఆరోగ్య సంరక్షణ బాధ్యతల్ని స్వీకరిస్తారు. దేశవ్యాప్తంగా ఉన్న అపోలో ఆసుపత్రులు ఆ కార్మికులకు వైద్య చికిత్సలను అందజేస్తాయి. భారత్‌లో డబ్ల్యు.డబ్ల్యు.ఎఫ్. కార్యక్రమాలు మొదలై ఈ ఏడాదికి యాభై ఏళ్లు. ఇదే ఏడాది ఉపాసన రాయబారి అవడం ప్రాముఖ్యాన్ని సంతరించుకుంది. ఉపసాన ఇప్పటికే అపోలో హాస్పిటల్స్ సి.ఎస్.ఆర్. వైస్–ఛైర్మన్‌గా, అపోలో లైఫ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా, 'బి–పాజిటివ్' మ్యాగజీన్ ముఖ్య సంపాదకురాలిగా బాధ్యతలను నిర్వహిస్తున్నారు. 'అమితమైన ఉద్వేగానికి లోనయ్యాను. నిబద్ధతతో పని చేయడానికి సిద్ధంగా ఉన్నాను' అని ఇన్‌స్టాగ్రామ్‌లో ఉపాసన పెట్టిన పోస్ట్‌ని బట్టి ఇప్పుడీ కొత్త బాధ్యత ఆమెకు మరింత పవర్ ఇవ్వబోతున్నట్లే ఉంది.

## ట్రెండ్

# శారీ స్పీక్

**భారతీయ మహిళల సంప్రదాయ కట్టు అయిన చీర ప్రత్యేకతను సోషల్ మీడియాలో చాటుతూ.. ఆ నేతను బతికించుకోవడానికి ఉత్సవాలూ నిర్వహిస్తోంది 'శారీ స్పీక్' గ్రూప్! మొన్న శనివారం హైదరాబాద్ లోని కర్మ శాంగ్రిల్లాలో జరిగిన ఫెస్టివల్ సందర్భంగా 'శారీ స్పీక్" గురించి...**

శారీ స్పీక్ అనేది ఫేస్‌బుక్‌లో ఒక పేజీ. లక్షా పాతిక వేల మంది మహిళలు సభ్యులుగా ఉన్న సోషల్ మీడియా గ్రూప్! చీరకట్టు మీద ఉన్న ప్రేమతో మూడేళ్ల కిందట వినీ టండన్ అనే మహిళ ఈ గ్రూప్‌ను ప్రారంభించారు. మారిన జీవన శైలి దృష్ట్యా సౌకర్యం కోసం వస్త్రధారణ కూడా మారింది. దాంతో ప్రత్యేక సందర్భాలకే పరిమితమైపోయింది చీర. ఈ సంప్రదాయ కట్టుకు, దానితో కలబోసి ఉన్న నేతకూ పునర్వైభవం తెప్పించి, నేత కార్మికులకూ ఎంతో కొంత సహాయపడ్డానికి 'శారీ స్పీక్' గ్రూప్‌ను మొదలుపెట్టారు వినీ టండన్. ఆరంభించిన అనతికాలంలోనే సభ్యుల సంఖ్య లక్షకు చేరింది. పద్దెనిమిదేళ్లు నిండిన వాళ్లనుంచి అరవై ఏళ్లు పైబడ్డ వాళ్ల దాకా, దేశీ మహిళలతోపాటు విదేశీ వనితలూ ఇందులో సభ్యులుగా ఉన్నారు. వీళ్లంతా చీర నేత, కట్టుతీరుతో పాటు తమ ప్రాంతపు జీవన విధానం, సంస్కృతీ సంప్రదాయల గురించి ఫేస్‌బుక్‌లోని ఈ శారీ స్పీక్ పేజీలో రాస్తుంటారు... ఆ చీరతో ఉన్న తమ ఫొటోను జతచేసి మరీ. ''దీని వల్ల ఆ నేతే కాదు, ఆ ప్రాంతం గురించీ, దాని ప్రత్యేకత గురించీ ఇతర సభ్యులకు తెలుస్తుంది. కల్చరల్ ఎక్స్ఛేంజ్ జరుగుతుంది. భిన్న సంస్కృతి, సంప్రదాయాల మీద గౌరవం పెరుగుతుంది. ఐక్యతా ఏర్పడుతుంది. అయితే ఈ గ్రూప్‌లో చీరల అమ్మకాలు, కొనుగోళ్లుండవు'' అని చెప్తారు శారీ స్పీక్ సభ్యురాలు భాను ఇలపావులూరు. థీమ్స్‌తో ఫ్యాషన్ షో శారీ స్పీక్ కేవలం సోషల్ మీడియా గ్రూప్‌కే పరిమితం కాకుండా యేడాదికి రెండుసార్లు భిన్నమైన థీమ్స్‌తో సమావేశమూ అవుతోంది. దాన్నో పండగలా నిర్వహిస్తోంది. దేశవ్యాప్తంగా వాళ్ల వాళ్ల నగరాల్లో ఈ ఫెస్టివల్‌ను జరుపుకుంటారు. సంప్రదాయపు ఆటలు, పాటలు, ఫ్యాషన్ పరేడ్స్ ఉంటాయి. థీమ్స్ కూడా చాలా గమ్మత్తుగా పెట్టుకుంటారు. ఒకసారి 70, 80ల్లోని సినిమా నటీమణుల్లాగా చీర కట్టుకోవడం, ఇంకోసారి కంచి పట్టు చీరల్లో, ఒకసారి కాటన్ శారీస్‌లోనే రావడం... ఇలా రకరకాల థీమ్స్ ఉంటాయి. మొన్న శనివారం (14, డిసెంబర్) జరిగిన ఫెస్టివల్‌కు థీమ్... ఇతర రాష్ట్రాల చీరకట్టు. మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, గుజరాత్, రాజస్థాన్, ఈశాన్య రాష్ట్రాలు సంప్రదాయ చీరకట్టును థీమ్‌గా పెట్టారు. ఈ ఉత్సవాన్ని శ్రీకళా గణపతి, మధు గౌర్, రాహత్ ఖాన్ నిర్వహించారు. స్థానికంగా సరే... యేడాదికి ఒకసారి 'గోవా'లోనూ శారీ స్పీక్ సంబరాలు జరుగుతుంటాయి. ఆ పండక్కి విదేశీ వనితలూ హాజరవుతారు.



మహారాష్ట్ర చీరకట్టులో 'శారీ స్పీక్' మెంబర్



హైదరాబాద్ 'శారీ స్పీక్' ఉత్సవంలో పాల్గొన్న సభ్యులు



హైదరాబాద్ 'శారీ స్పీక్' నిర్వాహకులు మధు గౌర్, రాహత్ ఖాన్, భాను ఇలపావులూరు, శ్రీకళా గణపతి

## ● ముగ్గు-ముచ్చట



# ముగ్గులకు ఆహ్వానం

*ముగ్గులు పంపవలసిన చిరునామా:*

ముగ్గు-ముచ్చట,
సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్,
రోడ్ నెం.1, బంజారాహిల్స్,
హైదరాబాద్–34.
muggulu.sakshi@gmail.com



24 చుక్కలు, 2 వరుసలు
22 చుక్కలు, 2 వరుసలు
20 చుక్కలు, 2 వరుసలు
18, 14, 10,
4, 2 వచ్చే వరకు



**పి.వి.ఎల్.సుజాత**
సైనిక్‌పురి,
సికింద్రాబాద్

17 చుక్కలు
1 వచ్చే వరకు
సరి
చుక్క





**అంగలకుదుటి
గోవింద రాజేశ్వరి**

## బ్యూటిప్

# గ్రీన్ టీ ప్యాక్



గుప్పెడు తేయాకులను కాచి, వడకట్టిన కప్పు నీటిలో రెండు స్పూన్ల బియ్యప్పిండి, అర టీ స్పూన్ తేనె కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి, కాళ్లకు, చేతులకు పట్టించాలి. ఇరవై నిమిషాల తర్వాత గోరువెచ్చని నీళ్లను ముఖానికి చల్లి, వేళ్లతో వృత్తాకారంలో మర్దన చేయాలి. ఇలా చేయడం వల్ల మృత కణాలు సులువుగా పోతాయి. తర్వాత శుభ్రపరుచుకోవాలి. చర్మం మృదువుగా, కాంతిగా తయారవుతుంది.



సాక్షి
ఫ్యామిలీ
సినిమా
నల్లగొండ
గురువారం
19-12-2019



● సోనాక్షి, సాయి మంజ్రేకర్, ప్రభుదేవా, సల్మాన్ ఖాన్, రామ్‌చరణ్, సుదీప్, వెంకటేష్

● డ్యాన్స్ చేస్తున్న సల్మాన్, చరణ్, వెంకటేష్

# ఆటకైనా.. వేటకైనా రెడీ

- సల్మాన్ ఖాన్

సల్మాన్‌ఖాన్ హీరోగా 'దబాంగ్' సిరీస్‌లో తెరకెక్కిన చిత్రం 'దబాంగ్ 3'. ఈ చిత్రానికి ప్రభుదేవా దర్శకత్వం వహించారు. ఇందులో సోనాక్షి సిన్హా కథానాయికగా నటించారు. అర్బాజ్ ఖాన్, నిఖిల్ ద్వివేది, సల్మాన్‌ఖాన్ నిర్మించిన ఈ చిత్రం హిందీతో పాటు తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో రేపు విడుదల కానుంది. సల్మాన్‌ఖాన్ ఫిల్మ్స్ సౌజన్యంతో సురేష్ ప్రొడక్షన్స్, గ్లోబల్ సినిమాస్ 'దబాంగ్ 3' తెలుగు వెర్షన్‌ను విడుదల చేస్తున్నారు. ఈ చిత్రం ప్రీ–రిలీజ్ వేడుక బుధవారం జరిగింది. ఈ వేడుకకు హీరోలు వెంకటేష్, రామ్ చరణ్ అతిథులుగా హాజరయ్యారు. సల్మాన్ ఖాన్ మాట్లాడుతూ – ''వెంకీమామ.. అంటే వెంకటేష్ గారు.. నాకు పాతికేళ్లుగా స్నేహితులు. రామ్‌చరణ్ నాన్నగారు చిరంజీవి నాకు చాలా క్లోజ్. రామ్‌చరణ్ నాకు తమ్ముడులాంటివాడు. చరణ్ కూడా నాకు క్లోజే. ఈ సినిమాలో హీరోగా నా స్థాయిని పెంచేలా నటించారు కన్నడ నటుడు సుదీప్. 'దబాంగ్ 3' ప్రేక్షకులకు నచ్చుతుంది'' అంటూ చిత్రంలోని 'ఆటకైనా.. వేటకైనా రెడీ' అనే డైలాగ్ చెప్పారు. ''దబాంగ్ 3'లో సల్మాన్ డైలాగ్స్ మామూలుగా లేవు. సల్మాన్‌ను ప్రేమించే అభిమానులతో పాటు ఇతర ప్రేక్షకులు కూడా ఈ సినిమాను హిట్ చేయాలని కోరుకుంటున్నాను '' అన్నారు వెంకటేష్. ''సల్మాన్‌భాయ్ నుంచి ఎన్ని నేర్చుకుంటున్నానో వివరించడానికి ఒక వేదిక, కొన్ని మాటలు సరిపోవు. సల్మాన్, సుదీప్, వెంకటేష్‌గారు, చిరంజీవిగారు.. ఇలాంటి సూపర్ స్టార్లు అందరిలో ఒక కామన్ పాయింట్ ఉంది. అది యాక్టింగ్, డైలాగ్ డెలివరీ, యాక్షన్ కాదు... క్రమశిక్షణ గురించి చెబుతున్నాను. వీరి నుంచి మా తరం క్రమశిక్షణను నేర్చుకుంటాం. నాతో పాటు చాలా మందికి స్ఫూర్తిగా నిలిచిన సల్మాన్‌ఖాన్‌గారికి ధన్యవాదాలు'' అన్నారు రామ్‌చరణ్. ''దబాంగ్ 3' మన తెలుగు సినిమాలానే ఉంటుంది. థియేటర్‌లో చూసి ప్రేక్షకులు ఈ సినిమాను హిట్ చేయాలి'' అన్నారు ప్రభుదేవా. ''సల్మాన్‌గారితో స్క్రీన్ షేర్ చేసుకోవడం గౌరవంగా ఫీల్ అవుతున్నాను'' అన్నారు సుదీప్. ''ఇది మా అందరికీ చాలా ప్రత్యేకమైన సినిమా'' అన్నారు సోనాక్షి సిన్హా. ''ఈ చిత్రంలో 'హుడ్ హుడ్, గుభాళించనే' అనే పాటలు రాసే అవకాశం ఇచ్చిన సల్మాన్, ప్రభుదేవాగార్లతో పాటు సంధానకర్తగా వ్యవహరించిన రాజేశ్వరీ సుధాకర్‌గారికి ధన్యవాదాలు'' అన్నారు రచయిత రామజోగయ్య శాస్త్రి. ''జీవితంలో కండలు పెంచాలనే కోరిక ఉండేది. అది తీరలేదు. కానీ కండల వీరుడికి పాట రాసే అవకాశం వచ్చినందుకు సంతోషంగా ఉంది. ఇందులో 'ఊ కొడితే, తొలిగా తొలిగా..' అనే పాటలు రాశాను. ప్రభుదేవా, వీవీవీ రాయుడుగార్లకు ధన్యవాదాలు'' అన్నారు రచయిత అనంత శ్రీరామ్. సురేష్ ప్రొడక్షన్స్ ప్రతినిధి జగదీష్, ఏషియన్ సునీల్ నారంగ్, భరత్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# వైఫ్ ఆఫ్ రామ్


● త్రిష

పదిహేనేళ్లకు పైగా హీరోయిన్ పాత్రలు చేస్తున్న నటి త్రిష ఇప్పటివరకు మలయాళంలో చేసింది మాత్రం ఒక్క సినిమాయే. గతేడాది 'హే జూడ్' చిత్రంతో ఆమె మలయాళంలో తొలి అడుగు వేశారు. ఈ సినిమాలో త్రిష నటనకు అక్కడ మంచి మార్కులే పడ్డాయి. అందుకే మాలీవుడ్ నుంచి కూడా ఆమెకు అవకాశాలు వస్తున్నాయి. మోహన్‌లాల్ హీరోగా జీతూ జోసెఫ్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న 'రామ్' అనే చిత్రంలో త్రిషను కథానాయికగా తీసుకున్నారు. ఇందులో మోహన్‌లాల్ చేస్తున్న రామ్ పాత్రకు భార్యగా త్రిష కనిపిస్తారు. వచ్చే ఏడాది ఓనమ్ పండగకి ఈ చిత్రాన్ని రిలీజ్ చేయాలనుకుంటున్నారు. ఇదిలా ఉంటే... 'పొన్నియిన్ సెల్వన్', చిరంజీవి –కొరటాల కాంబినేషన్ సినిమాల్లో త్రిష ఒక కథానాయికగా నటించబోతున్నారని తెలిసింది. సో.. వచ్చే ఏడాది త్రిష బిజీ అన్నమాట.

# బ్లాక్‌బస్టర్ బహుమతి


● విజయ్ దేవరకొండ

హీరోగా విజయ్ దేవరకొండ క్రేజ్ గురించి ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. ఇక దర్శకునిగా శివ నిర్వాణ తెరకెక్కించిన రెండు చిత్రాలు 'నిన్నుకోరి (2017), మజిలీ (2019)' హిట్ సాధించాయి. ఇప్పుడు వీరిద్దరి కాంబినేషన్‌లో ఓ సినిమా తెరకెక్కనుంది. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాత 'దిల్' రాజు నిర్మించనున్నారు. బుధవారం (డిసెంబరు 18) నిర్మాత 'దిల్' రాజు పుట్టినరోజు. ఈ సందర్భంగా ఈ సినిమాను అధికారికంగా ప్రకటించారు. ''రాజుగారికి పుట్టినరోజు శుభాకాంక్షలు. బ్లాక్‌బస్టర్ బహుమతి లోడ్ అవుతోంది'' అని పేర్కొన్నారు విజయ్ దేవరకొండ. ప్రస్తుతం 'వరల్డ్ ఫేమస్ లవర్, హీరో, ఫైటర్' సినిమాలతో విజయ్ బిజీ. అలాగే నాని హీరోగా నటిస్తున్న 'టక్ జగదీష్'తో శివ నిర్వాణ కూడా బిజీ.. సో.. వీరిద్దరు వారి వారి సినిమాలను పూర్తి చేశాక ఈ సినిమా సెట్స్‌పైకి వెళ్తుందని ఊహించవచ్చు.

''చేసే పనిపై ఏకాగ్రతతో ఉంటే ఏ రంగంలో అయినా రాణించవచ్చు. ఆ ఏకాగ్రతే క్రమశిక్షణ, అంకితభావం, నిజాయతీలను అలవరుస్తుంది'' అన్నారు కేయస్ రవికుమార్. బాలకృష్ణ హీరోగా ఆయన దర్శకత్వంలో సి. కల్యాణ్ నిర్మించిన 'రూలర్' రేపు విడుదల కానుంది. ఈ సందర్భంగా కేయస్ రవికుమార్ చెప్పిన విశేషాలు.

# సినిమా ఎలా తీయకూడదో నేర్చుకున్నాను


● కేయస్ రవికుమార్

● ముందుగా 'రూలర్' సినిమాకు వేరే కథ అనుకున్నమాట వాస్తవమే. కానీ పరుచూరి మురళి చెప్పిన కథ నచ్చడంతో కొన్ని చిన్న మార్పులతో 'రూలర్' సినిమా చేశాం. మొదట అనుకున్న కథను వద్దనుకోవడానికి పెద్ద కారణాలు లేవు. ఉత్తరప్రదేశ్‌లోని తెలుగువారికి చెందిన కథ ఇది. సినిమాలోని ఈ సినిమా బాలకృష్ణగారి అభిమానులకే కాదు... ఇతర ప్రేక్షకులకూ నచ్చుతుంది. 'జై సింహా' తర్వాత వెంటనే నేను బాలకృష్ణగారితో 'రూలర్' చేశాను. ఈ సినిమా కోసం బాలకృష్ణగారు బరువు తగ్గారు. ఉదయాన్నే 3 గంటలకు నిద్రలేచి వర్కౌట్స్ చేసేవారట.

● నా కెరీర్‌లో ముందుగా చిన్న సినిమాలు చేసి, ఇప్పుడు పెద్ద సినిమాలు చేస్తున్నాను. ప్రస్తుతం హీరో ఇమేజ్‌ని కూడా దృష్టిలో పెట్టుకుని సినిమాను తెరకెక్కిస్తున్నాను. 'రూలర్' సినిమాని బాలకృష్ణగారి ఇమేజ్‌ని దృష్టిలో పెట్టుకునే చేశా. తన అసిస్టెంట్లు తప్పు చేసినప్పుడు మాత్రమే బాలకృష్ణగారు సెట్‌లో కోప్పడతారు. అది కూడా అన్ని సందర్భాల్లో కాదు. ప్రణాళిక ప్రకారం అన్నీ జరగకపోతే సెట్‌లో నేనూ షార్ట్ టెంపరే.

● నా కెరీర్ మొదట్లో దాదాపు పదేళ్లు అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేశాను. అప్పుడు సినిమా ఎలా తీయాలి? అనే దానికంటే కూడా... ఒక సినిమా ఎందుకు ఫెయిల్ అవుతుంది? సినిమాను ఎలా తీయకూడదు? ఏం తప్పులు చేయకూడదు? అనే అంశాలనే ఎక్కువగా నేర్చుకున్నాను.

● ప్రీ–ప్రొడక్షన్, పోస్ట్ ప్రొడక్షన్ పనులను పక్కాగా ప్లాన్ చేసుకుంటే పెద్ద స్టార్స్‌తో సినిమాలను కూడా త్వరగా పూర్తి చేయవచ్చు. 'రూలర్' సినిమాను నాలుగు నెలల్లో పూర్తి చేశాం. గతంలో చిరంజీవిగారి 'స్నేహంకోసం' సినిమాను 45 రోజుల్లోనే పూర్తి చేశాను. ఆ సినిమా చేసేటప్పుడే రజనీకాంత్‌గారి 'నరసింహా' సినిమాకి డైలాగ్స్ రాసుకున్నాను. పెద్ద స్టార్స్‌తో సినిమాలు చేసేప్పుడు ఈగో ఉండకూడదు. హీరో ఇమేజ్‌ని డైరెక్టర్ గౌరవించాలి. డైరెక్టర్‌ను హీరో గౌరవించాలి. నటీనటులకు లొకేషన్‌లో నటించి చూపిస్తాం కాబట్టి దర్శకులకు కూడా నటన వచ్చేస్తుంది. ప్రస్తుతం నేను కొన్ని తమిళ సినిమాల్లో నటిస్తున్నాను. తెలుగులో రవితేజ సినిమాలో ఓ పాత్ర చేయాల్సింది. కానీ కుదర్లేదు.

''మనకు నచ్చిన పని చేస్తూ, మనవారితో సంతోషంగా ఉంటే 'ప్రతిరోజూ పండగే'. అందుకు తల్లిదండ్రులు, గురువుల ఆశీస్సులు కావాలి'' అన్నారు సాయితేజ్. మారుతి దర్శకత్వంలో సాయితేజ్, రాశీఖన్నా జంటగా అల్లు అరవింద్ సమర్పణలో 'బన్నీ' వాస్ నిర్మించిన చిత్రం 'ప్రతిరోజూ పండగే'. ఎస్‌కేఎన్ ఈ చిత్రానికి సహ–నిర్మాత. ఈ చిత్రం రేపు విడుదల కానుంది. ఈ సందర్భంగా సాయి తేజ్ చెప్పిన సంగతులు.

# ఇది చాలదని చరణ్ అన్నారు


● సాయితేజ్

● ఇది తాత–మనవడి కథ. ఐదు వారాల్లో తాత చనిపోతాడని తెలిసి, ఆయన బతికి ఉన్నంత కాలం సంతోషంగా ఉంచాలనుకుంటాడు మనవడు. తాత కోసం ఆ మనవడు ఏం చేశాడు? తాత తన జీవితంలో చేయాలనుకుని చేయలేని పనులను మనవడి సాయంతో చివరి రోజుల్లో ఎలా చేశారు? అనే అంశాలు ఆసక్తికరంగా ఉంటాయి. ఇందులో తాత పాత్రలో సత్యరాజ్‌గారు, మనవడి పాత్రలో నేను నటించాను. నా తండ్రి పాత్రలో రావు రమేష్‌గారు నటించారు. ఉగాది పచ్చడిలా ఈ సినిమాలో అన్ని ఎమోషన్స్ ఉంటాయి. ఇందులో ఉన్న డైనింగ్ టేబుల్ సన్నివేశం తీసేటప్పుడు నా నిజ జీవితంలోని కొన్ని సంఘటనలకు కనెక్ట్ అయ్యాను.

● దాదాపు పదేళ్ల క్రితం మారుతి అన్నను ఓ సందర్భంలో కలిశాను. అప్పుడు ఓ కథ చెప్పారు. నిజానికి నాకు అప్పటికి యాక్టింగ్ అంటే ఇంట్రెస్ట్ లేదు. కానీ, కథ విన్నా. మారుతి అన్న డైరెక్షన్‌లో సినిమా చేయడం ఇప్పటికి కుదిరింది. అయితే అప్పుడు ఆయన చెప్పిన కథ ఇది కాదు. మా సినిమా విడుదలవుతున్న రోజునే మరో మూడు సినిమాలు విడుదలవుతున్నాయి. మా సినిమాతో పాటు అవికూడా బాగా ఆడాలని కోరుకుంటున్నాను.

● 'చిత్రలహరి' సినిమా కోసం బరువు పెరిగాను. 'ప్రతిరోజూ పండగే' కోసం దాదాపు 20 కేజీలు తగ్గాను. ఈ సినిమాలో 'హోమం' చేస్తున్న ఓ సన్నివేశంలో ఫైట్ సీన్ కోసం షర్ట్ విప్పాల్సి ఉంటుంది. అలా ఆ సీన్‌లో సిక్స్‌ప్యాక్‌తో కనిపించాను.

● ఓసారి నేను వర్కౌట్స్ చేస్తున్నప్పుడు చరణ్ (రామ్‌చరణ్) చూశారు. 'ఇది చాలదు' అని 'ధృవ' సమయంలో తనకు జిమ్ ట్రైనర్‌గా ఉన్న రాకేష్ ఉదయార్‌ను సూచించారు. సరైన వర్కౌట్స్ చేసి బరువు తగ్గాను. మరోసారి బరువు పెరిగి తగ్గాలనుకోవడం లేదు. అంత ఓపిక లేదు (నవ్వుతూ).

● చిరంజీవిగారు 'ప్రతిరోజూ పండగే' కథ విన్నారు. బాగా చేయాలన్నారు. చిరంజీవిగారి ఫ్యామిలీ నుంచి ఇండస్ట్రీకి వచ్చాను. అది నాకు ప్లస్సో, మైనస్సో అనుకోవడం లేదు. ఒక బాధ్యతగా భావిస్తున్నాను.












# కాఫ్ & క్లూస్

## హెచ్చరించే దగ్గు



గాలిని నిరంతరం ఊపిరితిత్తుల్లోకి పీల్చుకుని మళ్లీ వదిలేసే ప్రక్రియే శ్వాసక్రియ. నోరు, ముక్కు నుంచి ఊపిరితిత్తుల మార్గమధ్యంలో... అంటే సరిగ్గా గొంతులో గ్లాటిస్ అనే భాగం ఉంటుంది. ఊపిరితిత్తుల్లోకి వెళ్లిన గాలి ఆ గ్లాటిస్‌నుంచి ఒక్కసారిగా బలంగా నోటి నుంచి బయటకు రావడాన్ని 'దగ్గు' అంటారు. అది ఒకే ఒకసారి రావచ్చు. లేదా అలా వస్తూనే ఉండవచ్చు.

**దగ్గులో రకాలు...**

**తడి దగ్గు :** మన ఊపిరితిత్తుల్లో వాయువుల మార్పిడి జరిగే చోట తడిగా ఉంచేందుకు కొన్ని స్రావాలు ఉత్పత్తి అవుతుంటాయి. ఈ స్రావాలు మామూలుగానైతే బయటకు రావు. ఏవైనా కారణాల వల్ల ఈ స్రావాల ఉత్పత్తి సాధారణం కంటే ఎక్కువగా జరుగుతుంటే దగ్గుతో పాటు అవి బయటకు వస్తుంటాయి. అలా వచ్చేదాన్ని తడి దగ్గు (వెట్ కాఫ్) అంటారు.

**పొడి దగ్గు :** దగ్గుతున్నప్పుడు స్రావాలు ఏమీ రాకుండా వచ్చే దాన్ని పొడి దగ్గు అంటారు. తడి, పొడి దగ్గులను బట్టి కొన్ని వ్యాధులను తొలిదశలో ప్రాథమికంగా తెలుసుకోవచ్చు. ఉదాహరణకు పొడి దగ్గు వస్తుంటే వ్యాధి శ్వాసకోశనాళాల తొలి భాగం (అప్పర్ రెస్పిరేటరీ ఎయిర్-వే)లో ఉందని, తడి దగ్గు అయితే ఊపిరితిత్తుల్లోపల వ్యాధులు (బ్రాంకైటిస్, నిమోనియా, ఆస్తమా) ఉండవచ్చునని డాక్టర్లు ఒక అంచనాకు వస్తుంటారు.

**రాత్రీ - పగలూ తేడాను బట్టి...**

దగ్గు వచ్చే వేళల్లో తేడాను బట్టి కొన్ని వ్యాధిలను అనుమానించవచ్చు. రాత్రి వేళల్లో దగ్గు వస్తుంటే అది అలర్జీ కారణంగా వస్తుందని అనుమానించవచ్చు. మధ్యాహ్నం పూట దగ్గు ఎక్కువగా ఉంటే దానికి ఏవైనా ఇన్ఫెక్షన్స్ కారణం కావచ్చని ఊహిస్తారు.

**నివారణ ఇలా...**

- మన పరిసరాలను, వాతావరణాన్ని శుభ్రంగా ఉంచుకోవాలి.
- పొగతాగే దురలవాటును పూర్తిగా మానేయాలి.
- సరిపడని వారు పెంపుడు జంతువుల నుంచి దూరంగా ఉండాలి.
- పక్కబట్టలను శుభ్రంగా ఉంచుకోవాలి.
- పుస్తకాల అరలను సాధ్యమైనంతవరకు మూసి ఉంచాలి
- వీలైనంత వరకు ఘాటైన వాసనలు వచ్చే సుగంధద్రవ్యాలు (పెర్‌ఫ్యూమ్స్)ను ఉపయోగించకపోవడం వంటి జాగ్రత్తలతో దగ్గునుంచి దూరంగా, ఎప్పుడూ ఆరోగ్యంగా ఉండవచ్చు.

**తెమడను బట్టి...**

తడి దగ్గు వచ్చే సమయంలో బయటకు వచ్చే తెమడ /కళ్లె (స్పుటమ్/ఫ్లెమ్) రంగును బట్టి రకరకాల వ్యాధులను అనుమానించి, వాటికి తగిన విధంగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించవచ్చు. ఉదాహరణకు

- **ఆకుపచ్చరంగులో తెమడ ఉంటే...** సూడోమొనాస్ అనే బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్ వల్ల దగ్గు వస్తుండవచ్చు.
- **పసుపుపచ్చగా ఉంటే...** క్లెబ్‌సిల్లా నిమోనియా ఇన్ఫెక్షన్ వల్ల కావచ్చు.
- **ఎర్రగా ఉంటే...** సూడోమొనాలీ, నీమోకోకల్ వంటి బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్లు ఉన్నప్పుడు ఎర్రరంగులో కళ్లెపడవచ్చు.
- **నలుపు రంగులో ఉంటే...** కాలుష్యం బారిన పడటం, పొగతాగడం వంటివి జరిగి ఊపిరితిత్తుల్లో ఇన్ఫెక్షన్ వస్తే అప్పుడు దగ్గుతో పాటు వచ్చే కళ్లె నల్లగా ఉండవచ్చు.

**మరెన్నో జబ్బులకు సూచిక...**

దగ్గుతో అలర్జీ, టీబీ, నిమోనియా వంటి జబ్బులని అనుమానించవచ్చు. అలాగే... ● ఊపిరితిత్తుల్లో నీరు నిలిచిపోయే ప్లూరల్ ఎఫ్యూజన్ ● కీళ్ల నొప్పులతో వచ్చే రుమటాయిడ్ ఆర్థ్రైటిస్ ● కీళ్లకు సంబంధించిన లూపస్ అరిథమెటోసిస్ వంటి జబ్బులు ఉన్నప్పుడు కూడా పొడి దగ్గు వస్తూ ఉంటుంది.

**క్యాన్సర్లలో...**

స్వరపేటిక, ఊపిరితిత్తులు, నోటికి సంబంధించి క్యాన్సర్లలో మొదటి లక్షణంగా దగ్గు కనిపించవచ్చు.

**చికిత్స**

ఏ కారణం వల్ల దగ్గు వస్తోందో నిర్ధారణ చేశాక దాన్ని బట్టి చికిత్స ఉంటుంది. సాధారణంగా దగ్గు కనిపించగానే చాలామంది మందుల దుకాణాల్లో దొరికే దగ్గు మందులు వాడుతుంటారు. దాంతో తాత్కాలిక దగ్గు తగ్గినా వ్యాధి మాత్రం అలాగే లోపల ఉండిపోతుంది. అసలు ఎడతెరిపి లేకుండా దగ్గు వస్తుందంటేనే అది లోపల లేదో తీవ్రమైన సమస్య ఉందని చెప్పడానికి ఒక సూచన. కాబట్టి నిర్లక్ష్యం చేయకుండా పూర్తిస్థాయి చికిత్స తీసుకోవాలి. దగ్గు వచ్చిన సందర్భాల్లో సాధారణంగా యాంటీబయాటిక్స్, యాంటీ టీబీ మందులు, శ్వాసనాళాలను వెడల్పు చేసే బ్రాంకోడయలేటర్స్, తెమడను బయటకు తెచ్చే మందులైన ఎక్స్‌పెక్టరెంట్స్ వంటి మందులు ఉపయోగిస్తారు. కొన్ని సందర్భాల్లో ఆవిరి పట్టడం కూడా దగ్గు నుంచి మంచి ఉపశమనాన్ని ఇస్తుంది. వృద్ధాప్యంలో దగ్గు ఎడతెరిపిలేకుండా వస్తుంటే కేంద్ర నాడీ వ్యవస్థలో దగ్గును ప్రేరేపించే కేంద్రాన్ని ఉపశమింపజేయడానికి కోడిన్ వంటి మందులు ఉపయోగిస్తారు.

**వయసును బట్టి..**

దగ్గు కనిపించినప్పుడు రోగి వయసును బట్టి కూడా దాని కారణాన్ని అంచనా వేస్తుంటారు. ఉదాహరణకు...

- పిల్లల్లో (ఇన్‌ఫాంట్స్ మొదలుకొని ఐదేళ్ల వరకు) దగ్గు వస్తుంటే అది ఏదైనా బయటి పదార్థం (ఫారిన్‌బాడీ) ఊపిరితిత్తుల్లోపలికి వెళ్లడం వల్ల కావచ్చునని డాక్టర్లు అనుమానిస్తారు. అంటే... సాఫ్ట్‌టాయ్స్‌లో ఉండే నూగు, రగ్గుల్లో ఉండే నూలు, దుమ్ము, ధూళి వంటివి ఊపిరితిత్తుల్లోకి ప్రవేశించినప్పుడు వచ్చే అలర్జీ వల్ల దగ్గు రావచ్చు.
- గొంతు, ముఖంలో ఉండే ఖాళీ ప్రదేశాలైన సైనస్‌లు, శ్వాసనాళంలోని కింది భాగమైన బ్రాంకైలలో వైరల్ ఇన్ఫెక్షన్‌తో దగ్గు రావచ్చు.
- పిల్లల్లో బోర్డెటెల్లా పెర్ట్యుసిస్ అనే బ్యాక్టీరియమ్ ఇన్ఫెక్షన్ వల్ల నిరంతరాయం దగ్గు రావచ్చు. దీన్నే మనమంతా 'కోరింత దగ్గు' (ఊఫింగ్ కాఫ్) అంటుంటాం. అంతేకాదు... మరికొన్ని బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్స్ వల్ల కూడా దగ్గురావచ్చు.
- పిల్లల్లో గుండె కవాటాలు, గుండె గోడల్లోని చిల్లులకు సంబంధించిన వ్యాధులు (వీఎస్‌డీ, ఏఎస్‌డీ, పీడీఏ) వంటివి ఉన్నప్పుడు కూడా దగ్గు ఎక్కువగా కనిపిస్తుంది. దాంతోపాటు ఆయాసం కూడా ఉంటుంది. కొందరు పిల్లలు నీలంగా మారిపోతుంటారు. ఇలా నీలంగా మారే లక్షణాన్ని 'సైనోసిస్' అంటారు. దగ్గుతో పాటు ఈ లక్షణం కనిపిస్తే దాన్ని గుండె జబ్బుగా అనుమానించి తక్షణం చికిత్స అందించాలి.
- ఐదేళ్ల నుంచి 14 ఏళ్ల పిల్లల్లో... దగ్గు ఎక్కువగా వస్తుంటే అలర్జీ వల్ల శ్వాసనాళాలు కుంచించుకుపోయాయేమో అని అనుమానించాలి. ఎందుకంటే... అలర్జీ కారణంగా వచ్చే ఆస్తమాలో పిల్లికూతల (వీజింగ్) కంటే మొట్టమొదటగా దగ్గు కనిపిస్తుంటుంది.



**పెద్దల్లో వచ్చే దగ్గు...**

- **పొగతాగడం వల్ల :** పొగతాగేవారిలో ఊపిరితిత్తులోకి అనేక విషపూరితమైన రసాయనాలు వెళ్తాయి. పొగతాగడం అలవాటయ్యాక తొలి సిగరెట్‌లోలా వెంటనే దగ్గు రాకపోయినా, సుదీర్ఘకాలం పొగతాగిన వారిలో ఊపిరితిత్తులు దెబ్బతినడం వల్ల దగ్గు వస్తూ నల్ల రంగులో తెమడ కూడా పడుతుంటుంది.
- **అలర్జీతో :** పెద్దల్లో తగ్గు వస్తుంటే అది అలర్జీ వల్ల అయి ఉంటుందని అనుమానించాలి.
- **ఇన్ఫెక్షన్లతో :** టీబీ వ్యాధి ఉన్నవారిలో దగ్గు ప్రధానంగా కనిపిస్తుంది. మన జనాభాలో 75 శాతం నుంచి 85 శాతం మంది దేహాల్లో టీబీకి సంబంధించిన బ్యాక్టీరియా ఉంటుంది. అయితే మనలోని వ్యాధి నిరోధకశక్తి (ఇమ్యూనిటీ) వల్ల అది నిర్వీర్యంగా అలా ఉండిపోతుంది. కాని... కొందరిలో ఏవైనా ఇన్ఫెక్షన్లతో వ్యాధినిరోధక శక్తి లోపించినప్పుడు టీబీ వ్యాధి బయటపడుతుంది. అయితే టీబీ ఉన్న ప్రతివారికీ అలా ఎడతెరిపి లేకుండా దగ్గు రాదు. అప్పుడప్పుడు మాత్రమే దగ్గు వస్తూ, కొందరిలో తెమడ పడుతుంది. అయితే సాయంత్రం వేళల్లో శరీర ఉష్ణోగ్రత (టెంపరేచర్) పెరుగుతుంది. ఈ మూడు లక్షణాలు కనిపిస్తూ సాయంత్రం వేళ జ్వరం కనిపిస్తున్నప్పుడు అది టీబీ వ్యాధి కావచ్చేమోనని అనుమానించాలి. అంతేకాదు... టీబీ కనిపించిందంటే... వారిలో వ్యాధినిరోధకశక్తి తగ్గడానికి హెచ్ఐవీ లాంటి కారణాలేమైనా ఉన్నాయా అని తగిన పరీక్షలు కూడా చేయాల్సి ఉంటుంది.
- **నిమోనియా:** ఈ కారణంగా వచ్చే దగ్గుతో పాటు తెమడ ఆకుపచ్చగా లేదా పసుపు రంగులో పడవచ్చు.
- **కొన్ని రకాల మందులు :** పెద్దలకు హైబీపీ తగ్గించే కొన్ని మందులు వాడుతున్నప్పుడు వారిలో కొందరిలో దగ్గు కనిపించవచ్చు. ఈ మందులు ఆపగానే దగ్గు తగ్గిపోతుంది. అలాంటప్పుడు వారికి మందులు మార్చాల్సి ఉంటుంది.

**వృద్ధుల్లో...**

వయసు పెరుగుతున్న కొద్దీ మనలో తెమడను బయటకు పంపించే శక్తి (కాఫ్ రిఫ్లక్స్) తగ్గుతుంది. దాంతో తెమడ శ్వాసనాళంలోనే ఇరుక్కుపోవడంతో వృద్ధుల్లో దగ్గు చాల సాధారణంగా కనిపిస్తుంటుంది.



డాక్టర్ జి. హరికిషన్,
సీనియర్ ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్ అండ్ చెస్ట్ ఫిజిషియన్,
యశోద హాస్పిటల్స్, సికింద్రాబాద్

# రోగి పట్ల బంగారంలాంటి సమయం... గోల్డెన్ అవర్

ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు లేదా రోగికి పక్షవాతం లేదా గుండెపోటు లక్షణాలు కనిపించినా వారికి అత్యవసరంగా చికిత్స అందాల్సిన ఆ కీలకమైన సమయాన్ని వైద్యులు 'గోల్డెన్ అవర్'గా చెబుతుంటారు. తెలుగులో చెప్పాలంటే ఈ వ్యవధిని బంగారు ఘడియలు అనుకోవచ్చు.

**రోడ్డు ప్రమాదలు జరిగినప్పుడు :** వీటిని వైద్య పరిభాషలో ట్రామా కేసులుగా చెబుతుంటారు. ప్రమాదం జరిగినప్పుడు రోగికి కొన్ని అత్యవసర వైద్యసేవలు అందాలి. ఉదాహరణకు తక్షణం ఆక్సిజన్ అందించాలి. ఇందుకోసం అవసరమైతే శ్వాసనాళంలోకి గొట్టాన్ని వేయాల్సి రావచ్చు. ఇక రక్తస్రావాన్ని ఆపడం, సెలైన్ ఎక్కించడం వంటి చికిత్సలూ అందించాలి. వీటిని అడ్వాన్స్‌డ్ ట్రామా లైఫ్ సపోర్ట్ (ఏటీఎల్‌ఎస్) అంటారు. ఇలాంటి వైద్య సహాయాలు యాక్సిడెంట్ అయిన అరగంట / గంట లోపే అందితే ప్రాణాపాయాన్ని నివారించవచ్చు కాబట్టి దాన్ని గోల్డెన్ అవర్ అంటారు.

**హెడ్ ఇంజ్యూరీ అయితే మరింత వేగంగా :** తలకు దెబ్బతగిలినప్పుడు (హెడ్ ఇంజ్యూరీలో) రోగిని ఎంత త్వరగా ఆసుపత్రికి తరలిస్తే ప్రాణాపాయాన్ని అంతగా తప్పించవచ్చు. తలకు గాయమైనప్పుడు ప్రాణాపాయం సంభవించే అవకాశాలెక్కువ కాబట్టి ఇలాంటి సమయంలో మరింత త్వరితంగా స్పందించాలి.



**గుండెపోటు వచ్చినప్పుడు :** గుండెకు రక్తసరఫరా చేసే రక్తనాళాల్లో ఏదైనా అడ్డంకి వల్ల గుండె కండరానికి రక్తప్రసరణ ఆగితే దాన్ని హార్ట్‌ఎటాక్ అంటారన్నది తెలిసిందే. హార్ట్ ఎటాక్ వచ్చినవారికి గుండెకండరాన్ని కాపాడటానికి ఇచ్చే మందును గుండెపోటు వచ్చిన గంటన్నర (90 నిమిషాల్లో) లోపు ఇవ్వాలి. ఈ చికిత్సను థ్రాంబోలైసిస్ (రక్తపు గడ్డను కరిగించే మందు ఇవ్వడం) అంటారు. ఈ నిర్ణీత సమయం దాటాక థ్రాంబోలైసిస్ చికిత్సతో ఫలితం ఒకింత తక్కువ. కాంప్లికేషన్లూ ఎక్కువ.

**బ్రెయిన్‌స్ట్రోక్ (పక్షవాతం ) నివారణకు...**

మెదడుకు అందాల్సిన రక్తాన్ని సరఫరా చేసే రక్తనాళాల్లో రక్తం గడ్డకడితే పక్షవాతం వస్తుంది. దీన్నే ఇస్కిమిక్ స్ట్రోక్ అంటారు. ఇలాంటి వారికి మొదటి నాలుగున్నర గంటలలోపు టిష్యూ ప్లాస్మినోజెన్ యాక్టివేటర్ (టీపీఏ) అనే మందును ఇస్తారు. కాకపోతే ఎంత త్వరగా ఇస్తే అంత మంచి ఫలితాలుంటాయి. దీన్ని ఇవ్వాలంటే ముందుగా సీటీ స్కాన్, ప్లేట్‌లెట్ కౌంట్ పరీక్ష చేసి ఈ టీపీఏ ఇవ్వవచ్చా అనే విషయాన్ని నిర్ధారణ చేయాలి. ఇది చేయగలిగితే జీవితాంతం బాధపెట్టే పక్షవాతాన్ని నివారించవచ్చు.

**సెప్సిస్ :** రక్తంలో ఇన్ఫెక్షన్ వచ్చే పరిస్థితిని సెప్సిస్ అంటారు. వీళ్లకు బీపీ పడిపోతుంది. అలాగే మూత్రపిండాలు, కాలేయం, మెదడు వంటి కీలక అవయవాలు ఫెయిల్ అయ్యేందుకూ అవకాశాలెక్కువ. ఇలాంటి కండిషన్ రాకుండా నివారించడాన్ని వైద్య పరిభాషలో రిససిటేషన్ అంటారు. ఈ రిససిటేషన్ చేయడానికి రోగిని ఐసీయూలో ఉంచి చికిత్స చేయాలి. కొందరిలో ఇలా రక్తంలో ఇన్ఫెక్షన్ వస్తే... బీపీ తగ్గి షాక్‌లోకి వెళ్తారు. అలాంటి సందర్భాల్లో రోగిని వీలైనంత త్వరగా ఆసుపత్రిలో చేర్చాలి. చేర్చడానికి పట్టే వ్యవధి ఎంత తక్కువగా ఉంటే ప్రమాదం అంత తక్కువని గుర్తుంచుకోవాలి. ముఖ్యంగా బ్యాక్టీరియల్ మెనింజైటిస్‌ను అనుమానించినప్పుడు నిర్ధారణ కంటే ముందే ఎంత త్వరగా యాంటీబయాటిక్స్ ఇస్తే అంత ఫలితం దక్కుతుంది.



డాక్టర్ బి. చంద్రశేఖర్ రెడ్డి,
చీఫ్ న్యూరాలజిస్ట్, సిటీ న్యూరో సెంటర్,
రోడ్ నెం. 12, బంజారాహిల్స్,
హైదరాబాద్

# సాధారణ ఆరోగ్య సమస్యలుగా పొరబడే క్యాన్సర్లు

నిరక్షరాస్యత, గ్రామీణ నేపథ్యం, ఆర్థిక పరిస్థితులు, అమాయకత్వం ఆరోగ్య సమస్యలను తీవ్రతరం చేయడానికి ఒక కారణమైతే... బిజీలైఫ్, అందుబాటులో ఉండే మెడికల్ షాప్‌లు, ఫోన్లలోనే డాక్టర్ సలహాలు, ఓవర్ ది కౌంటర్ మెడిసిన్స్, యాంటీబయాటిక్స్, పెయిన్‌కిల్లర్స్, ఇంటర్నెట్ సమాచారం అనారోగ్య లక్షణాలకు తాత్కాలికంగా ఉపశమనం ఇచ్చినా... సమస్యను తీవ్రం చేసే అంశమని చెప్పవచ్చు. వేడి చేసిందనీ, పడని ఆహారం తీసుకున్నామనీ, ప్రయాణాల వల్ల అని, అలసట అని, ఎప్పుడో తగిలిన దెబ్బల చిహ్నాలంటూ భ్రమపడటం వల్ల అనీ, వయస్సు పైబడే కొద్దీ కనిపించే లక్షణాలే అంటూ సర్దుకుపోవడం వల్ల... ఇలా కారణాలేమైనప్పటికీ అవి క్యాన్సర్‌ను చాలా లేటు దశలో గుర్తించే పరిస్థితులే చాలా సందర్భాల్లో ఏర్పడుతుంటాయి. క్యాన్సర్ చికిత్స విధానాలన్నీ ఏ దశలో వ్యాధి కనుగొన్నామనే అంశం మీదే ఎక్కువగా ఆధారపడి ఉంటాయి.

**తలనొప్పి :** తలనొప్పి తరచూ అందరూ ఎదుర్కొనేదే. చికాకు, పనుల ఒత్తిడి, ఎండ, కొన్ని రకాల వాసనలు, ఆకలి వంటి కారణాలతో మైగ్రేన్ లేదా తలనొప్పి అప్పుడప్పుడు రావడం చాలా సహజమే. మందులు వాడినప్పటికీ తలనొప్పి రావడం, అలాగే ఉదయం లేవగానే తలభారం, తీవ్రమైన నొప్పి, వాంతులు కావడం, వికారం లాంటి లక్షణాలు బ్రెయిన్ ట్యూమర్‌కు సంకేతం కావచ్చు.

**గొంతునొప్పి :** చల్లటి పదార్థాలు, కొత్తప్రదేశం, తాగేనీరు మారాయి అందుకే గొంతు బొంగురు, నొప్పి అని బాధపడే వారిని చాలామందినే చూస్తుంటాం. వీటికి మందులు కోర్సుగా వాడాక కూడా ఆ సమస్య బాధిస్తుంటే మాత్రం డాక్టర్‌ను సంప్రదించి చెకప్స్ చేయించుకోవాలి. థైరాయిడ్ క్యాన్సర్, గొంతు సంబంధిత క్యాన్సర్, లంగ్ క్యాన్సర్ లక్షణాలు తొలిదశలో ఇలాగే ఉంటాయి.

**దగ్గు, ఆయాసం :** సిగరెట్టు తాగేవారు మాకు ఇలాంటి లక్షణాలు అలవాటే అనుకుంటారు. కానీ వీరికి లంగ్ క్యాన్సర్‌తో పాటు అనేక రకాల ఇతర క్యాన్సర్లు వచ్చే ముప్పు ఎక్కువ అని గ్రహించాలి. గొంతులో నస, ఆగని దగ్గు, కళ్లె/తెమడలో రక్తం, ఆయాసం వంటివి టీబీ లేదా లంగ్‌క్యాన్సర్ లక్షణాలు కావచ్చు.



**కడుపు ఉబ్బరం, మంట :** సరైన జీవనశైలి అలవరచుకుని నీరు, పీచు ఆహార పదార్థాలు ఎక్కువగా తీసుకుంటూ ఉన్నప్పటికీ, జీర్ణవ్యవస్థకు సంబంధించిన సమస్యలు వేధిస్తూ ఉంటే ఎండోస్కోపీ, స్కానింగ్ లాంటి పరీక్షలతో జీర్ణాశయానికి సంబంధించిన క్యాన్సర్లు, కాలేయం, పాంక్రియాస్, గాల్‌బ్లాడర్ క్యాన్సర్లను తొలిదశలోనే కనుగొనే అవకాశం ఉంది.

**మూత్రవ్యవస్థలో తేడాలు :** మూత్రంలో రక్తం పడటం, ఆగి ఆగిరావడం, మంటగా ఉండటం మొదలైన లక్షణాలు కనిపించినప్పుడు తమకు వేడిచేసిందని భ్రమిస్తూ ఉంటారు. సాధారణంగా నీళ్లు తక్కువ తాగడం, ఇన్ఫెక్షన్లు, కిడ్నీలో రాళ్లు వంటి కారణాలవల్ల ఈ లక్షణాలు కనిపించవచ్చు. ఇవి మరీ తీవ్రంగా ఉండి చికిత్సలకు లొంగకపోతే యూరినరీ బ్లాడర్‌కు సంబంధించిన క్యాన్సర్ కావచ్చని అనుమానించాలి. 50 ఏళ్లపైబడిన పురుషుల్లో ప్రోస్టేట్ గ్రంథి సమస్యలు, క్యాన్సర్ లక్షణాలు ఈ విధంగానే ఉండవచ్చు. నెలసరి మధ్య రక్తస్రావం, పొట్టభారంగా ఉండటం, ఆకలి మందగించడం, స్త్రీల నెలసరి ముందు ఉండే సమస్యలుగా (పీఎమ్ఎస్)గా పొరబడవచ్చుగానీ కొన్నిసార్లు అవి ఒవేరియన్, యుటిరైన్ క్యాన్సర్లూ కావచ్చు.



Dr. Ch. Mohana Vamsy
Chief Surgical Oncologist
Omega Hospitals, Hyderabad
Ph: 98480 11421,
Kurnool 08518273001

**మలవిసర్జనలో తేడాలు :** అజీర్తి, విరేచనాలు, మలంలో రక్తం వంటి లక్షణాలు ఆహారపు అలవాట్లు మారినప్పుడు పైల్స్, ఫిషర్, ఫిస్టులా వంటి సమస్యలున్నప్పుడు కనిపించవచ్చు. కానీ మలవిసర్జన సమయంలో ఎప్పుడూ రక్తం పడుతుంటే అవి కోలన్ క్యాన్సర్ లక్షణాలు కూడా కావచ్చు. సిగ్మాయిడోస్కోపీ, కొలనోస్కోపీ వంటి పరీక్షలతో సమస్య ఏమిటో తెలిసిపోతుంది. అసలు విషయాన్ని గమనించక రకరకాల ఆహార పదార్థాల వల్ల ఈ సమస్య తలెత్తోందని ఇతర అంశాలకు దీన్ని ఆపాదించుకుంటాం. తీవ్రమైన అలసట, ఆకలి, బరువు తగ్గడం, వీడని జ్వరం ఇంకా ఆయా అవయవాలకు సంబంధించిన లక్షణాలు ఉన్నట్లయితే 'గాలిసోకిందీ', 'దయ్యంపట్టిందీ', 'చేతబడి చేశారు' అంటూ పూజలు, మంత్రాలు, విభూది, తాయెత్తులు, దిష్టితీయడాలు వంటి అనేక మూఢనమ్మకాల పాలబడకుండా ఉండాలి. ఇలాంటివి చేస్తూ ఉండే ఫలితం కనిపించకపోగా అసలు సమస్య బయటపడే సమయానికి చేయిదాటిపోయే ప్రమాదం ఉంది. క్యాన్సర్ ఇతర భాగాలకూ వ్యాపించి, చికిత్సకు లొంగకుండా తయారుకావచ్చు.

ప్రతినెలా కనిపించే గడ్డలే అనీ, పాలగడ్డలనీ రొమ్ములో దీర్ఘకాలం పాటు కనిపించే కణుతులను అశ్రద్ధ చేస్తే కణితి ఇతర భాగాలకు పాకే ప్రమాదం పొంచి ఉంటుంది. అలసట, చర్మం మీద ఊదారంగు మచ్చలు, తేలికగా కమిలిపోవడం వంటివి బ్లడ్‌క్యాన్సర్‌ను హెచ్చరించవచ్చు. గోళ్లలో మార్పులు, ముందుకు వంగి ఉండటం లివర్ / లంగ్ క్యాన్సర్లకు సూచన కావచ్చు.

ఒత్తిడికి గురైనప్పుడు, వాతావరణం, ఆహారం మారినప్పుడు పైన పేర్కొన్న లక్షణాలు దాదాపుగా అందరూ ఎదుర్కొనేవే. అయితే తీవ్రంగా ఉన్నప్పుడు కూడా అవే కారణాలని భ్రమపడి ముందు వాడిన మందులనే మళ్లీ వాడుకుంటూ కాలయాపన చేస్తే సమస్యలను మనమే తీవ్ర చేసుకున్నవాళ్లమవుతాం. అందుకే చాలావరకు క్యాన్సర్ ముదిరాకే చికిత్సకు వస్తూ ఉంటారు. అదృష్టవశాత్తూ గత కొంత కాలంగా హెల్త్‌చెకప్స్ చేయించుకోవడం, అవగాహన పెంచుకోవడం శుభపరిణామంగా చెప్పవచ్చు.

# ఆనందారోగ్యాలకు పది సూత్రాలు

మంచి జీవనశైలి అనుసరించేవారు ఎప్పుడూ ఆరోగ్యంగా ఉంటారు. దాని తర్వాత రెండో ప్రాధాన్యత క్రమంలో వ్యాయామం ఉంటుంది. వ్యాయామం వల్ల రెండు లాభాలు. మొదటిది ఆకర్షణీయమైన సౌష్టవంతో చూడ్డానికి అందంగా కనిపిస్తారు. అలాగే ఎప్పుడూ ఫిట్‌నెస్‌తో ఉంటారు. ఈ రెండూ ఉంటే ఆత్మవిశ్వాసమూ పెరుగుతుంది. 'సౌండ్ మైండ్ ఇన్ సౌండ్ బాడీ' అనే నానుడి వినే ఉంటారు. మంచి ఆరోగ్యం ఉన్న దేహంలో ఆరోగ్యకరమైన మనసూ ఉంటుందటి దానర్థం. అంటే ఇలా జీవనశైలి, వ్యాయామాలతో కేవలం దేహ ఆరోగ్యమే కాదు... మానసిక ఆరోగ్యమూ సాధ్యమవుతాయన్నమాట. 'అందమె ఆనందం' అన్న సూక్తి కూడా మనందరమూ వింటూ ఉంటాం కదా. ఫైవన్నీ ఉంటే ఇక ఎప్పుడూ ఆనందంగా ఉండమూ సాధ్యమవుతుంది. అలా ఆరోగ్యం, అందం, ఆనందం కోసం ఆచరించాల్సిన సూచనలు చాలా సులువైనవి, తేలిగ్గా సాధ్యమయ్యేవి. అవేమిటో చూద్దాం.

**1 ఆహారం :** పొద్దున్నే కాస్త ఎక్కువ మోతాదులోనే మంచి బ్రేక్‌ఫాస్ట్ తీసుకోవాలి. ఆ తర్వాత మరీ ఎక్కువ కాకుండా, మరీ తక్కువ కాకుండా... ఓ మోస్తరుగా మధ్యాహ్న భోజనం తినాలి. ఇక రాత్రివేళ మితాహారం తినడం ఆరోగ్యంగా ఉండటానికి మనం అనుసరించాల్సిన ఆరోగ్య సూత్రం. మన ఆహారంలో ఎంత తింటున్నామనే దానికంటే అన్ని రకాల పోషకాలు అందేలా సమతులాహారం తీసుకోవడం చాలా ముఖ్యం. జంక్‌ఫుడ్‌ను, వీలైనంతవరకు బయటి ఆహారాలను పూర్తిగా మానేయడం మంచిది. సాయంత్రం 7 గంటల నుంచి రాత్రి 9 గంటలలోపే ఆహారం తినేయాలి. ఇక రాత్రి 10 గంటలు దాటాక ఆహారం తీసుకోవడం సరికాదు.



**2 వ్యాయామం :** క్రమం తప్పకుండా వ్యాయామం చేయడమనే నియమాన్ని అందరూ పాటించాల్సిందే. అయితే కొంత మంది కొద్ది రోజులు చేసి, ఆ తర్వాత మానేస్తుంటారు. ఇది సరికాదు. వ్యాయామాన్ని తప్పకుండా కొనసాగించాలి. రోజూ వీలుకాకపోతే కనీసం వారంలో ఐదు రోజుల పాటు రోజులో 45 నిమిషాల నుంచి గంట సేపు వ్యాయామం చేయాల్సిందేనని గుర్తుపెట్టుకోండి.



**3 సాకులు వెతకడం మానేయండి :** కొన్ని పనులు పూర్తి చేయడం కుదరనప్పుడు దానికి వెంటనే సాకులు వెతుక్కోవడం మానవ సహజం. పైగా కొన్ని పనులు చేయడానికి ఇష్టం లేనప్పుడు కూడా మనం వెంటనే సాకులు వెతుకుతాం. ఆహారం, వ్యాయామం విషయంలో ఇలా సాకులు వెతకడం చాలా సహజం. మంచిపనులు చేయాల్సి వచ్చినప్పుడు సాకులు వెతకడం పూర్తిగా మానేయండి. వెంటనే పని మొదలుపెట్టండి. మంచి ఫలితం ఉంటుంది.

**4 ఇష్టమైన ఆట :** మీరు ఇష్టంగా ఆడే ఆటను ఎంచుకోండి. అది కూర్చుని ఆడే ఆట కాకుండా... శరీరానికి కాస్తంత శ్రమ కలిగించేదై ఉండాలి. దీనివల్ల రెండు ప్రయోజనాలు. ఒకవేళ వ్యాయామం చేయడం కష్టమనిపిస్తే... ఆడటం అన్నది వినోదం కాబట్టి... ఆటోమేటిగ్గా ఇటు వినోదం/ఆనందం అటు వ్యాయామం రెండూ ఆటల వల్ల సమకూరతాయి. ఈ ఆటలో మీకెవరైనా భాగస్వామి ఉంటే వారితో వెళ్లడం వల్ల ఆరోగ్యకరమైన చర్చలతో మానసికంగా ఉల్లాసంగా కూడా ఉంటారు. ఈ బిజీలైఫ్‌లో మనకు ఆటలాడే పార్ట్‌నర్ దొరకకపోతే కొన్ని ఎలక్ట్రానిక్ ఉపకరణాల సహాయంతో మీ ఇంటి టీవీపైనే మీ క్రీడా భాగస్వామిని ఎంచుకునేందుకూ, అలాంటి ఎలక్ట్రానిక్ భాగస్వామితో ఇంట్లోనే ఆడుకునేందుకూ ఇప్పుడు వీలుంది. కాబట్టి ఆటలాడేందుకు క్రీడా భాగస్వామి దొరకడం లేదనే సాకుకు ఇప్పుడు తావే లేదు.



**5 కొత్తవాటిని నేర్చుకుంటూ ఉండండి :** మనమెప్పుడూ కొత్త విషయాలను నేర్చుకుంటూ ఉండటం వల్ల నిత్యం యంగ్‌గా ఉంటాం. ఒకవేళ మనకంటే చిన్నవాళ్ల నుంచి ఏవైనా కొత్తవి నేర్చుకోవాల్సి వస్తే అహానికి లోనుకావద్దు. ఎందుకంటే... కొన్ని కొత్త విషయాలు పాతతరం వారికంటే కొత్త తరం వారికే ఎక్కువ తెలుసు.

**6 ఎప్పుడూ ఆనందంగా ఉండండి:** ఎప్పుడూ దిగులుగా, విచారంగా ఉండకండి. మీరు చేసే ప్రతి పనినీ ఆస్వాదిస్తూ చేస్తూ ఉంటే ఆనందంగా ఉండటం తేలిగ్గా సాధ్యమవుతుంది.



**7 నిత్యం స్ఫూర్తి పొందుతూ ఉండండి :** మీరు పత్రికలు చదువుతున్నప్పుడూ, టీవీ చూస్తున్నప్పుడు ఎవరైనా స్ఫూర్తిదాయకమైన పనులు చేస్తే... వారి నుంచి స్ఫూర్తి పొందండి. ఇలా స్ఫూర్తి పొందడం ఆరోగ్యాన్ని పెంపొందిస్తుంది. పురోగతికీ తోడ్పడుతుంది.



**8 ఓపికగా ఉండండి :** మీరు ఏదైనా లక్ష్యాలు నిర్ణయించుకున్నప్పుడు అవి తీరే వరకు ఓపిక వహించండి. మీ పనిలో కష్టాలు ఎదురైనప్పుడు కుంగిపోకండి. అవి తొలగేవరకూ ఓర్పుగా ఉండండి. విజయాలు అవే సిద్ధిస్తాయి.



**9 ఎప్పుడూ కుంగిపోకండి :** కష్టాలు వస్తే కుంగిపోకండి. కష్టమెప్పుడూ శాశ్వతం కాదు.

**10 ప్రయత్నాన్ని వదిలిపెట్టకండి :** మనం తప్పక ఆచరించగలమనే వాటినే లక్ష్యాలుగా పెట్టుకోండి. ఆ లక్ష్యసాధనలో ఎప్పుడూ వెనక్కు తగ్గకండి. ఎట్టిపరిస్థితుల్లోనూ మీ ప్రయత్నాలు వదలకండి.

మీ ఆరోగ్యానికీ, అభివృద్ధికీ, ఆనందానికీ ఈ పది సూత్రాలెప్పుడూ ఉపయోగపడతాయి. ఇక ఆచరించడం మీ వంతు.

**ఎంబీబీఎస్/బీడీఎస్‌తోపాటు వైద్యవిద్య సంబంధిత కోర్సుల్లో దేశవ్యాప్తంగా ఉన్న విద్యా సంస్థల్లో ప్రవేశాలకు జాతీయ స్థాయిలో నిర్వహించే పరీక్ష.. నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్టు..సంక్షిప్తంగా నీట్! తాజాగా నీట్ యూజీ-2020 దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. వైద్య విద్య అభ్యసించాలని కలలు కనేవారు మేలో నిర్వహించనున్న నీట్‌లో సత్తా చాటడం తప్పనిసరి. అదే సమయంలో మార్చిలో జరిగే ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్ష(ఐపీఈ)లను విజయవంతంగా రాయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో.. నీట్ ఔత్సాహికులకు ఉపయోగపడేలా ఐపీఈ, నీట్ సంయుక్త ప్రిపరేషన్ ప్రణాళిక...**

- మార్చిలో ఇంటర్ పరీక్షలు
- మే మొదటి వారంలో నీట్
- కొనసాగుతున్న నీట్ దరఖాస్తు ప్రక్రియ
- ఉమ్మడి ప్రిపరేషన్‌పై విద్యార్థుల దృష్టి
- అప్లికేషన్ దృక్పథంతోనే విజయం అంటున్న నిపుణులు




# నీట్+ ఐపీఈ

# పరీక్షలు రెండు... ప్రిపరేషన్ ఒక్కటే!

నీట్ ప్రిపరేషన్ పరంగా అభ్యర్థులు దీర్ఘకాలిక పటిష్ట ప్రణాళికను సిద్ధం చేసుకోవాలి. ఎందుకంటే... నీట్ సిలబస్ విస్తృతంగా ఉంటుంది. కాబట్టి సిలబస్‌ను టైమ్ టేబుల్‌కు అనుగుణంగా విభజించుకొని చదవాలి. నిర్దిష్ట సమయంలో సిలబస్‌ను పూర్తిచేసేలా ముందుకు కదలాలి. అభ్యర్థులకు స్వీయ సామర్థ్యాలపై స్పష్టత ఉండాలి. ఆ దిశగా వాస్తవిక దృక్పథంతో ప్రిపరేషన్‌ను కొనసాగించాలి. ప్రిపరేషన్ పరంగా రోజూ చిన్నచిన్న లక్ష్యాలను నిర్దేశించుకోవాలి. టాపిక్స్‌ను విభజించుకొని అధ్యయనం చేయాలి. ప్రతి సబ్జెక్టుకూ సమానంగా సమయం వెచ్చించాలి.

## సిలబస్‌కు అనుగుణంగా

అభ్యర్థులు ముందుగా నీట్ సిలబస్‌ను సమగ్రంగా అధ్యయనం చేయాలి. సిలబస్ గురించి పూర్తిగా తెలుసుకున్న తర్వాతే ప్రిపరేషన్‌కు ఉపక్రమించాలి. సిలబస్‌లో పేర్కొన్న వాటికి అదనంగా ఇతర అంశాలను చదవాల్సిన అవసరం లేదు. నీట్, బోర్డ్ సిలబస్‌లో కొన్ని కామన్ టాపిక్స్ ఉన్నాయి. ఆయా అంశాలను బోర్డు ఎగ్జామ్స్ కోణంలో ప్రిపేరవ్వాలి. దీనివల్ల సమయం ఆదా అవుతుంది. కేవలం నీట్ సిలబస్‌లోనే ఉన్న అంశాలకు ప్రత్యేక సమయం కేటాయించాలి.

## ప్రశ్నల వైరుధ్యం

ఇంటర్ బోర్డు ప్రశ్నలు, నీట్‌లో అడిగే ప్రశ్నల తీరులో తేడా ఉంటుంది. నీట్‌లో ప్రశ్నలను సూటిగా కాకుండా.. అభ్యర్థి అప్లికేషన్ దృక్పథాన్ని పరీక్షించేలా అడుగుతారు. కాబట్టి ప్రశ్నల తీరుపై అవగాహన పెంచుకునేందుకు నమూనా పరీక్షలను ఎక్కువగా ప్రాక్టీసు చేయాలి. తద్వారా మెరుగైన స్కోరు సాధించవచ్చు.

ఇంటర్ పరీక్షలకు నెల రోజుల ముందు వరకు నీట్ ప్రిపరేషన్‌ను సమాంతరంగా కొనసాగించొచ్చు. ఇంటర్ పరీక్షలకు ఒక నెల సమయం ఉందనగా.. నీట్ ప్రిపరేషన్ పూర్తిగా పక్కనబెట్టి బోర్డు పరీక్షలపై దృష్టిపెట్టాలి.

## నీట్ యూజీ 2020

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ)..నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్(నీట్)-2020కు ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రస్తుతం దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతోంది. దీని ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న అన్ని వైద్య కళాశాలల్లోని అండర్ గ్రాడ్యుయేట్(యూజీ) మెడికల్ కోర్సులు ఎంబీబీఎస్/ బీడీఎస్‌ల్లో ప్రవేశం లభిస్తుంది. దీంతోపాటు వైద్య సంబంధిత కోర్సులైన బీఏఎంఎస్/బీఎస్ఎంఎస్/బీయూఎంఎస్/బీహెచ్ఎంఎస్‌ల్లోనూ ప్రవేశాలు కల్పిస్తారు.

నీట్‌లో బయాలజీ(బోటనీ, జువాలజీ), ఫిజిక్స్, కెమిస్ట్రీల నుంచి మొత్తం 180 ప్రశ్నలు అడుగుతారు. సాధారణంగా బోటనీ, జువాలజీల నుంచి 45 చొప్పున.. అలాగే ఫిజిక్స్, కెమిస్ట్రీల నుంచి 45 చొప్పున ప్రశ్నలు ఉంటాయి. ఒక్కో ప్రశ్నకు 4 మార్కులు కేటాయించారు. అంటే.. నీట్ పరీక్ష 180 ప్రశ్నలకు గాను మొత్తం 720 మార్కులకు జరుగుతుంది. నెగెటివ్ మార్కింగ్ విధానం అమల్లో ఉంది. ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కు కోత విధిస్తారు.




- » **అర్హత:** 10+2/ఇంటర్మీడియెట్ బైపీసీ.
- » **వయసు:** 17-25 ఏళ్ల మధ్య ఉండాలి.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- » **దరఖాస్తులకు చివరితేది:** 31.12.2019
- » **దరఖాస్తు ఫీజు:** రూ.1500
- » **పరీక్ష తేది:** 03.05.2019
- » **వెబ్‌సైట్:** www.ntaneet.nic.in

## నీట్ సిలబస్... ముఖ్యాంశాలు

### ఫిజిక్స్

- ఫిజిక్స్‌లో ఎక్కువ మార్కులు స్కోర్ చేయాలంటే.. సాధన చాలా ముఖ్యం. ప్రాబ్లమ్స్‌ను ఒకటికి నాలుగుసార్లు సొల్యూషన్స్ చూడకుండా సొంతంగా ప్రాక్టీస్ చేయాలి. ప్రశ్నలను తరచూ ప్రాక్టీస్ చేయడం ద్వారా ఫిజిక్స్ కష్టమైన సబ్జెక్ట్ అనే భయం దూరమవుతుంది.
- ఆప్టిక్స్, మెకానిక్స్, హీట్ అండ్ థర్మోడైనమిక్స్, ఎలక్ట్రానిక్ డివైజెస్, కరెంట్ ఎలక్ట్రిసిటీ, మోడరన్ ఫిజిక్స్ చాప్టర్లపై ప్రత్యేక దృష్టిపెట్టాలి. ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల్లో అధ్యాయానికి చివర ఇచ్చిన ప్రశ్నలను సాధించాలి. అవకలనం, సమాకలనం అనువర్తనాలపై పట్టు సాధించాలి. నీట్‌లో ఇంటర్ రెండు సంవత్సరాల సిలబస్ నుంచి ప్రశ్నలు అడుగుతారు. కాబట్టి ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల పాఠ్యాంశాలకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలి. పైన పేర్కొన్న చాప్టర్లతోపాటు మిగిలిన పాఠ్యాంశాలను అధ్యయనం చేయాలి.

### కెమిస్ట్రీ

జనరల్ ఆర్గానిక్ కెమిస్ట్రీ, మోల్ కాన్సెప్ట్, కెమికల్ బాండింగ్, ఎలక్ట్రోకెమిస్ట్రీ, కోఆర్డినేషన్ కాంపౌండ్, ఈక్విలిబ్రియమ్, పాలిమర్‌లు, బయోమాలిక్యూల్స్, పరమాణు నిర్మాణం, సాలిడ్ స్టేట్, ద్రావణాలు, సర్ఫేజ్ కెమిస్ట్రీ తదితరాలను ముఖ్య పాఠ్యాంశాలుగా పేర్కొవచ్చు. ఆర్గానిక్ కెమిస్ట్రీలో.. ఐసోమెరిసమ్, సమ్మేళనాల తయారీ, ధర్మాలపై ఎక్కువగా ప్రశ్నలు వస్తున్నాయి. కెమిస్ట్రీలో విద్యార్థులు చర్యలు, సమీకరణాలు మర్చిపోతుంటారు. కాబట్టి వాటిని ఎప్పటికప్పుడు పునఃశ్చరణ చేయాలి. ఇనార్గానిక్ కెమిస్ట్రీలో వివిధ మూలకాలు, వాటి సమ్మేళనాల ధర్మాలను అధ్యయనం చేయాలి.

### బయాలజీ

- నీట్‌లో బయాలజీకి అధిక వెయిటేజీ ఉంటుంది. కాబట్టి ఇందులో సాధించే స్కోరు నీట్ ర్యాంకును నిర్దేశిస్తుందనడంలో సందేహం లేదు. బయాలజీలో ఫిజియాలజీ ఆఫ్ ప్లాంట్స్ అండ్ యానిమల్స్, మార్ఫాలజీ, జెనిటిక్స్ అండ్ ఎవల్యూషన్, సెల్ బయాలజీ, బయోటెక్నాలజీ, హ్యూమన్ ఫిజియాలజీ, డైవర్సిటీ ఆఫ్ లివింగ్ ఆర్గానిజమ్‌లను ముఖ్య చాప్టర్లుగా పేర్కొనవచ్చు.
- నీట్ గత ప్రశ్నపత్రాలను పరిశీలిస్తే.. హ్యూమన్ ఫిజియాలజీ, ఎకాలజీ, ప్లాంట్ ఫిజియాలజీ, సెల్ స్ట్రక్చర్ అండ్ ఫంక్షన్స్, రీప్రొడక్షన్, మాలిక్యులర్ బేసిస్ ఆఫ్ ఇన్‌హెరిటన్స్ యూనిట్ల నుంచి ఎక్కువగా ప్రశ్నలు అడిగినట్లు తెలుస్తుంది. అభ్యర్థులు ప్రిపరేషన్ పరంగా ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకంలోని పటాలపై దృష్టి పెట్టాలి. ఆర్గాన్స్ ఫిజియాలజీకి సంబంధించి తార్కిక ప్రశ్నలు వస్తున్నాయి. కాబట్టి కాన్సెప్టులపై పట్టు సాధించాలి. ఎకాలజీలో ఆర్గనైజేషన్స్ అండ్ పాప్యులేషన్, ఎకోసిస్టమ్‌ల నుంచి ప్రశ్నలు అడుగుతున్నారు. వీటితోపాటు బయోడైవర్సిటీ, ఎన్విరాన్‌మెంట్ ఇష్యూస్ పాఠ్యాంశాలను అధ్యయనం చేయాలి.
- ప్లాంట్ ఫిజియాలజీలో ప్లాంట్ గ్రోత్ అండ్ డెవలప్‌మెంట్, మొక్కల హార్మోన్లు, ట్రాన్స్‌పోర్ట్ ఇన్ ప్లాంట్స్, మినరల్ న్యూట్రిషన్ చాప్టర్లను ప్రిపేరవ్వాలి. సెల్ స్ట్రక్చర్ అండ్ ఫంక్షన్స్‌లో కణవిభజన(సమ విభజన, క్షయకరణ విభజన)లోని వివిధ దశల్లో జరిగే మార్పులు, కణ చక్రం తదితరాలను చదవాలి. బయోమాలిక్యూల్స్ నుంచి కంటెంట్ సంబంధిత ప్రశ్నలు వస్తాయి. రీప్రొడక్షన్ నుంచి దాదాపు 10 ప్రశ్నల వరకు అడుగుతున్నారు. మానవ ప్రత్యుత్పత్తి వ్యవస్థను బాగా అధ్యయనం చేయాలి. మాలిక్యులర్ బేసిస్ ఆఫ్ ఇన్‌హెరిటన్స్‌లో.. రెప్లికేషన్, ట్రాన్స్‌స్క్రిప్షన్, ట్రాన్స్‌లేషన్, రెగ్యులేషన్‌లపై దృష్టిపెట్టాలి.

## ప్రాక్టీస్‌తోనే టాప్ స్కోర్

నీట్ ప్రిపరేషన్ పరంగా పాఠ్యాంశాలను చదవడం ఎంత ముఖ్యమో.. నిరంతరం ప్రాక్టీస్ చేయడం కూడా అంతే ప్రధానం అని గుర్తించాలి. సరైన ప్రాక్టీస్ లేకుంటే.. చదివిన అంశాలు సైతం మర్చిపోయే ఆస్కారం ఉంటుంది. కాబట్టి ప్రాక్టీస్‌కు సంబంధించి కింది పద్ధతులను అనుసరించాలి. పాత నీట్ ప్రశ్నపత్రాలను సాధన చేయాలి. ప్రశ్నపత్రాల సాధనలో చేస్తున్న తప్పులను గుర్తించి విశ్లేషించుకోవాలి. కష్టసాధ్యంగా అనిపించే ప్రశ్నలను గుర్తించి.. వాటిని రివిజన్ సమయంలో తప్పనిసరిగా ప్రాక్టీస్ చేయాలి. సులభంగా ఉన్న ప్రశ్నలను సైతం రివిజన్ చేయాలి.

### ప్రామాణిక మెటీరియల్

నీట్‌కు ప్రిపేరయ్యే అభ్యర్థులు ప్రామాణిక మెటీరియల్ లేదా బుక్స్‌ను అనుసరించాలి. ఈ దిశగా ఫ్యాకల్టీ, నిపుణులు, సీనియర్లను సంప్రదించాలి. నీట్ పరీక్ష పూర్తిగా ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్ చుట్టూ తిరుగుతుంది. కాబట్టి ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలను చదవడం తప్పనిసరి. పుస్తకాల్లో ముఖ్యమైన అంశాలను గుర్తించాలి. వాటిని రివిజన్ సమయంలో ప్రత్యేకంగా చదవాలి. ప్రాక్టీస్ చేసేటప్పుడే ముఖ్య ప్రశ్నలను గుర్తించాలి.

### ఊహలొద్దు

నీట్ విజయంలో కచ్చితత్వం కీలకంగా నిలుస్తుంది. కాబట్టి తెలియని ప్రశ్నలకు సమాధానాలను ఊహించి రాసేందుకు ప్రయత్నించొద్దు. పరీక్షలో నెగెటివ్ మార్కింగ్ విధానం అమల్లో ఉంది. కాబట్టి ఊహించిన సమాధానం తప్పయితే ఒక మార్కు కోల్పోతారు. దానికంటే సదరు ప్రశ్నను ప్రయత్నించకపోవడమే ఉత్తమం.

### షార్ట్ నోట్స్

ప్రిపరేషన్ సమయంలో షార్ట్ నోట్స్ రూపొందించుకోవాలి. దీనివల్ల సమయం ఆదా అవడంతోపాటు ముఖ్య అంశాలపై ఏకాగ్రత నిలిపేందుకు అవకాశం లభిస్తుంది. నీట్ బయాలజీ ప్రిపరేషన్‌కు సంబంధించి ఫ్లోచార్ట్‌లు, డయాగ్రమ్స్, షార్ట్ కట్స్‌ను ఉపయోగించాలి.

### మాక్ టెస్టులు




మాక్ టెస్టులకు హాజరవ్వాలి. ఇలా చేయడం వల్ల ఆత్మవిశ్వాసం పెరగడంతోపాటు పరీక్ష పరంగా స్వీయ సామర్థ్యాలను ఎప్పటికప్పుడు అంచనా వేయొచ్చు. మాక్‌టెస్టుల్లో చూపిన ప్రతిభ ఆధారంగా ప్రిపరేషన్ వ్యూహాలను మార్చుకోవాలి. బలహీనంగా ఉన్న అంశాలపై ప్రత్యేక దృష్టిపెట్టాలి. పరీక్షకు నెల రోజుల సమయం ఉందనగా కొత్త చాప్టర్లు, అంశాల జోలికి పోకూడదు. ఆ సమయంలో చదివిన అంశాలనే రివిజన్ చేస్తుండాలి.

### ఆరోగ్యమే మహాభాగ్యం

పరీక్షకు ప్రిపేరయ్యే అభ్యర్థులు శారీరక, మానసిక ఆరోగ్యాలపై దృష్టిపెట్టాలి. మంచి సమతుల ఆహారం తీసుకోవాలి. జంక్ ఫుడ్‌కి దూరంగా ఉండాలి. రోజూ వ్యాయామం చేయాలి. ఆరు నుంచి ఏడు గంటల పాటు తప్పనిసరిగా నిద్రపోవాలి. ప్రిపరేషన్ పరంగా సానుకూల దృక్పథం ప్రదర్శించాలి. తద్వారా సానుకూల ఫలితాలను పొందేందుకు అవకాశం ఉంటుంది. ఆత్మవిశ్వాసాన్ని అతి విశ్వాసంగా మారకుండా చూసుకోవాలి. కష్టపడి చదివితే విజయం దానంతట అదే వస్తుందని గుర్తించాలి.

## ప్రవేశాలు

### ఎయిమ్స్ (ఎంఎస్సీ) 2020 ప్రవేశాలు

న్యూఢిల్లీలోని ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్).. వివిధ ఎంఎస్సీ కోర్సుల్లో ప్రవేశాలకై ఎయిమ్స్ (ఎంఎస్సీ)-2020 నోటిఫికేషన్ విడుదల చేసింది.

- **కోర్సులు:** ఎంఎస్సీ (నర్సింగ్, బయోటెక్నాలజీ) కోర్సులు.
- **అర్హత:** సంబంధిత విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఎంపిక:** ప్రవేశ పరీక్ష ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **ముఖ్య తేదీలు:**
- **రిజిస్ట్రేషన్‌కు చివరితేదీ:** జనవరి 16, 2020.
- **దరఖాస్తుకు చివరితేదీ:** మే 8, 2020.
- **పరీక్ష తేదీలు:** ఎంఎస్సీ నర్సింగ్: జూన్ 6, 2020; ఎంఎస్సీ కోర్సులు: జులై 4, 2020; ఎంఎస్సీ (బయోటెక్నాలజీ): జులై 4, 2020.
- **వెబ్‌సైట్:** www.aiimsexams.org




# రాజకీయ చాణక్య

**అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం మనది. ప్రజాస్వామ్యంలో ఎన్నికల కంటే పెద్ద పండగ ఉండదు. ఎన్నికలొచ్చాయంటే చాలు.. రాజకీయ నాయకులు, పార్టీలు గెలుపుకోసం వేసే ఎత్తులు అన్నీఇన్నీ కావు. ఎప్పటికప్పుడు సమీకరణాలు మార్చుకుంటూ.. ఎత్తుకు పైఎత్తులేస్తూ గెలుపే లక్ష్యంగా పావులు కదుపుతుంటారు. ప్రజానాడిని అంచనా వేయడానికి, ఓటర్లకు చేరువ కావడానికి, హామీల రూపకల్పనకు, ప్రత్యర్థుల ఎత్తులను చిత్తు చేయడానికి పార్టీలు ఇటీవల కాలంలో 'పొలిటికల్ కన్సల్టెంట్ల'ను సంప్రదించడం ఎక్కువైంది. పొలిటికల్ కన్సల్టెన్సీల్లో యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతున్న నేపథ్యంలో... తాజా ట్రెండ్స్, అవసరమైన నైపుణ్యాలు, అర్హతలు, పనితీరు గురించి తెలుసుకుందాం...**

### గెలుపు బాధ్యత

బూత్ స్థాయిల్లో పార్టీ లేదా అభ్యర్థి బలాలు, బలహీనతలు.. స్థానిక పరిస్థితులు.. కుల, రాజకీయ సమీకరణాలు.. స్థానిక సమస్యలు, స్థానికుల అవసరాలు.. హామీలు, ప్రచార సరళి, క్షేత్ర స్థాయి అమలు.. ప్రత్యర్థుల బలాలు, బలహీనతలు.. ప్రత్యర్థుల హామీలు వంటి అంశాలన్నింటినీ ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ క్షేత్రస్థాయిలో ఈ పనులన్నింటినీ చక్కబెడుతుంటారు పొలిటికల్ కన్సల్టెంట్లు. ప్రధాని మొదలు శాసన సభకు పోటీ చేసే అభ్యర్థి వరకూ... ఎక్కువ శాతం మంది రాజకీయ నేతలు తమ గెలుపు బాధ్యతలను రాజకీయ కన్సల్టెంట్ల చేతుల్లో పెడుతున్నారు. గత కొంత కాలంగా ఈ ఒరవడి బాగా పెరిగింది.

### దిశా నిర్దేశం

అది 2017 పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలు. ఓ ప్రముఖ కార్పొరేట్ సంస్థలో వైస్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఒక కొత్త అభ్యర్థి పేరు తెరమీదకొచ్చింది. అప్పటి వరకు అతని పేరు పొలిటికల్ సర్కిల్స్‌లో ఎక్కడా వినిపించలేదు. ఎన్నికల్లో పోటీ చేయాలని ప్రముఖ జాతీయ పార్టీ నుంచి బీ ఫారం సైతం అందింది. అతనే అమిత్ విజ్. ఇతని ప్రత్యర్థి మరో జాతీయ పార్టీ నుంచి బంపర్ (19 శాతం ఓట్లు) మెజారిటీతో గెలిచిన సిట్టింగ్ ఎమ్మెల్యే. అతన్ని ఎన్నికల్లో ఢీ కొట్టాలంటే అమిత్‌తో అయ్యే పనేనా! అంటూ.. నియోజకవర్గ ప్రజలు, సొంత పార్టీ నేతలు గుసగుసలాడుకుంటున్నారు. ప్రజలకు పరిచయం లేని వ్యక్తి కావడంతో పార్టీ శ్రేణుల్లో సైతం సంశయం కనిపిస్తోంది. కానీ కార్పొరేట్ మేనేజ్‌మెంట్‌లో దిట్ట అయిన అమిత్.. పొలిటికల్ కన్సల్టెంట్‌కు తన గెలుపు బాధ్యతలు అప్పజెప్పారు. రంగంలోకి దిగిన సదరు వ్యూహకర్తలు అహర్నిశలు శ్రమించి క్షేత్రస్థాయి పరిస్థితులపై అమిత్‌కు ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేశారు. సదరు సలహాలు, సూచనలను తూచ తప్పకుండా అమలు చేసిన అమిత్.. ఎన్నికల్లో విజయకేతనం ఎగురవేశారు. ఇలా అమిత్ ఒక్కడే కాదు.. ప్రస్తుతం దేశంలో ఎంతో మంది నేతల విజయంలో కన్సల్టెంట్‌లు కీలక పాత్ర పోషిస్తున్నారు.




- » పొలిటికల్ కన్సల్టెంట్‌లకు పెరుగుతున్న డిమాండ్
- » రాజకీయ పార్టీల గెలుపోటములను ప్రభావితం చేస్తున్న వైనం
- » యువతకు పెరుగుతున్న ఉపాధి అవకాశాలు

### టాప్ కాలేజీల పట్టభద్రులే

దేశంలో వివిధ పార్టీలకు, రాజకీయ నాయకులకు బ్రాండింగ్ తెస్తూ.. రాజకీయ చాణక్యులుగా చక్రం తిప్పుతున్నారు ఈ ప్రొఫెషనల్ రాజకీయ వ్యూహకర్తలు. ప్రస్తుతం దేశంలో ఉన్న పొలిటికల్ కన్సల్టెన్సీల్లో పనిచేస్తున్న వారి నేపథ్యం చూస్తే.. ఐఐటీలు, ఐఐఎంలు, ఇతర ప్రముఖ విద్యాసంస్థల నుంచి పట్టభద్రులైన వారే ఎక్కువగా ఉండటం విశేషం. ప్రముఖ వ్యూహకర్తల బృందాల్లో పనిచేస్తున్న వారి ప్రొఫైల్స్ ఇందుకు నిదర్శనం. వీరు క్షేత్రస్థాయిలో ఓటరు నాడి పసిగట్టి, ఓట్లను పొందేందుకు వ్యూహాలు రచిస్తూ దూసుకుపోతున్నారు.

### పార్టీలకందించే సేవలు

- నియోజకవర్గంలో ఏ అభ్యర్థికి పార్టీ టిక్కెట్ ఖాయం చేయాలో వ్యూహకర్త సూచిస్తారు. అందుకోసం గ్రామ, వార్డు స్థాయిల్లో పరిశీలించి పార్టీ కార్యకర్తలు, ప్రజలు మెచ్చే నాయకుడి వివరాలను ఫీడ్‌బ్యాక్ రూపంలో పార్టీకి అందిస్తారు.
- కులం, వయసు, ఆర్థిక స్థితిగతులు, చదువు తదితర అంశాల వారీగా శాస్త్రీయ పద్ధతిలో ఒపీనియన్ పోల్స్ నిర్వహించి.. వివరాలను అధిష్టానానికి తెలియజేస్తారు.
- నియోజకవర్గంలో తిష్టవేసిన సమస్యలపై ఎప్పటికప్పుడు నివేదికలు రూపొందిస్తారు.
- అవసరాల మేరకు పార్టీ/సదరు నాయకుడు కోరే సమాచారాన్ని అందుబాటులో ఉంచుతారు.

### అభ్యర్థికి తోడు నీడగా

- వ్యూహకర్తలు.. సదరు అభ్యర్థి పోటీ చేస్తున్న నియోజకవర్గంలో సమగ్రంగా అధ్యయనం చేస్తారు. కులం, మతం, చదువు, స్థితిగతులు, సమస్యలు తదితర అంశాలపై లక్షిత ఓటర్ల అభిప్రాయాలు సేకరిస్తారు. ఒపీనియన్ పోల్స్ కూడా చేపడతారు. పార్టీ నెట్‌వర్క్, కుల సమీకరణాలు, వ్యక్తిగత ప్రతిష్ట, పార్టీ ప్రతిష్ట, ముఖ్యమైన సమస్యలు, వివిధ వర్గాల్లో సంతృప్తి, అసంతృప్తి స్థాయిలను పరిశీలించి నివేదికలు సమర్పిస్తారు.
- నియోజకవర్గంలో భిన్నవర్గాల ఓటర్లను ఆకర్షించడానికి వేర్వేరు వ్యూహాలు, హామీలు ఇచ్చే విధంగా నాయకులకు సమాచారం ఇస్తారు. ఫలితంగా కనీసం 2 నుంచి 3 శాతం ఓట్లు అదనంగా పొందొచ్చని వ్యూహకర్తలు చెబుతున్నారు.

### డేటాతో దిశానిర్దేశం

పొలిటికల్ వ్యూహకర్తలు ప్రధానంగా డేటాను విశ్లేషించి తమ పార్టీకి, అభ్యర్థికి లబ్ధి చేకూర్చే చర్యలు చేపడతారు. స్థానిక డేటా ఆధారంగా ప్రచారాలు నిర్వహించడం, స్టార్ ప్రచారకర్తలను రంగంలోకి దించడం వంటివి చేస్తారు. స్థానికంగా జనాలకు చేరువయ్యేందుకు అనుసరించాల్సిన వ్యూహాలను రచిస్తారు. జనాల్లోకి పార్టీని బలంగా తీసుకుపోయేలా, నిత్యం ప్రజల నోళ్లలో మెదిలేలా.. ప్రచారాలు, స్లోగన్లు రూపొందిస్తారు. అందుకోసం సోషల్ మీడియాను ఎక్కువగా వినియోగిస్తారు. గత ఎన్నికలను పరిశీలించి.. ఆయా నియోజక వర్గాల్లో ఓటర్ల నాడి ఎలా మారుతూ వస్తోంది.. బూత్ వారీగా ఓట్ల సరళి ఎలా ఉంది.. ప్రభావితం చేస్తున్న అంశాలేమిటి.. ఏ వర్గాల వారికి ఎలాంటి హామీలు ఇస్తే గట్టెక్కవచ్చు.. స్థానిక నాయకత్వంపై నమ్మకం కుదిరేలా ఎలాంటి చర్యలు చేపట్టాలి.. వంటి ఎన్నో డేటా ప్యాట్రన్స్‌ను అర్థం చేసుకొని విశ్లేషిస్తూ పార్టీకి, అభ్యర్థులకు దిశానిర్దేశం చేస్తారు.

### ఈ అర్హతలు తప్పనిసరి

పొలిటికల్ కన్సల్టెన్సీల్లో రకరకాల బృందాలు ఉంటాయి. వీటిల్లో క్యాంపెయినర్ మేనేజర్, కోర్ స్ట్రాటజిస్ట్, టీం మెంబర్, టీం మేనేజర్, మీడియా లీడ్స్ తదితర ఉద్యోగాలుంటాయి. వీరు ప్రధానంగా క్షేత్రస్థాయిలో విధుల నిర్వహణకు సిద్ధంగా ఉండాలి. పార్టీ నాయకత్వంతో, అభ్యర్థులతో, పార్టీ కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాల్సి ఉంటుంది. డిజిటల్ మీడియా, డేటాఅనలిటిక్స్, స్ట్రాటజిక్ రీసెర్చ్ విభాగంలో పని చేయాలి. భిన్న నేపథ్యం, సంస్కృతుల వారితో కలిసి పని చేసే తత్వం ఉండాలి. కనీసం డిగ్రీ లేదా పీజీ విద్యార్హత ఉండాలి. రాజకీయ వ్యవహారాలు, ప్రభుత్వం, పరిపాలన అంశాలపై లోతైన అవగాహన తప్పనిసరి. స్థానిక భాషతోపాటు హిందీ, ఇంగ్లిష్ నైపుణ్యాలు, ఎంఎస్ ఆఫీస్ టూల్స్‌పై ప్రావీణ్యం, చక్కటి రైటింగ్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్ ఉండాలి. వ్యూహకర్తలకు పార్టీలు భారీ మొత్తంలోనే అందిస్తుంటాయి. పని అనుభవం, చదివిన కాలేజీ ఆధారంగా ఆయా వ్యూహకర్త బృందంలో పనిచేసే వారికి ఆకర్షణీయ వేతనాలు లభిస్తున్నాయి. కొంత అనుభవం గడించాక సొంతంగా కన్సల్టెన్సీ ఏర్పాటు చేసుకోవచ్చు.

## స్కోరు వివరాలు

**భారత్ ఇన్నింగ్స్:** రోహిత్ (సి) హోప్ (బి) కాట్రెల్ 159; రాహుల్ (సి) ఛేజ్ (బి) జోసెఫ్ 102; కోహ్లి (సి) ఛేజ్ (బి) పొలార్డ్ 0; అయ్యర్ (సి) హోప్ (బి) కాట్రెల్ 53; పంత్ (సి) పూరన్ (బి) పాల్ 39; జాదవ్ (నాటౌట్) 16; జడేజా (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 18; **మొత్తం (50 ఓవర్లలో 5 వికెట్లకు) 387. వికెట్ల పతనం:** 1-227; 2-232; 3-292; 4-365; 5-373. **బౌలింగ్:** కాట్రెల్ 9-0-83-2; హోల్డర్ 9-0-45-0; పైర్ 9-0-62-0; కీమో పాల్ 7-0-57-1; జోసెఫ్ 9-1-68-1; ఛేజ్ 5-0-48-0; పొలార్డ్ 2-0-20-1.

**వెస్టిండీస్ ఇన్నింగ్స్:** లూయిస్ (సి) అయ్యర్ (బి) శార్దుల్ ఠాకూర్ 30; షై హోప్ (సి) కోహ్లి (బి) కుల్దీప్ 78; హెట్‌మైర్ (రనౌట్) 4; ఛేజ్ (బి) జడేజా 4; పూరన్ (సి) కుల్దీప్ (బి) షమీ 75; పొలార్డ్ (సి) పంత్ (బి) షమీ 0; హోల్డర్ (స్టంప్డ్) పంత్ (బి) కుల్దీప్ 11; కీమో పాల్ (బి) షమీ 46; జోసెఫ్ (సి) జాదవ్ (బి) కుల్దీప్ 0; పైర్ (సి) కోహ్లి (బి) జడేజా 21; కాట్రెల్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (43.3 ఓవర్లలో ఆలౌట్) 280. వికెట్ల పతనం:** 1-61; 2-73; 3-86; 4-192; 5-192; 6-210; 7-210; 8-210; 9-260; 10-280. **బౌలింగ్:** చాహర్ 7-1-44-0; శార్దుల్ ఠాకూర్ 8-0-55-1; షమీ 7.3-0-39-3; జడేజా 10-0-74-2; కుల్దీప్ యాదవ్ 10-0-52-3; అయ్యర్ 1-0-13-0.

# విశాఖలో విధ్వంసం


రోహిత్


రాహుల్

### రోహిత్ శర్మ, రాహుల్ సెంచరీలు ● చెలరేగిన అయ్యర్, పంత్
### కుల్దీప్ హ్యాట్రిక్ ● రెండో వన్డేలో భారత్ ఘన విజయం
### 107 పరుగులతో విండీస్ చిత్తు ● చివరి వన్డే ఆదివారం

సాగర తీరం పరుగుల సునామీతో హోరెత్తింది. ఫోర్లు, సిక్సర్లతో విశాఖపట్నం పోటెత్తింది. బ్యాట్‌కు తగలడమే తరువాయి బంతులు వేగంగా బౌండరీలు దాటాయి. చెన్నైలో దెబ్బ తిన్న తర్వాత టీమిండియా తగిన రీతిలో జవాబిచ్చింది. ముందుగా రోహిత్, రాహుల్ అద్భుత సెంచరీలకు అయ్యర్, పంత్ దూకుడైన బ్యాటింగ్ తోడు కావడంతో భారత్ భారీ స్కోరుతో ప్రత్యర్థికి సవాల్ విసిరింది. ఆ తర్వాత మిగతా పనిని మన బౌలర్లు పూర్తి చేశారు. హోప్, పూరన్ పోరాడినా భారీ లక్ష్యాన్ని ఛేదించడం విండీస్‌కు శక్తికి మించిన పనే అయింది. 'చైనామన్ బౌలర్' కుల్దీప్ యాదవ్ కూడా తన రెండో వన్డే హ్యాట్రిక్‌తో మెరవడంతో భారత్ గెలుపు సులువైంది. మొత్తంగా వైజాగ్ వన్డే ఏకంగా 667 పరుగులు, 29 సిక్సర్లతో ప్రేక్షకులకు వినోదం పంచగా... సిరీస్‌ను సమం చేసిన కోహ్లి సేన ఆదివారం కటక్‌లో జరిగే చివరి పోరుకు 'సై' అంటూ సిద్ధమైంది.

**సాక్షి, విశాఖపట్నం:** వన్డే సిరీస్‌లో తొలి మ్యాచ్ ఓటమి నుంచి భారత్ వెంటనే కోలుకుంది. బుధవారం ఇక్కడి డాక్టర్ వైఎస్ఆర్ ఏసీఏ–వీడీసీఏ క్రికెట్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో భారత్ 107 పరుగుల తేడాతో వెస్టిండీస్‌పై ఘన విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 387 పరుగులు చేసింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' రోహిత్ శర్మ (138 బంతుల్లో 159; 17 ఫోర్లు, 5 సిక్సర్లు), లోకేశ్ రాహుల్ (104 బంతుల్లో 102; 8 ఫోర్లు, 3 సిక్సర్లు) సెంచరీలతో కదం తొక్కారు. వీరిద్దరు తొలి వికెట్‌కు 227 పరుగులు జోడించడం విశేషం. శ్రేయస్ అయ్యర్ (32 బంతుల్లో 53; 3 ఫోర్లు, 4 సిక్సర్లు), రిషభ్ పంత్ (16 బంతుల్లో 39; 3 ఫోర్లు, 4 సిక్సర్లు) కూడా భారీ స్కోరులో కీలక పాత్ర పోషించారు. అనంతరం విండీస్ 43.3 ఓవర్లలో 280 పరుగులకు ఆలౌటైంది. షై హోప్ (85 బంతుల్లో 78; 7 ఫోర్లు, 3 సిక్సర్లు), నికోలస్ పూరన్ (47 బంతుల్లో 75; 6 ఫోర్లు, 6 సిక్సర్లు) అర్ధ సెంచరీలు చేయగా, కీమో పాల్ (42 బంతుల్లో 46; 4 ఫోర్లు, 3 సిక్సర్లు) రాణించాడు. షమీ, కుల్దీప్ యాదవ్ చెరో 3 వికెట్లు తీశారు. తాజా ఫలితంతో మూడు వన్డేల సిరీస్‌లో ఇరు జట్లు 1–1తో సమంగా నిలిచాయి. చివరిదైన మూడో వన్డే మ్యాచ్ ఆదివారం కటక్‌లో జరుగుతుంది.

### భారీ భాగస్వామ్యం...

ఇన్నింగ్స్ ఆరంభంలో సహచరుడు రోహిత్‌కంటే రాహుల్ ధాటిగా ఆడాడు. కాట్రెల్ ఓవర్లో రెండు ఫోర్లు కొట్టిన అతను హోల్డర్ వేసిన తర్వాతి ఓవర్లో సిక్సర్‌తో దూకుడు పెంచాడు. తొలి 10 ఓవర్లు ముగిసేసరికి భారత్ స్కోరు 55 పరుగులకు చేరింది. కొద్ది సేపటికి 46 బంతుల్లో ముందుగా రాహుల్ అర్ధ సెంచరీ పూర్తి చేసుకోగా, ఆ తర్వాత 67 బంతుల్లో రోహిత్ హాఫ్ సెంచరీ మార్క్‌ను చేరుకున్నాడు. ఆ తర్వాతా వీరిద్దరు తమ జోరును కొనసాగించారు. భారత ఓపెనర్లు చక్కటి స్ట్రోక్‌లతో ఆకట్టుకోగా... వీరిని నిలువరించడంలో విండీస్ బౌలర్లు విఫలమయ్యారు. 32 ఓవర్లు ముగిసేసరికి కూడా రాహుల్‌కంటే వెనుకబడిన రోహిత్ తర్వాతి ఓవర్లో చెలరేగి తన సహచరుడిని దాటేశాడు. ఖారీ పైర్ వేసిన ఈ ఓవర్లో ఫోర్, సిక్సర్ బాది శతకానికి చేరువయ్యాడు. హోల్డర్ వేసిన తర్వాతి ఓవర్లో లాంగాన్ దిశగా సింగిల్ తీసి రోహిత్ 107 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. వన్డేల్లో ఈ ఏడాది రోహిత్‌కిది 7వ సెంచరీకాగా... కెరీర్‌లో 28వ సెంచరీ. తొలి వికెట్‌కు 200 పరుగుల భాగస్వామ్యం దాటాక... జోసెఫ్ బౌలింగ్‌లో ఫైన్‌లెగ్ దిశగా ఫోర్ కొట్టడంతో రాహుల్ కూడా సెంచరీని అందుకున్నాడు. అయితే అదే ఓవర్ చివరి బంతికి థర్డ్‌మ్యాన్ వద్ద క్యాచ్ ఇచ్చి రాహుల్ వెనుదిరగడంతో విండీస్ ఊపిరి పీల్చుకుంది. అయితే మరో ఎండ్‌లో రోహిత్ మాత్రం తగ్గ లేదు. సెంచరీ తర్వాత తాను ఎదుర్కొన్న 30 బంతుల్లోనే అతను 59 పరుగులు రాబట్టాడు. హోల్డర్ బౌలింగ్‌లో సిక్సర్‌తో 150కు చేరుకున్నాడు. మరో డబుల్ సెంచరీకి సన్నద్ధమైనట్లు కనిపించిన రోహిత్‌ను కాట్రెల్ అవుట్ చేశాడు. అప్పటికే అలసిన రోహిత్ కీపర్‌కు తేలికైన క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు.

### ఇద్దరు మినహా...

దాదాపు అసాధ్యంగా కనిపించిన లక్ష్య ఛేదనలో విండీస్‌కు ఓపెనర్లు హోప్, లూయిస్ (35 బంతుల్లో 30; 5 ఫోర్లు) సరైన ఆరంభాన్ని అందించారు. రాహుల్ క్యాచ్ వదిలేయడంతో బతికిపోయిన హోప్ దానిని సద్వినియోగం చేసుకున్నాడు. చకచకా పరుగులు సాధించిన వీరిద్దరు తొలి పవర్‌ప్లే ముగిసే సరికి స్కోరును 56 పరుగులకు చేర్చారు. అయితే లూయిస్‌ను అవుట్ చేసి శార్దుల్ దెబ్బ తీయగా, జట్టు నంబర్‌వన్ బ్యాట్స్‌మన్ హెట్‌మైర్ (4) లేని మూడో పరుగు కోసం ప్రయత్నించి రనౌట్ కావడం విండీస్‌ను బాగా దెబ్బ తీసింది. అయ్యర్ అద్భుత ఫీల్డింగ్ అందుకు కారణమైంది. పాయింట్ నుంచి బౌండరీ వరకు పరుగెత్తి బంతిని ఆపిన అయ్యర్...ఆ తర్వాత అదే జోరులో నాన్‌స్ట్రైకింగ్ ఎండ్ వైపు విసరడం, జడేజా స్టంప్స్‌ను పడగొట్టడం వెంటనే జరిగిపోయాయి. ఛేజ్ (4) విఫలం కాగా... హోప్, పూరన్ కలిసి ఆదుకునే ప్రయత్నం చేశారు. ముఖ్యంగా పూరన్ భారీ షాట్లతో చెలరేగిపోయాడు. జడేజా ఓవర్లో అతను కొట్టిన రెండు సిక్సర్లు హైలైట్‌గా నిలిచాయి. జడేజా తర్వాతి ఓవర్లో మరింత చెలరేగిపోయిన పూరన్... రెండు సిక్సర్లు, ఫోర్ బాదాడు. షమీ, కుల్దీప్ వరుస ఓవర్లలోనూ అతను మళ్లీ సిక్స్, ఫోర్ కొట్టాడు. ఎట్టకేలకు షమీ బౌలింగ్‌లో మరో భారీ షాట్‌కు ప్రయత్నించి పూరన్ వెనుదిరగడంతో 106 పరుగుల నాలుగో వికెట్ భాగస్వామ్యం ముగిసింది. తర్వాతి బంతికే పొలార్డ్ (0) అవుటవ్వడంతో విండీస్ గెలుపు ఆశలు కోల్పోయింది. అనంతరం కుల్దీప్ 'హ్యాట్రిక్'తో ఆ జట్టు పూర్తిగా కుప్పకూలింది.

విండీస్ మాజీ క్రికెటర్ బాసిల్ బుచర్ మృతికి సంతాపంగా మ్యాచ్ ప్రారంభానికి ముందు రెండు జట్ల ఆటగాళ్లు మౌనం పాటించారు.

అంతకుముందు భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన ఆంధ్రకు చెందిన మాజీ క్రికెటర్ వై. వేణుగోపాల రావు పేరిట నెలకొల్పిన కొత్త గేట్‌ను ప్రారంభించారు.

సెంచరీ పూర్తి చేశాక రాహుల్ రెండు చేతులతో చెవులను మూసుకోవడం ఆసక్తి కలిగించింది. అలా ఎందుకు చేశావు అని ఇన్నింగ్స్ విరామంలో వ్యాఖ్యాత బిషప్ ప్రశ్నించగా అది 'మిస్టరీ'గానే ఉండనిద్దాం అని రాహుల్ సరదాగా జవాబు ఇచ్చాడు.

విండీస్ ఇన్నింగ్స్ సమయంలో ఓ యువ అభిమాని మైదానంలోకి దూసుకొచ్చి రోహిత్ శర్మకు పాదాభివందనం చేశాడు.




అయ్యర్ పంత్

### ఒకే ఓవర్లో 31 పరుగులు

రోహిత్‌ను అవుట్ చేసిన ఆనందం వెస్టిండీస్‌కు మిగలకుండా యువ ఆటగాళ్లు అయ్యర్, పంత్ చెలరేగిపోయారు. వీరిద్దరు భారీ సిక్సర్లు, ఫోర్లతో విరుచుకుపడి కేవలం 25 బంతుల్లోనే 73 పరుగులు జోడించడం విశేషం. జోసెఫ్ ఓవర్లో రెండు సిక్సర్లు బాదిన పంత్...కాట్రెల్ వేసిన 46వ ఓవర్లో పండగ చేసుకున్నాడు. ఈ ఓవర్లో అతను వరుసగా 6, 0, 4, 6, 4, 4 కొట్టాడు. దాంతో ఈ ఓవర్లో 24 పరుగులు వచ్చాయి. ఛేజ్ వేసిన మరుసటి ఓవర్లో అయ్యర్ వంతు వచ్చింది. ఈ ఓవర్ తొలి బంతి పంత్ సింగిల్ తీయగా, తర్వాతి ఐదు బంతుల్లో అయ్యర్ వరుసగా 6, 6, 4, 6, 6 కొట్టాడు. ఈ ఓవర్లో భారత్ ఖాతాలో 31 పరుగులు చేరాయి. భారత వన్డే చరిత్రలో ఒకే ఓవర్లో ఇన్ని పరుగులు రావడం ఇదే మొదటిసారి కావడం విశేషం. ఈ రెండు ఓవర్లలో కలిపి 55 పరుగులు రాబట్టిన భారత్... చివరి 3 ఓవర్లలో 24 పరుగులు రాబట్టింది. ఇందులో జాదవ్ 3 ఫోర్ల సహాయంతో చేసిన 16 పరుగులు ఉన్నాయి.



### కుల్దీప్ రెండో హ్యాట్రిక్

వన్డేల్లో రెండోసారి హ్యాట్రిక్ నమోదు చేసిన తొలి భారత బౌలర్‌గా కుల్దీప్ యాదవ్ నిలిచాడు. ఈ మ్యాచ్‌లోని 33వ ఓవర్లో కుల్దీప్ వరుస బంతుల్లో హోప్, హోల్డర్, జోసెఫ్‌లను అవుట్ చేశాడు. ఇంతకుముందు 2017లో ఆస్ట్రేలియాపై కోల్‌కతాలో కుల్దీప్ హ్యాట్రిక్ సాధించాడు. ఇంతకుముందు భారత్ తరపున వన్డేల్లో చేతన్ శర్మ (1987లో నాగ్‌పూర్‌లో న్యూజిలాండ్‌పై), కపిల్ దేవ్ (1991లో కోల్‌కతాలో శ్రీలంకపై), మొహమ్మద్ షమీ (2019లో అఫ్గానిస్తాన్‌పై సౌతాంప్టన్‌లో) కూడా హ్యాట్రిక్‌లు సాధించారు.



### రోహిత్ క్యాచ్‌ను వదిలేసి..

రోహిత్ శర్మలాంటి బ్యాట్స్‌మన్‌కు రెండో అవకాశం ఇస్తే ఫలితం ఎలా ఉంటుందో గతంలో చాలాసార్లు రుజువైంది. ఈసారి కూడా అదే జరిగింది. ఛేజ్ వేసిన 28వ ఓవర్లో 70 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద రోహిత్ బంతిని గాల్లోకి లేపగా...లాంగాన్ నుంచి పరుగెత్తుకుంటూ వచ్చిన హెట్‌మైర్ దానిని వదిలేశాడు. ఆ తర్వాత రోహిత్ తన స్కోరుకు మరో 89 పరుగులు జోడించాడు. భారత ఫీల్డర్లు కూడా రెండు క్యాచ్‌లు వదిలేసినా మ్యాచ్ తుది ఫలితంపై వాటి ప్రభావం పడలేదు. హోప్ '0' వద్ద ఇచ్చిన క్యాచ్‌ను రాహుల్, పూరన్ 22 పరుగుల వద్ద ఇచ్చిన క్యాచ్‌ను దీపక్ చాహర్ వదిలేశారు.



### సెల్యూట్ లేదు!

వికెట్ తీయగానే సైనికుడి తరహాలో సెల్యూట్ చేయడం విండీస్ పేసర్ కాట్రెల్ శైలి. స్వయంగా ఆర్మీలో పని చేస్తున్న అతను తన కెరీర్ ఆరంభం నుంచి దీనిని అలవాటుగా మార్చుకున్నాడు. రెండో వన్డేలో రోహిత్‌ను అవుట్ చేసినప్పుడు కూడా ఇది కనిపించింది. అయితే అయ్యర్‌ను అవుట్ చేశాక ఆ ఆనందం అతనిలో ఏమాత్రం కనిపించలేదు. అంతకుముందు ఓవర్లో పంత్ దెబ్బకు 24 పరుగులు ఇచ్చుకొని డీలా పడిన కాట్రెల్‌కు ఈసారి సెల్యూట్ చేసే ఓపిక కూడా లేకపోయింది.

### కోహ్లి గోల్డెన్ డక్

విశాఖ మైదానంలో అత్యద్భుత రికార్డు ఉన్న కోహ్లి ఈసారి దానికి 'దిష్టి చుక్క' పెట్టాడు. ఇక్కడ ఆడిన గత ఐదు మ్యాచ్‌లలో మొత్తం 556 పరుగులు చేసిన విరాట్ బుధవారం పోరులో 'గోల్డెన్ డక్'గా (ఆడిన తొలి బంతికే అవుటవ్వడం) వెనుదిరిగాడు. పొలార్డ్ ఆఫ్‌స్టంప్‌పై వేసిన బంతిని ఆడబోయిన కోహ్లి షార్ట్ మిడ్‌వికెట్‌లో ఛేజ్‌కు క్యాచ్ ఇచ్చాడు. కోహ్లిని అవుట్ చేసిన ప్రత్యర్థి జట్టు కెప్టెన్ పొలార్డ్ కూడా బ్యాటింగ్‌లో తన తొలి బంతికే అవుటయ్యాడు. వన్డేల్లో ఇలా జరగడం ఇదే మొదటిసారి.

**1** అంతర్జాతీయ క్రికెట్‌లో ఒకే ఏడాది అత్యధిక సిక్స్‌లు కొట్టిన బ్యాట్స్‌మన్‌గా తన పేరిటే ఉన్న రికార్డును రోహిత్ శర్మ (77 సిక్స్‌లు) సవరించాడు. గతేడాది రోహిత్ (74 సిక్స్‌లు) కొట్టాడు.

**3** తన వన్డే కెరీర్‌లో కోహ్లి 'గోల్డెన్ డక్'ల సంఖ్య. 2011లో విండీస్‌తో మ్యాచ్‌లో... 2013లో ఇంగ్లండ్‌తో మ్యాచ్‌లో కోహ్లి 'గోల్డెన్ డక్'గా వెనుదిరిగాడు.

**4** వన్డేల్లో అత్యధిక సెంచరీలు చేసిన బ్యాట్స్‌మెన్ జాబితాలో రోహిత్ (28 సెంచరీలు) శ్రీలంక ప్లేయర్ జయసూర్య (28)తో కలిసి సంయుక్తంగా నాలుగో స్థానానికి చేరుకున్నాడు. సచిన్ (49), కోహ్లి (43), పాంటింగ్ (30) తొలి 3 స్థానాల్లో ఉన్నారు.

**6** వన్డేల్లో రెండు హ్యాట్రిక్‌లు నమోదు చేసిన ఆరో బౌలర్‌గా కుల్దీప్ నిలిచాడు. మలింగ (శ్రీలంక) మూడు హ్యాట్రిక్‌లు తీయగా... అక్రమ్, సక్లాయిన్ ముస్తాక్ (పాక్), వాస్ (శ్రీలంక), బౌల్ట్ (న్యూజిలాండ్) రెండేసి హ్యాట్రిక్‌లు తీశారు.

"ముంబైలో జరిగిన టి20తో కలిపి చూస్తే వరుసగా మూడు మ్యాచ్‌లలో మేం బాగా ఆడాం. ముందుగా బ్యాటింగ్ చేసి కూడా మంచి స్కోర్లు సాధించగలిగాం. ఛేదనలో మా జట్టు ఘనత గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అదనంగా 40-50 పరుగులు సాధించడం ఎప్పుడైనా కలిసొస్తుంది. రోహిత్, రాహుల్ శుభారంభం అందిస్తే శ్రేయస్, పంత్ అద్భుతంగా ఆడారు. రాబోయే రోజుల్లో వన్డేల్లో ఎలాంటి పెద్ద టోర్నీ లేదు కాబట్టి ఇలాంటి సిరీస్‌లలో ఎంత దూకుడుగా ఆడితే అంత మంచిది. టాస్ ఓడి కూడా ఈ తరహాలో గెలిచామంటే మా దృష్టిలో టాస్‌కు ప్రాధాన్యత లేదు. మా ఫీల్డింగ్ మరింత మెరుగ్గా ఉంటే బాగుండేది. ఇలా క్యాచ్‌లు వదిలేస్తే కష్టం.

–కోహ్లి, భారత కెప్టెన్

# ధరలు పలికే ధీరులెవ్వరో!

- మ్యాక్స్‌వెల్, హెట్‌మైర్‌లపై ఫ్రాంచైజీల కన్ను
- ఐపీఎల్ వేలం నేడు

**కోల్‌కతా:** ఐపీఎల్ 2020 సీజన్ ఆట కోసం నేడు ఆటగాళ్ల వేలం పాట జరగనుంది. భారత యువ క్రికెటర్లతో పాటు ప్రధానంగా ఆస్ట్రేలియా, వెస్టిండీస్ ఆటగాళ్లపైనే ఫ్రాంచైజీలు కన్నేశాయి. అయితే ఇందులో ధరలు పలికే ధీరులు ఎందరో తేలాలంటే వేలం ముగిసేదాకా ఎదురుచూడాలి. ఓవరాల్‌గా ఎనిమిది జట్లలో మొత్తం 73 ఖాళీలుండగా... వేలంలో 332 మంది ఆటగాళ్లు అందుబాటులో ఉన్నారు. ఆస్ట్రేలియా నుంచి ఐదుగురు ఆటగాళ్లపై కోట్లు కురిపించేందుకు ఫ్రాంచైజీలు సిద్ధంగా ఉన్నాయి. ఆల్‌రౌండర్ మ్యాక్స్‌వెల్, లిన్, మిచెల్ మార్ష్, కమిన్స్, హాజల్‌వుడ్‌లకు అత్యధిక మొత్తం లభించే అవకాశముంది. కరీబియన్ హిట్టర్ హెట్‌మైర్ ప్రధాన ఆకర్షణ కావొచ్చు. ప్రస్తుతం అతను అసాధారణ ఫామ్ కనబరుస్తుండటంతో ఎంతైనా వెచ్చించేందుకు ఫ్రాంచైజీలు వెనుకాడకపోవచ్చు. టెస్టులకు పరిమితమైన తెలుగు క్రికెటర్ హనుమ విహారి, పుజారా రూ. 50 లక్షల ప్రాథమిక ధరతో ఉన్నారు. గత సీజన్‌లో ఢిల్లీకి ఆడిన విహారిని విడుదల చేయగా... పుజారాను ఎవరూ కొనలేదు. ఈసారి ఐపీఎల్ వేలంలో ఆంధ్ర నుంచి ఆరుగురు (విహారి, భరత్, రికీ భుయ్, స్టీఫెన్, పృథ్వీరాజ్, ఇస్మాయిల్), హైదరాబాద్ నుంచి నలుగురు (సందీప్, తిలక్ వర్మ, యుధ్‌వీర్, మిలింద్) ఉన్నారు.


మ్యాక్స్‌వెల్

**మధ్యాహ్నం గం. 2.30 నుంచి స్టార్ స్పోర్ట్స్-1లో ప్రత్యక్ష ప్రసారం**

## బెంగళూరు గెలుపు

**గువాహటి:** డిఫెండింగ్ చాంపియన్ బెంగళూరు ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) ఇండియన్ సూపర్ లీగ్ టోర్నీలో నాలుగో విజయం నమోదు చేసింది. నార్త్ ఈస్ట్ యునైటెడ్ ఎఫ్‌సీతో బుధవారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో బెంగళూరు 2–0 గోల్స్ తేడాతో గెలిచింది. బెంగళూరు తరపున సునీల్ ఛెత్రి (68వ నిమిషంలో), అల్బెర్ట్ సెరాన్ (81వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు.

### దక్షిణాఫ్రికా బ్యాటింగ్ సలహాదారుగా కలిస్

**జొహన్నెస్‌బర్గ్:** 'సఫారీ' విఖ్యాత ఆల్‌రౌండర్ జాక్వెస్ కలిస్‌ను దక్షిణాఫ్రికా జట్టు బ్యాటింగ్ సలహాదారుగా నియమించింది. అయితే కోచింగ్‌కు అతనేం కొత్తకాదు. 2015లో ఐపీఎల్ ఫ్రాంచైజీ కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు బ్యాటింగ్ సలహాదారుగా పనిచేశాడు. 44 ఏళ్ల కలిస్ 2014లో క్రికెట్‌కు గుడ్‌బై చెప్పాడు. టెస్టుల్లో 55.37 సగటుతో 13,289 పరుగులు, వన్డేల్లో 44.36 సగటుతో 11,579 పరుగులు చేశాడు.

## ఆంధ్ర జట్టుకు ఆధిక్యం

**సాక్షి, ఒంగోలు టౌన్:** మిడిలార్డర్ బ్యాట్స్‌మన్ రికీ భుయ్ (70 బ్యాటింగ్; 8 ఫోర్లు)తోపాటు కెప్టెన్ హనుమ విహారి (38; 6 ఫోర్లు), మనీశ్ (42; 7 ఫోర్లు), కరణ్ షిండే (48; 6 ఫోర్లు) బాధ్యతాయుతంగా ఆడటంతో... ఢిల్లీతో ఇక్కడ జరుగుతున్న రంజీ ట్రోఫీ క్రికెట్ గ్రూప్ 'ఎ' లీగ్ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. ఓవర్‌నైట్ స్కోరు 16/2తో బుధవారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆంధ్ర ఆట ముగిసే సమయానికి 87 ఓవర్లలో 6 వికెట్లకు 249 పరుగులు చేసింది. ప్రస్తుతం ఆంధ్ర ఖాతాలో 34 పరుగుల ఆధిక్యం ఉంది. రికీ భుయ్‌కు తోడుగా గిరినాథ్ రెడ్డి (11 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. ఢిల్లీ బౌలర్లలో నవదీప్ సైని మూడు వికెట్లు, పవన్ రెండు వికెట్లు తీశారు.


భుయ్

# సాక్షి బిజినెస్

గురువారం
19-12-2019

WWW.SAKSHIBUSINESS.COM


## స్టాక్‌ మార్కెట్లు

**దేశీ సూచీలు**

| సెన్సెక్స్‌ | నిఫ్టీ |
|---|---|
| 206 ▲ | 57 ▲ |
| 41,559 | 12,222 |

మరిన్ని వార్తలు, స్టాక్‌ అప్‌డేట్స్‌ కోసం...
www.sakshibusiness.com చూడండి

**విదేశీ సూచీలు** (రాత్రి రెండు 11.30గంటలకు)

| | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్‌ | 8,843 | ▲ | 20 |
| డోజోన్స్‌ | 28,276 | ▲ | 10 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,541 | ▲ | 16 |
| డాక్స్‌ | 13,222 | ▼ | 66 |
| షాంఘై | 3,017 | ▼ | 1 |
| నికాయ్‌ | 23,934 | ▼ | 132 |

● అమెరికా ● బ్రిటన్‌ ● జర్మనీ ● చైనా ● జపాన్‌

## ఫారెక్స్‌ రేట్లు రూ. లలో

| | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|
| యూఎస్‌ డాలర్‌ | 70.08 | 72.36 |
| బ్రిటన్‌ పౌండ్‌ | 91.68 | 94.85 |
| యూరో | 77.97 | 80.68 |
| జపాన్‌ ఎన్‌ (100) | 62.00 | 74.00 |
| ఆస్ట్రేలియా డాలర్‌ | 47.80 | 50.08 |
| సింగపూర్‌ డాలర్‌ | 51.54 | 53.77 |
| సౌదీ రియాల్‌ | 18.14 | 19.74 |
| యూఏఈ దిర్హామ్‌ | 18.86 | 19.86 |
| చైనా యువాన్‌ | 9.52 | 10.93 |

# మిస్త్రీకి టాటా చెల్లదు!




**న్యూఢిల్లీ:** టాటా గ్రూప్‌ చైర్మన్‌ పదవి నుంచి నాటకీయ ఫక్కీలో ఉద్వాసనకు గురైన సైరస్‌ మిస్త్రీకి ఎట్టకేలకు ఊరట లభించింది. మళ్లీ ఆయన్ను ఎగ్జిక్యూటివ్‌ చైర్మన్‌గా నియమించాలని, గ్రూప్‌ సంస్థల బోర్డుల్లో డైరెక్టరుగా కొనసాగించాలని నేషనల్‌ కంపెనీ లా అప్పిలేట్‌ ట్రిబ్యునల్‌ (ఎన్‌సీఎల్‌ఏటీ) ఆదేశించింది. టాటా సన్స్‌ చైర్మన్‌గా ఎన్‌.చంద్రశేఖరన్‌ నియామకం చట్టవిరుద్ధమని స్పష్టం చేసింది. అలాగే, టాటా సన్స్‌ స్వరూపాన్ని పబ్లిక్‌ లిమిటెడ్‌ కంపెనీ నుంచి ప్రైవేట్‌ కంపెనీగా మార్చడం కూడా చెల్లదని ఎన్‌సీఎల్‌ఏటీ స్పష్టం చేసింది. వీటికి సంబంధించి నేషనల్‌ కంపెనీ లా ట్రిబ్యునల్‌ (ఎన్‌సీఎల్‌టీ) ఇచ్చిన ఆదేశాలను పక్కన పెట్టింది. ఈ ఆదేశాలు నాలుగు వారాల్లో అమల్లోకి వస్తాయి. ఈ లోగా దీనిపై టాటా గ్రూప్‌ అప్పీలు చేసుకోవచ్చని ఎన్‌ఎస్‌ఎల్‌ఏటీ తెలిపింది. '2016 అక్టోబర్‌ 24న టాటా సన్స్‌ బోర్డ్‌ ఆఫ్‌ డైరెక్టర్స్‌ సమావేశంలో మిస్త్రీకి వ్యతిరేకంగా తీసుకున్న నిర్ణయాలు చట్టవిరుద్ధం. కాబట్టి మళ్లీ ఎగ్జిక్యూటివ్‌ చైర్మన్‌గా ఆయన బాధ్యతలు చేపట్టవచ్చు. అలాగే, టాటా కంపెనీల్లో డైరెక్టరుగా కూడా ఉండవచ్చు. ఈ నేపథ్యంలో మిస్త్రీ స్థానంలో చంద్రశేఖరన్‌ నియామకం చట్టవిరుద్ధం అవుతుంది' అని జస్టిస్‌ ఎస్‌జే ముఖోపాధ్యాయ్‌ సారథ్యంలోని ద్విసభ్య బెంచ్‌ తుది ఉత్తర్వులిచ్చింది. మరోవైపు, డైరెక్టర్ల బోర్డు లేదా వార్షిక సర్వసభ్య సమావేశంలో మెజారిటీ అనుమతులు అవసరమయ్యే ఏ నిర్ణయాలను ముందస్తుగా తీసుకోకూడదంటూ టాటా గ్రూప్‌ గౌరవ చైర్మన్‌ రతన్‌ టాటాను, టాటా ట్రస్ట్స్‌ నామినీని ఆదేశించింది. మిస్త్రీకి వ్యతిరేకంగా ఆర్టికల్‌ 75లోని నిబంధనలు ప్రయోగించరాదంటూ డైరెక్టర్ల బోర్డుకు, షేర్‌హోల్డర్లకు సూచించింది. అటు, టాటా సన్స్‌ స్వరూపాన్ని పబ్లిక్‌ కంపెనీ నుంచి ప్రైవేట్‌ కిందకు మార్చాలన్న కంపెనీల రిజిస్ట్రార్‌ (ఆర్‌వోసీ) నిర్ణయాన్ని అప్పిలేట్‌ ట్రిబ్యునల్‌ తోసిపుచ్చింది. దీన్ని రికార్డుల్లో సత్వరం సరిచేయాలంటూ ఆర్‌వోసీని ఎన్‌సీఎల్‌ఏటీ ఆదేశించింది.

ఇక, మిస్త్రీకి వ్యతిరేకంగా 2018 జూలై 9న ఎన్‌సీఎల్‌టీ ఇచ్చిన ఆదేశాల్లో చేసిన కొన్ని వ్యాఖ్యలను కూడా తప్పుబట్టింది. ఇవి మిస్త్రీ ప్రతిష్టను దెబ్బతీసేవిగా ఉన్నాయని, వీటిని రికార్డుల నుంచి తొలగించాలని పేర్కొంది. అయితే, మిస్త్రీని డైరెక్టరుగా కొనసాగించడం మినహా... ఆయన్ను చైర్మన్‌గా పునర్నియమించాలన్న ఆదేశాలను సస్పెన్షన్‌లో ఉంచాలని టాటా సన్స్‌ న్యాయవాది ఎన్‌సీఎల్‌ఏటీని అభ్యర్థించారు.

**చట్టపరంగా చర్యలు: టాటా సన్స్‌**

ట్రిబ్యునల్‌ ఆదేశాలు చూస్తుంటే అడిగిన దానికి మించే మిస్త్రీకి ఊరటనిచ్చినట్లు కనిపిస్తోందని టాటా సన్స్‌ వ్యాఖ్యానించింది. టాటా సన్స్‌, ఇతర లిస్టెడ్‌ టాటా కంపెనీల షేర్‌హోల్డర్లు.. చట్టబద్ధంగా షేర్‌హోల్డర్ల సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఎన్‌సీఎల్‌ఏటీ ఏ విధంగా తిరస్కరిస్తుందన్న దానిపై స్పష్టత లేదని పేర్కొంది. 'మా కేసు బలంగా ఉందని గట్టిగా విశ్వసిస్తున్నాం. తాజా ఆదేశాలకు సంబంధించి చట్టపరంగా ముందుకు వెడతాం' అని ఒక ప్రకటనలో తెలిపింది. కాగా, తాజా పరిణామాలతో చంద్రశేఖరన్‌ టాటా గ్రూప్‌ ఉద్యోగులకు లేఖ రాశారు. లీగల్‌ అంశాలను సంస్థ చూసుకుంటుందని.. సిబ్బంది తమ కార్యకలాపాలపై దృష్టిపెట్టి, వాటాదారుల ప్రయోజనాలను కాపాడాలని పేర్కొన్నారు.

## టాటా గ్రూప్‌ పగ్గాలు సైరస్‌ మిస్త్రీకే...

- చైర్మన్‌గా చంద్రశేఖరన్‌ నియామకం చట్టవిరుద్ధం
- కంపెనీ లా అప్పిలేట్‌ ట్రిబ్యునల్‌ ఆదేశాలు
- ప్రైవేట్‌ సంస్థగా మార్పునకూ తిరస్కరణ
- టాటా గ్రూప్‌ అప్పీలుకు 4 వారాలు చాన్స్‌

### గ్రూప్‌ కంపెనీల షేర్లు పతనం..

అప్పిలేట్‌ ట్రిబ్యునల్‌ ఆదేశాల నేపథ్యంలో.. టాటా గ్రూప్‌ కంపెనీల షేర్లు 4 శాతం దాకా క్షీణించాయి. బీఎస్‌ఈలో టాటా గ్లోబల్‌ బెవరేజెస్‌ 4 శాతం, టాటా కాఫీ 3.88 శాతం, టాటా మోటార్స్‌ 3.05 శాతం పతనమయ్యాయి. బీఎస్‌ఈ సెన్సెక్స్‌లో టాటా మోటార్స్‌ షేరు అత్యధికంగా క్షీణించింది. అటు ఇండియన్‌ హోటల్స్‌ కంపెనీ 2.48 శాతం, టాటా కెమికల్స్‌ 1.65 శాతం, టాటా ఇన్వెస్ట్‌మెంట్‌ కార్పొరేషన్‌ 1.22 శాతం, టాటా పవర్‌ కంపెనీ 0.98 శాతం తగ్గాయి.

### ఇది గుడ్‌ గవర్నెన్స్‌ విజయం



ట్రిబ్యునల్‌ తీర్పుతో మైనారిటీ షేర్‌హోల్డర్ల హక్కులు, గుడ్‌ గవర్నెన్స్‌ సూత్రాలకు విజయం లభించింది. ఈ విషయంలో మా వాదనలే నెగ్గాయి. ఎలాంటి కారణం లేకుండా, ముందస్తుగా చెప్పకుండా నన్ను టాటా సన్స్‌ ఎగ్జిక్యూటివ్‌ చైర్మన్‌గాను, ఆ తర్వాత డైరెక్టర్‌గాను తొలగించారు. వీటిని వ్యతిరేకిస్తూ మేం చేసిన వాదనలు సరైనవే అనడానికి తాజా తీర్పు నిదర్శనం. టాటా గ్రూప్‌ వృద్ధి చెందాలంటే కంపెనీలు, వాటి బోర్డులు, టాటా సన్స్‌ యాజమాన్యం.. బోర్డు, టాటా సన్స్‌ షేర్‌హోల్డర్లు .. అందరూ నిర్దిష్ట గవర్నెన్స్‌ నిబంధనలకు అనుగుణంగా కలిసి పనిచేయడం, అన్ని వర్గాల ప్రయోజనాలూ పరిరక్షించడం అవసరం. – సైరస్‌ మిస్త్రీ

### మూడేళ్ల పోరాటం..

- **2016 అక్టోబర్‌ 24:** టాటా సన్స్‌ చైర్మన్‌గా మిస్త్రీ తొలగింపు. తాత్కాలిక చైర్మన్‌గా రతన్‌ టాటా నియామకం.
- **2016 డిసెంబర్‌ 20:** మిస్త్రీ తొలగింపును సవాల్‌ చేయడంతో పాటు టాటా సన్స్‌లో అవకతవకలు, మైనారిటీ షేర్‌హోల్డర్ల హక్కులు కాలరాస్తున్నారని ఆరోపిస్తూ మిస్త్రీ కుటుంబానికి చెందిన సంస్థలు ఎన్‌సీఎల్‌టీని (ముంబై) ఆశ్రయించాయి.
- **2017 జనవరి 12:** అప్పటి టీసీఎస్‌ సీఈవో, ఎండీ ఎన్‌ చంద్రశేఖరన్‌ను చైర్మన్‌గా నియమిస్తున్నట్లు టాటా సన్స్‌ ప్రకటించింది.
- **2017 ఫిబ్రవరి 6:** టాటా గ్రూప్‌ సంస్థల హోల్డింగ్‌ సంస్థ అయిన టాటా సన్స్‌ బోర్డు నుంచి డైరెక్టరుగా మిస్త్రీ తొలగింపు.
- **2017 మార్చి 6:** మిస్త్రీ కంపెనీల పిటిషన్‌ను ఎన్‌సీఎల్‌టీ కొట్టేసింది. మైనారిటీ షేర్‌హోల్డర్ల తరఫున పిటిషన్‌ వేయాలంటే 10 శాతం వాటాలైనా ఉండాలన్న నిబంధనకు ఇది విరుద్ధంగా ఉందని పేర్కొంది. మిస్త్రీ కుటుంబానికి టాటా సన్స్‌లో 18.4 శాతం వాటాలు ఉన్నప్పటికీ.. ప్రిఫరెన్షియల్‌ షేర్లను పక్కన పెడితే కేవలం 3% వాటా మాత్రమే ఉండటం ఇందుకు కారణం. ఆ తర్వాత 10% వాటాల నిబంధన నుంచి మినహాయింపునివ్వాలంటూ మిస్త్రీ సంస్థలు చేసిన విజ్ఞప్తిని కూడా ఏప్రిల్‌ 17న ఎన్‌సీఎల్‌టీ తోసిపుచ్చింది.
- **2017 ఏప్రిల్‌ 27:** ఎన్‌సీఎల్‌టీ ఆదేశాలపై మిస్త్రీ సంస్థలు ఎన్‌సీఎల్‌ఏటీని ఆశ్రయించాయి.
- **2017 సెప్టెంబర్‌ 21:** 10 శాతం వాటాల నిబంధన మినహాయింపు విజ్ఞప్తిని తోసిపుచ్చిన ఎన్‌సీఎల్‌ఏటీ.. మిగతా ఆరోపణలపై విచారణ జరపాలంటూ ఎన్‌సీఎల్‌టీని సూచించింది.
- **2017 అక్టోబర్‌ 5:** కేసును ముంబై నుంచి ఢిల్లీకి మార్చాలంటూ ఎన్‌సీఎల్‌టీ ప్రిన్సిపల్‌ బెంచ్‌ను మిస్త్రీ సంస్థలు కోరాయి. అయితే, దీన్ని తిరస్కరించిన ప్రిన్సిపల్‌ బెంచ్‌.. రెండు సంస్థలకు కలిపి రూ. 10 లక్షల జరిమానా విధించింది.
- **2018 జూలై 9:** టాటా గ్రూప్‌, రతన్‌ టాటాపై మిస్త్రీ ఆరోపణల్లో పసలేదని పిటిషన్‌లను కొట్టేసిన ఎన్‌సీఎల్‌టీ (ముంబై)
- **2018 ఆగస్టు 3:** ఎన్‌సీఎల్‌టీ తీర్పును సవాల్‌ చేస్తూ మిస్త్రీ సంస్థలు అప్పిలేట్‌ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించాయి. ఆగస్టు 29న మిస్త్రీ వ్యక్తిగత పిటిషన్‌ను కూడా స్వీకరించిన ఎన్‌సీఎల్‌ఏటీ.. మిగతా పిటిషన్లతో కలిపి విచారణ చేయాలని నిర్ణయించింది.
- **2019 మే 23:** వాదనలు ముగిసిన అనంతరం ఎన్‌సీఎల్‌ఏటీ తీర్పు రిజర్వ్‌లో ఉంచింది.
- **2019 డిసెంబర్‌ 18:** మిస్త్రీని టాటా సన్స్‌ చైర్మన్‌గా మళ్లీ నియమించాలంటూ ఆదేశాలిచ్చింది. అప్పీలు చేసుకునేందుకు టాటా సన్స్‌కు నాలుగు వారాల వ్యవధినిచ్చింది.

# అమెరికాలో కేసు.. కోర్టు బయట పరిష్కారం

**రూ. 5.6 కోట్లు చెల్లించనున్న ఇన్ఫోసిస్‌**



**వాషింగ్టన్‌/న్యూఢిల్లీ:** అమెరికాలో విదేశీ ఉద్యోగులను తప్పుగా వర్గీకరించి చూపడం, పన్నుపరమైన మోసాలకు పాల్పడటం తదితర ఆరోపణలకు సంబంధించిన కేసును ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్‌ కోర్టు వెలుపల పరిష్కరించుకోనుంది. ఇందుకు సంబంధించి కాలిఫోర్నియా రాష్ట్రానికి 8,00,000 డాలర్లు (సుమారు రూ.5.6 కోట్లు) చెల్లించనుంది. కాలిఫోర్నియా అటార్నీ జనరల్‌ జేవియర్‌ బెసెరా ఈ విషయాలు తెలిపారు. 'తక్కువ జీతాలతో పని చేయించుకునేందుకు, పన్నులు ఎగ్గొట్టేందుకు ఇన్ఫోసిస్‌ తప్పుడు వీసాలపై ఉద్యోగులను అమెరికాకు తీసుకొచ్చింది. కాలిఫోర్నియా చట్టాలను ఉల్లంఘిస్తే జరిమానాలు తప్పవనడానికి ఈ సెటిల్మెంట్‌ ఒక నిదర్శనం' అని పేర్కొన్నారు. 2006–2017 మధ్య కాలంలో అమెరికాలో 500 మంది ఉద్యోగులతో ఇన్ఫోసిస్‌ హెచ్‌–1బీ వీసాలపై కాకుండా బీ–1 వీసాలపై పనిచేయించుకుందన్న ప్రజా వేగు ఫిర్యాదు ఆధారంగా ఈ కేసు నమోదైంది. ఇలాంటి తప్పుడు వర్గీకరణ వల్ల ఇన్ఫోసిస్‌.. కాలిఫోర్నియా రాష్ట్రంలో నిరుద్యోగ బీమా, వైకల్య బీమా, ఉద్యోగుల శిక్షణ పన్నులు చెల్లించకుండా తప్పించుకుందని ఆరోపణలున్నాయి. సాధారణంగా హెచ్‌–1బీ వీసాలపై పని చేసే సిబ్బందికి స్థానిక నిబంధనలకు అనుగుణంగా జీతభత్యాలు చెల్లించాల్సి ఉంటుంది. మరోవైపు, తమపై ఆరోపణలను ఇన్ఫోసిస్‌ తోసిపుచ్చింది. సుదీర్ఘంగా 13 ఏళ్లుగా కొనసాగుతున్న ఈ వివాదానికి ముగింపు పలకాలన్న ఉద్దేశంతోనే పరిష్కరించుకుంటున్నట్లు వివరణనిచ్చింది. తప్పుడు పత్రాలు సమర్పించిందన్న ఆరోపణలను సెటిల్‌ చేసుకునేందుకు 2017లో న్యూయార్క్‌కు ఇన్ఫోసిస్‌ 1 మిలియన్‌ డాలర్లు చెల్లించింది.

# మార్కెట్లోకి పియాజియో 'ఏప్‌ ఈ-సిటీ'

**ధర రూ. 1.97 లక్షలు**



**న్యూఢిల్లీ:** ఇటలీకి చెందిన దిగ్గజ వాహన తయారీ కంపెనీ పియాజియో.. భారత ఎలక్ట్రిక్‌ వాహన విభాగంలోకి అడుగుపెట్టింది. 'ఏప్‌ ఈ-సిటీ' పేరిట ఎలక్ట్రిక్‌ త్రీ–వీలర్‌ను బుధవారం విడుదల చేసింది. లిథియం–అయాన్‌ బ్యాటరీ కలిగిన దీని ధర రూ. 1.97 లక్షలుగా(ఎక్స్‌–షోరూం) ప్రకటించింది. మూడేళ్ల వారెంటీతో వస్తున్న ఈ వాహనాన్ని సన్‌ మొబిలిటీ భాగస్వామ్యంతో మొదటి దశలో చండీగఢ్‌, మొహాలి, గురుగ్రామ్‌లలో అందుబాటులోకి తెస్తోంది.

# జనవరి 1 నుంచి పాత ఎస్‌బీఐ కార్డులు పనిచేయవు!



**హైదరాబాద్‌, బిజినెస్‌ బ్యూరో:** జనవరి 1, 2020 నుంచి మీ పాత స్టేట్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా (ఎస్‌బీఐ) డెబిట్‌, క్రెడిట్‌ కార్డులు పని చేయవు. రిజర్వ్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా (ఆర్‌బీఐ) మార్గదర్శకాల ప్రకారం.. పాత డెబిట్‌, క్రెడిట్‌ కార్డుల స్థానంలో చిప్‌ ఆధారిత ఈఎంవీ కార్డులను మాత్రమే వినియోగించాలి. ఈ నెల 31 లోపు ఎస్‌బీఐ ఖాతాదారులు తమ హోమ్‌ బ్రాంచీల్లో మ్యాజిస్టిక్‌ స్ట్రిప్‌ డెబిట్‌ కార్డ్‌, పాత కార్డ్‌ల స్థానంలో ఈఎంవీ చిప్‌, పిన్‌ ఆధారిత డెబిట్‌ కార్డ్‌ కోసం దరఖాస్తు చేసుకోవాలి. నెట్‌ బ్యాంకింగ్‌ ఉన్న ఖాతాదారులు ఆన్‌లైన్‌లో కొత్త కార్డ్‌ కోసం దరఖాస్తు చేసుకోవచ్చునని బ్యాంకు తెలియజేసింది. ఇప్పటికే పాన్‌ లేదా ఫామ్‌ 60లను అప్‌డేట్‌ చేయని ఎస్‌బీఐ ఖాతాదారుల కార్డ్‌లను ఎస్‌బీఐ డీయాక్టివేట్‌ చేస్తున్న సంగతి తెలిసిందే.

# ఖాతాదారులూ! కాస్త జాగ్రత్త!!

**సైబర్‌ నేరాల కట్టడిపై బీవోఐ చైర్మన్‌ పద్మనాభన్‌ వ్యాఖ్య**



**హైదరాబాద్‌, బిజినెస్‌ బ్యూరో:** సైబర్‌ నేరాలను కట్టడి చేసేందుకు బ్యాంకులు, నియంత్రణ సంస్థ ఎన్ని చర్యలు తీసుకుంటున్నప్పటికీ ఖాతాదారులు కూడా తమ వంతుగా పూర్తి అప్రమత్తతతో వ్యవహరించాల్సి ఉందని బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా (బీవోఐ) నాన్‌ ఎగ్జిక్యూటివ్‌ చైర్మన్‌ జి.పద్మనాభన్‌ అభిప్రాయపడ్డారు. డిజిటల్‌ లావాదేవీలకు సంబంధించి అసలైన పోర్టల్స్‌, యాప్స్‌ అప్‌డేటెడ్‌ వెర్షన్లను ఉపయోగించడంతో పాటు పిన్‌ నంబర్లు లాంటివి ఎవరికీ వెల్లడించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే, సైబర్‌ సెక్యూరిటీ అనేది ఏ ఒక్క సంస్థ బాధ్యతో కాదని.. ఈ విషయంలో ప్రభుత్వం, నియంత్రణ సంస్థలు, వివిధ ఏజెన్సీలు కలిసికట్టుగా పనిచేయాల్సి ఉంటుందని ఆయన చెప్పారు. బుధవారమిక్కడ ఐడీఆర్‌బీటీలో.. ఇన్ఫర్మేషన్‌ సిస్టమ్స్‌ సెక్యూరిటీపై 15వ అంతర్జాతీయ సదస్సు (ఐసీఐఎస్‌ఎస్‌) ప్రారంభించిన సందర్భంగా పద్మనాభన్‌ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సదస్సు 20 దాకా జరగనుంది.

అత్యధికంగా సైబర్‌ దాడులకు గురయ్యే దేశాల్లో అమెరికా తర్వాత భారత్‌ రెండో స్థానంలో ఉందని పద్మనాభన్‌ చెప్పారు. ''కానీ సైబర్‌ దాడులను ఎదుర్కొనేందుకు సన్నద్ధంగా ఉండే విషయంలో మాత్రం 47వ స్థానంలో ఉన్నాం. ఆర్థిక సేవలను సులభంగా అందించేందుకు, లావాదేవీల ఖర్చు భారీగా తగ్గించేందుకు సైబర్‌ టెక్నాలజీ ఉపయోగపడుతోంది. సాధారణంగా నెట్‌వర్క్‌లోకి చొరబడిన వైరస్‌ తీవ్రత 220 రోజులకు గానీ బయటపడటం లేదు. దీన్ని మరింత ముందుగా గుర్తించగలిగితే సైబర్‌ దాడులను కొంతైనా నియంత్రించవచ్చు'' అని ఆయన వివరించారు. ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ డెవలప్‌మెంట్‌ అండ్‌ రీసెర్చ్‌ ఇన్‌ బ్యాంకింగ్‌ టెక్నాలజీ(ఐడీఆర్‌బీటీ) దీనికి తగు టెక్నాలజీని రూపొందించడంపై దృష్టి పెట్టాలన్నారు. బ్యాంకింగ్‌ టెక్నాలజీకి సంబంధించి ఫిన్‌టెక్‌ ఎక్స్ఛేంజీ, 5జీ యూజ్‌ కేస్‌ ల్యాబ్‌ మొదలైనవి ఏర్పాటు వంటి అంశాలను ఐడీఆర్‌బీటీ డైరెక్టర్‌ ఏఎస్‌ రామశాస్త్రి వివరించారు.

# మన ఐటీ కంపెనీలను చూసి నేర్చుకోండి

- ఇంటే కాదు, రచ్చ కూడా గెలవాలి
- ఇతర కంపెనీలకు ఇన్ఫీ క్రిస్‌ సూచన



**న్యూఢిల్లీ:** భారత ఐటీ కంపెనీలను చూసి దేశంలోని ఇతర కంపెనీలు నేర్చుకోవాల్సింది చాలా ఉందని ఇన్ఫోసిస్‌ వ్యవస్థాపకుల్లో ఒకరైన క్రిస్‌ గోపాలకృష్ణన్‌ సూచించారు. మన ఐటీ కంపెనీలు ప్రపంచ స్థాయి ప్రమాణాలతో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని చెప్పారాయన. దేశంలోని పలు కంపెనీలు రుణ సంక్షోభంలో కొట్టుమిట్టాడుతుండగా, ఐటీ కంపెనీలు మాత్రం ఎలాంటి రుణభారం లేకుండా ఉన్నాయని తెలిపారు. కంపెనీలన్నీ పరిశోధన, అభివృద్ధిలపై అధికంగా పెట్టుబడులు పెట్టాలన్నారు. ఇక్కడ జరిగిన సీఐఐ సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. భారత కంపెనీలు విదేశీ స్టాక్‌ మార్కెట్లలో కూడా లిస్ట్‌ కావాలని ఆయన సూచించారు. ''చాలా దేశీయ కంపెనీలకు పోటీ అంటే భయం'' అన్నారాయన. కంపెనీలు కార్పొరేట్‌ గవర్నెన్స్‌ను మెరుగుపరచుకోవాలని, అంతర్జాతీయంగా పోటీపడాలని సూచించారు. 1980లో 16,000 కోట్ల డాలర్లుగా ఉన్న భారత ఆర్థిక వ్యవస్థ ఇప్పుడు 2.8 లక్షల కోట్ల డాలర్లకు ఎగసిందని క్రిస్‌ తెలిపారు. 2025 కల్లా 5 లక్షల కోట్ల డాలర్లకు పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని గుర్తు చేశారు. 2025 లేదా 2030 నాటికి ఈలక్ష్యాన్ని సాధిస్తామన్న ధీమాను వ్యక్తం చేశారు.

# 'సంపద'కు కేరాఫ్‌.. రిలయన్స్‌

**సృష్టికర్తల్లో అగ్రస్థానం..**

- టాప్‌–3లో ఇండియాబుల్స్‌ వెంచర్స్‌, ఇండస్‌ఇండ్‌ బ్యాంకు
- మోతీలాల్‌ ఓస్వాల్‌ అధ్యయన నివేదిక వెల్లడి




**న్యూఢిల్లీ:** గడిచిన ఐదు సంవత్సరాల్లో... అంటే 2014–19 మధ్య వాటాదారులకు అత్యంత సంపదను సమకూర్చిన కంపెనీగా రిలయన్స్‌ ఇండస్ట్రీస్‌ (ఆర్‌ఐఎల్‌) నిలిచింది. ఈ కాలంలో ఈ కంపెనీ రూ.5.6 లక్షల కోట్ల మేర విలువను పెంచుకున్నట్టు 'మోతీలాల్‌ ఓస్వాల్‌ వార్షిక సంపద సృష్టి అధ్యయనం 2019' తేల్చింది. అధికంగా సంపద తెచ్చిపెట్టిన కంపెనీల్లో.. మొదటి 100 కంపెనీలు కలసి 2014–19 కాలంలో సమకూర్చిన సంపద రూ.49 లక్షల కోట్లుగా ఉంది. ''ఏడేళ్ల విరామం తర్వాత మరోసారి రిలయన్స్‌ ఇండస్ట్రీస్‌ 2014–19 కాలంలో రూ.5.6 లక్షల కోట్ల విలువను సమకూర్చి అత్యధిక సంపద సృష్టికర్తగా అవతరించింది. చరిత్రలో ఇప్పటి దాకా ఇదే అత్యధిక రికార్డు'' అని బుధవారం విడుదలైన ఈ నివేదిక పేర్కొంది. గత ఐదేళ్ల కాలంలో అత్యధికంగా, అత్యంత వేగంగా, నిలకడగా సంపద సమకూర్చిన టాప్‌ 3 కంపెనీలుగా ఆర్‌ఐఎల్‌, ఇండియా బుల్స్‌ వెంచర్స్‌, ఇండస్‌ఇండ్‌ బ్యాంకు నిలవగా... వేగంగా సంపద తెచ్చిపెట్టిన వాటిల్లో ఇండియాబుల్స్‌ వెంచర్స్‌ వరుసగా రెండోసారి మొదటి స్థానం సంపాదించడం గమనార్హం. ఈ షేరు గత ఐదేళ్లలో వార్షికంగా 78 శాతం కాంపౌండెడ్‌ రాబడులను తెచ్చిపెట్టింది. టాప్‌–10 సంపద సృష్టికర్తల్లో బజాజ్‌ ఫైనాన్స్‌ స్థానం ప్రత్యేకమని ఈ నివేదిక తెలిపింది. ఇండస్‌ఇండ్‌ బ్యాంకు 2009–19 కాలంలో కాంపౌండెడ్‌గా 49 శాతం చొప్పున స్థిరంగా సంపదను సృష్టించింది. ఇక 2014–19 కాలంలో సెన్సెక్స్‌ కాంపౌండెడ్‌ వార్షిక రాబడి 12 శాతంగా ఉంది. అన్ని రకాల మార్కెట్‌ పరిస్థితుల్లోనూ ఈ కంపెనీలు సంపదను తెచ్చిపెట్టినట్టు నివేదిక తెలియజేసింది.

**ఫైనాన్షియల్‌ రంగం ముందంజ...**

ఫైనాన్షియల్‌ రంగం 2014–19 మధ్య కాలంలో అత్యంత సంపదను తెచ్చిపెట్టిన రంగంగా వరుసగా మూడో ఏడాది అగ్ర పథాన నిలిచింది. ప్రైవేటు బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలే ఈ రంగాన్ని నడిపించాయి. కాకపోతే, ఇదే విభాగంలోని ప్రభుత్వ రంగ బ్యాంకులు మాత్రం వాటాదారుల సంపదకు నష్టం చేకూర్చాయి. టాప్‌ 100 సంపద సృష్టికర్తల్లో ప్రభుత్వరంగ సంస్థలు కేవలం తొమ్మిదే చోటు సంపాదించాయి. అవి ఐవోసీ, బీపీసీఎల్‌, హెచ్‌పీసీఎల్‌, పవర్‌గ్రిడ్‌ కార్పొరేషన్‌, పెట్రోనెట్‌ ఎల్‌ఎన్‌జీ, ఇంద్రప్రస్థ గ్యాస్‌, ఎల్‌ఐసీ హౌసింగ్‌, భారత్‌ ఎలక్ట్రానిక్స్‌, ఎన్‌బీసీసీ. 2014–19 మధ్య కాలంలో లిస్టెడ్‌ కంపెనీల మార్కెట్‌ విలువలో మార్పుల ఆధారంగా ఈ గణాంకాలను మోతీలాల్‌ ఓస్వాల్‌ ఫైనాన్షియల్‌ సర్వీసెస్‌ సంస్థ రూపొందించింది.

## శ్రీమంతుల సగటు సంపద రూ.3.6 కోట్లే

- విశ్రాంత జీవనానికి నెలకు రూ.93,000
- స్టాండర్డ్‌ చార్టర్డ్‌ నివేదిక



**న్యూఢిల్లీ:** దేశంలో సంపన్నుల సగటు ఐశ్వర్యం రూ.3.6 కోట్లేనని, విశ్రాంత జీవన కాలంలో ప్రతి నెలా వెచ్చించేందుకు వారికి రూ.93,000 మాత్రమే ఉంటున్నదని స్టాండర్డ్‌ చార్టర్డ్‌ 'సంపద అంచనా నివేదిక 2019' తెలియజేసింది. ఇందులో వర్ధమాన సంపన్నుల వద్ద సగటున రూ.1.3 కోట్లు, సంపన్నుల వద్ద రూ.2.6 కోట్లు, అధిక సంపన్నుల(హెచ్‌ఎన్‌డబ్ల్యూఐ) వద్ద రూ.6.9 కోట్ల మేర వారి రిటైర్మెంట్‌ నాటికి ఉంటుందని అంచనా వేసింది. ఈ లెక్కన ఒక్కో సంపన్నుని వద్ద రిటైర్మెంట్‌ సమయంలో ప్రతీ నెలా వ్యయం చేసేందుకు రూ.93,000 ఉంటుందని పేర్కొంది. ఈ నిధిని వారి కోరిక మేరకు సగటున నెలవారీగా వ్యయం చేస్తూ వెళితే మాత్రం వర్ధమాన సంపన్నులకు ఆరేళ్ల పాటు, సంపన్నులకు తొమ్మిదేళ్లు, హెచ్‌ఎన్‌డబ్ల్యూఐలకు ఐదేళ్ల పాటే సరిపోతుందని నివేదిక తెలిపింది. జీడీపీ వృద్ధి, వడ్డీ రేట్లు తదితర అంశాలతో ఎంత సంపదను సమకూర్చుకోగలరు? రిటైర్మెంట్‌ సమయంలో ప్రతినెలా ఎంత మొత్తంతో వారు జీవించగలరు? అనే గణాంకాలను ఈ సంస్థ రూపొందించింది.

# నోకియా 2.3 వచ్చేసింది

**ధర రూ. 8,199**



**న్యూఢిల్లీ:** ఫిన్‌లాండ్‌కు చెందిన నోకియా బ్రాండ్‌ హ్యాండ్‌సెట్స్‌ విక్రయ సంస్థ హెచ్‌ఎండీ గ్లోబల్‌... బుధవారం భారత మార్కెట్లో నోకియా 2.3 స్మార్ట్‌ఫోన్‌ను విడుదల చేసింది. ఈ నెల్లోనే తొలుత ఈజిప్ట్‌ రాజధాని కైరోలో ఈ ఫోన్‌ను ఆవిష్కరించిన సంస్థ.. తాజాగా భారత మార్కెట్లోకి ఫోన్‌ను తీసుకొచ్చింది. కొత్త ఫోన్‌ 6.2 అంగుళాల డిస్‌ప్లే, డ్యూయల్‌ రియర్‌ కెమెరా, 4,000 ఎంఏహెచ్‌ బ్యాటరీతో వస్తుంది. 2జీబీ/32 జీబీ వేరియంట్‌ ధర రూ. 8,199గా కంపెనీ ప్రకటించింది. నూతన మోడల్‌కు ఏడాది రీప్లేస్‌మెంట్‌ గ్యారెంటీ ఉంది.

# జేఎల్‌ఆర్‌ చేతికి 'బౌలర్‌'



**న్యూఢిల్లీ:** ఏ తరహా ప్రాంతంలోనైనా పరుగులు తీసే పెర్ఫామెన్స్‌ కార్లను, విడి భాగాలను, ర్యాలీ రెయిడ్‌ వాహనాల్ని తయారు చేసే బ్రిటన్‌ సంస్థ బౌలర్‌ను టాటా మోటార్స్‌కు చెందిన లగ్జరీ కార్ల విభాగం జాగ్వార్‌ ల్యాండ్‌ రోవర్‌ (జేఎల్‌ఆర్‌) కొనుగోలు చేసింది. ఆఫ్‌–రోడ్‌ కాంపిటీషన్‌ కార్లను కూడా తయారు చేసే బౌలర్‌ కంపెనీ ఇకపై జేఎల్‌ఆర్‌కు చెందిన స్పెషల్‌ వెహికల్‌ ఆపరేషన్స్‌ వ్యాపారంలో ఒక భాగం కానుంది. అయితే ఎంత మొత్తానికి ఈ సంస్థకు కొనుగోలు చేశారన్న వివరాలను మాత్రం జేఎల్‌ఆర్‌ వెల్లడించలేదు.

## కార్పొరేట్ బ్రీఫ్స్...

**ఎన్ఎండీసీ:** కుమారస్వామి ఐరన్ ఓర్ మైన్స్‌లో వార్షిక ఉత్పత్తి ప్రస్తుతమున్న 70 లక్షల టన్నుల నుంచి ఒక కోటి టన్నులకు చేర్చేందుకు అనుమతి లభించింది.

**డాక్టర్ అగర్వాల్స్:** యూకే ప్రభుత్వ ఆర్థిక సంస్థ సీడీసీ గ్రూప్ నుంచి రూ.215 కోట్లు సమీకరించింది. విస్తరణకు ఈ నిధులను ఖర్చు చేస్తారు.

## బులియన్ రూ.లలో

| | | |
|---|---|---|
| **ముంబై** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 39,010 | ▲ 110 |
| బంగారం (22 క్యారెట్లు) | 37,150 | ▲ 100 |
| వెండి (కిలో) | 47,700 | 0 |
| **చెన్నై** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 38,160 | ▲ 100 |
| బంగారం (22 క్యారెట్లు) | 36,340 | ▲ 90 |
| వెండి (కిలో) | 47,700 | 0 |
| **హైదరాబాద్** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 38,160 | ▲ 100 |
| బంగారం (22 క్యారెట్లు) | 36,340 | ▲ 90 |
| వెండి (కిలో) | 47,700 | 0 |
| **ప్రొద్దుటూరు** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 38,800 | 0 |
| బంగారం (22 క్యారెట్లు) | 35,970 | 0 |
| వెండి (కిలో) | 45,500 | 0 |
| **విశాఖపట్నం** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 38,940 | 0 |
| బంగారం (22 క్యారెట్లు) | 36,220 | 0 |
| వెండి (కిలో) | 45,000 | 0 |
| **ఏపీ బులియన్ అసోసియేషన్** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 39,290 | ▲ 70 |
| బంగారం (22 క్యారెట్లు) | 36,340 | ▲ 70 |
| వెండి (కిలో) | 47,700 | 0 |

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

## ముడిచమురు... (బ్యారెల్)

| | | |
|---|---|---|
| నైమెక్స్ లైట్ స్వీట్ | 61.01 (రాత్రి 11.30కు) | $ 60.87 (మంగళవారం ముగింపు) |
| బ్రెంట్ | 66.27 (రాత్రి 11.30కు) | $ 66.10 (మంగళవారం ముగింపు) |

## కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 19-12-2019

| | |
|---|---|
| విశాఖ | 470-00 |
| చిత్తూరు | 458-00 |
| వరంగల్ | 436-00 |
| విజయవాడ | 452-00 |
| గోదావరి | 452-00 |
| **18-12-2019 ఫామ్ ధర...** | |
| హైదరాబాద్ | 433-00 |

# కొనసాగిన రికార్డ్ లాభాలు

- రెండో రోజూ కొత్త శిఖరాలకు సూచీలు
- సానుకూలంగా అంతర్జాతీయ సంకేతాలు
- కొనసాగుతున్న విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్లు
- ఇంట్రాడేలో, ముగింపులో కూడా రికార్డు స్థాయి
- 206 పాయింట్ల లాభంతో 41,559కు సెన్సెక్స్
- 57 పాయింట్లు పెరిగి 12,222కు నిఫ్టీ



స్టాక్ మార్కెట్లో రికార్డ్ లాభాలు బుధవారం కూడా కొనసాగాయి. సూచీల్లో వెయిటేజీ అధికంగా ఉన్న హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐటీసీ షేర్ల జోరుకు సానుకూల అంతర్జాతీయ సంకేతాలు కూడా తోడవడంతో సెన్సెక్స్, నిఫ్టీలు లాభపడ్డాయి. ఈ రెండు సూచీలు ఇంట్రాడేలోనూ, ముగింపులోనూ వరుసగా రెండో రోజూ కొత్త రికార్డ్‌లను నెలకొల్పాయి. తొలిసారిగా సెన్సెక్స్ 41,500 పాయింట్లు, నిఫ్టీ 12,200 పాయింట్ల ఎగువన ముగిశాయి. ఇంట్రాడేలో 41,615 పాయింట్ల జీవిత కాల గరిష్ట స్థాయిని తాకిన సెన్సెక్స్ చివరకు 206 పాయింట్ల లాభంతో 41,559 పాయింట్ల వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ ఇంట్రాడేలో 12,238 పాయింట్ల ఆల్‌టైమ్ హైను తాకి చివరకు 57 పాయింట్ల లాభంతో 12,222 పాయింట్ల వద్ద ముగిసింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ పతనమైనా, మన మార్కెట్ ముందుకే దూసుకుపోయింది. ఎస్‌బీఐ, ఐసీఐసీఐ బ్యాంక్, ఇన్ఫోసిస్ షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకోవడంతో సూచీల లాభాలకు కళ్లెం పడింది.

### సూచీల ఆల్‌టైమ్ హైలు

| సూచీ | ఇంట్రాడే | ముగింపు (పాయింట్లు) |
|---|---|---|
| సెన్సెక్స్ | 41,615 | 41,559 |
| నిఫ్టీ | 12,238 | 12,222 |

లోహ, ఐటీ, ఫార్మా, రియల్టీ, కన్సూమర్ రంగ షేర్లు లాభపడగా, ప్రభుత్వ రంగ, టెలికం, ఆయిల్, గ్యాస్ షేర్లు నష్టపోయాయి.

**జోరుగా కొనుగోళ్లు....**

ఆర్థిక మందగమనాన్ని అడ్డుకోవడానికి ప్రభుత్వం మరిన్ని ఉద్దీపన చర్యలను తీసుకుంటుందన్న అంచనాలు, ఆశలతో కొనుగోళ్లు జోరుగా సాగుతున్నాయని నిపుణులంటున్నారు. బుధవారం జీఎస్‌టీ మండలి సమావేశం జరగ్గా... మార్కెట్ ముగిసే సమయానికి ఎలాంటి నిర్ణయం వెలువడలేదు. కానీ శ్లాబ్‌లను మార్చే అవకాశాలు లేవన్న వార్తలతో మార్కెట్లు సానుకూలంగా కదిలాయి. అమెరికా– చైనా మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు తగ్గడంతో ఆర్డర్లు పెరుగుతాయనే అంచనాలతో లోహ, ఐటీ షేర్లు పెరిగాయి. ఆసియా, యూరప్ మార్కెట్లు మిశ్రమంగా ముగిశాయి.

### స్టాక్ మార్కెట్ డేటా

| | టర్నోవర్ (రూ. కోట్లలో) |
|---|---|
| బీఎస్ఈ | 2,585 |
| ఎన్ఎస్ఈ | 36,407 |
| ఎన్ఎస్ఈ (డెరివేటివ్స్) | 13,35,544 |
| ఎఫ్ఐఐ | 1,837 |
| డీఐఐ | -1,268 |

### త్వరలో రొసారి బయోటెక్ ఐపీఓ!

ప్రత్యేక రసాయనాలు తయారు చేసే రొసారి బయోటెక్ కంపెనీ త్వరలో ఐపీఓకు (ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్) రానున్నది. ఐపీఓ సంబంధిత పత్రాలను సెబీకి సమర్పించింది. రూ.150 కోట్ల విలువైన తాజా ఈక్విటీ షేర్లను జారీ చేయనుంది. ఈ ఐపీఓ సైజు రూ.700 కోట్లు మేర ఉంటుందని అంచనా.

### పతంజలి ఆయుర్వేద చేతికి రుచి సోయా

**పూర్తయిన లావాదేవీ**

**న్యూఢిల్లీ:** రుచి సోయా కంపెనీ కొనుగోలు ప్రక్రియను పతంజలి ఆయుర్వేద పూర్తి చేసింది. కేసు పరిష్కార ప్రణాళికలో భాగంగా రుణ దాతల కోసం పతంజలి ఆయుర్వేద రూ.4,350 కోట్లను ఎస్క్రో అకౌంట్‌లో డిపాజిట్ చేయడంతో ఈ కొనుగోలు ప్రక్రియ పూర్తయింది. రుచి సోయాకు రుణాలిచ్చిన రుణదాతలకు చెల్లింపుల ప్రక్రియ కొనసాగుతోంది. ఇక ఇప్పటి నుంచి రుచి సోయా తమ గ్రూప్ కంపెనీ అని పతంజలి ఆయుర్వేద ప్రతినిధి ఎస్.కె. తిజరీవాలా పేర్కొన్నారు.

### టెక్ స్టార్టప్‌లలో భారీ నియామకాలు

**న్యూఢిల్లీ:** టెక్నాలజీ రంగంలోని స్టార్టప్స్ (అంకుర సంస్థలు) ఈ ఏడాదిలో 60,000 ఉద్యోగాలను భర్తీ చేసినట్లు సాఫ్ట్‌వేర్ సంస్థల సమాఖ్య నాస్కామ్ వెల్లడించింది. ఐటీ మంత్రిత్వ శాఖ, పరిశ్రమ సమాఖ్యలు సంయుక్తంగా నిర్వహించిన 'ఫ్యూచర్ స్కిల్స్ ప్రైమ్' కార్యక్రమంలో ఈ విషయాన్ని తెలియజేసింది. నాస్కామ్ ఇచ్చిన సమాచారం ప్రకారం.. దేశంలోని టాప్ 15 కంపెనీలు నిరంతరం ఉద్యోగాలను కల్పిస్తూనే ఉన్నాయని ఐటీ శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ వ్యాఖ్యానించారు.

### నూరు శాతం ఆటోమేటిక్ ఎఫ్‌డీఐ కావాలి

**బీమా కంపెనీల డిమాండ్**

**న్యూఢిల్లీ:** బీమా కంపెనీల్లోకి నూరు శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులతో (ఎఫ్‌డీఐ) పాటు, విదేశీ సంస్థాగతదారుల పెట్టుబడులను ఆటోమేటిక్ మార్గంలో ఎటువంటి షరతుల్లేకుండా అనుమతించాలని ఐఆర్‌డీఏని కంపెనీలు కోరాయి. దీనివల్ల బీమా రంగం అదనంగా రూ.40,000– 60,000 కోట్ల పెట్టుబడులను ఆకర్షించగలదని పేర్కొన్నాయి.

## షోకాజు నోటీసును పరిశీలిస్తున్నాం: నెస్లే



**ముంబై:** జీఎస్‌టీ రేట్ల తగ్గింపు ప్రయోజనాన్ని నెస్లే ఇండియా వినియోగదారులకు వెంటనే బదిలీ చేయకుండా అక్రమంగా లాభాలను ఆర్జించిందంటూ లాభాపేక్ష నిరోధక విభాగం (ఎన్ఏఏ) జారీ చేసిన షోకాజు నోటీసును పరిశీలిస్తున్నామని, తదుపరి చర్యలు తీసుకుంటామని కంపెనీ ప్రకటించింది. రేట్ల తగ్గింపును వినియోగదారులకు బదిలీ చేయకుండా ప్రయోజనం పొందినందుకు రూ.90 కోట్లు చెల్లించాలని ఎన్ఏఏ ఈ నెల 12న జారీ చేసిన షోకాజు నోటీసులో నెస్లే ఇండియాను ఆదేశించడం గమనార్హం. గ్రాముల్లో చేసిన మార్పులకు సంబంధించిన ఆధారాలను సమర్పించినా గానీ ఈ ఆదేశాలు జారీ చేయడం ఎంతో దురదృష్టకరమని నెస్లే ఇండియా చైర్మన్, ఎండీ సురేష్ నారాయణన్ బుధవారం సీఐఐ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఓ వార్తా సంస్థతో చెప్పారు. షోకాజు నోటీసును పరిశీలించాక అవసరమైతే తదుపరి చర్యలు చేపడతామని స్పష్టం చేవారు. ''రూ.2, రూ.5 ఉత్పత్తిపై జీఎస్‌టీ తగ్గింపు ప్రయోజనం రూ.0.45, 0.55 పైసల చొప్పున బదిలీ చేయాలి. కాకపోతే కాయిన్లు అందుబాటులో లేవు. మరి ఈ ప్రయోజనాలను ఎలా బదిలీ చేస్తాం? అందుకే ఈ మేర గ్రాములను (బరువును) పెంచడం ద్వారా ప్రయోజనాన్ని బదిలీ చేశాం. అయినా ఈ ఆదేశాలు వెలువడ్డాయి'' అని ఈ కేసు గురించి నారాయణన్ వివరించారు.

## టెక్నాలజీతోనే నిర్మాణ వ్యయం తగ్గుతుంది



**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** ఐటీ, డేటా అనలిటిక్స్ వినియోగంతో నిర్మాణ, మార్కెటింగ్ వ్యయం తగ్గుతుందని నిర్మాణ రంగ ప్రముఖులు వ్యాఖ్యానించారు. సీఐఐ–సీబీఆర్ఈ ఆధ్వర్యంలో న్యూ ఢిల్లీలో జరిగిన 'ఛేంజింగ్ డైనమిక్స్ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ఇండస్ట్రీ' సదస్సులో వారు ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఏటీఎస్ గ్రూప్ సీఎండీ గీతాంబర్ ఆనంద్ మాట్లాడుతూ.. నివాస, వాణిజ్య సముదాయాల నిర్మాణంలో డెవలపర్లు తమ ఆలోచన తీరును మార్చుకోవాలన్నారు. డేటా అనలిటిక్స్ వినియోగంతో మార్కెటింగ్ వ్యయం చాలా వరకు తగ్గుతుందన్నారు. ''గతంలో మా కంపెనీలో ప్రాజెక్ట్ వ్యయంలో మార్కెటింగ్ వ్యయం 4–5 శాతంగా ఉండేది. కానీ, ఇప్పుడు డేటా అనలిటిక్స్ వినియోగంతో ఇది కేవలం 1 శాతానికి పరిమితమైందని'' అని చెప్పారాయన. నిర్మాణ రంగంలో టెక్నాలజీని వాడితే స్టీల్, సిమెంట్ వృథా కాకుండా ఉంటుందన్నారు. అనంతరం సీబీఆర్ఈ ఇండియా చైర్మన్ అండ్ సీఈఓ అన్షుమన్ మేగజైన్ మాట్లాడుతూ.. డెవలపర్లు ప్రాజెక్ట్‌లు ప్రారంభించే ముందు స్థానిక మార్కెట్ పరిస్థితులు, కొనుగోలుదారులు ఆర్థిక స్థితిని అవగాహన చేయాలని సూచించారు. కొనుగోలుదారుల అవసరాలు, అభిరుచులకు తగ్గట్టుగా ఫ్లాట్ల విస్తీర్ణాలను, ధరలను నిర్ణయించాల్సిన డెవలపర్లు.. అలా చేయడం లేదని పేర్కొన్నారు.

## ఐడీబీఐ బ్యాంక్‌తో లావాదేవీలపై భయం వద్దు!

- అది ప్రభుత్వానిదే; పూర్తి సామర్థ్యం ఉంది
- ఆర్థికశాఖ భరోసా

**ముంబై:** ఐడీబీఐ బ్యాంక్ నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, సంస్థలు డిపాజిట్లను ఉపసంహరిస్తుండటం... కొత్త డిపాజిట్లు చేయకపోవటం వంటి వ్యవహారాలపై ఆర్థికశాఖ ఆందోళన వ్యక్తం చేసింది. బ్యాంకుతో లావాదేవీల నిర్వహణ పట్ల ఆందోళన చెందాల్సిన అవసరం ఏదీ లేదని భరోసా ఇచ్చింది. ఈ మేరకు అన్ని ప్రభుత్వ శాఖలు, సంస్థలకు ఒక లేఖ రాసింది. ఎప్పటిలాగే బ్యాంకింగ్ సేవలు అందించడానికి ఐడీబీఐ బ్యాంక్‌కు తగిన సామర్థ్యం ఉందని స్పష్టం చేసింది. ప్రస్తుత ప్రమోటర్ ఎల్ఐసీ పూర్తిగా ప్రభుత్వ సంస్థ అన్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసింది. ఎల్ఐసీ, ప్రభుత్వం రెండింటికీ కలిపి బ్యాంకులో 97.46 శాతం వాటా ఉన్న విషయాన్ని ప్రస్తావించింది. ఐడీబీఐ బ్యాంక్‌లో ఎల్ఐసీ ఈ ఏడాది జనవరిలో 51 శాతం వాటా కొనుగోలు చేసింది. దీనితో బ్యాంకును ప్రైవేటు రంగ బ్యాంకుగా ఆర్‌బీఐ పునర్ వ్యవస్థీకరించింది. బ్యాంకులో ప్రభుత్వ వాటా ప్రస్తుతం 46.46 శాతం.




## బీఎస్ఈ బాండ్స్ వేదికపై జేఎస్‌డబ్ల్యూ స్టీల్ సీపీ

**మరో నాలుగు కంపెనీల కమర్షియల్ పేపర్స్ కూడా**



**న్యూఢిల్లీ:** జేఎస్‌డబ్ల్యూ స్టీల్ కంపెనీ తన కమర్షియల్ పేపర్స్‌ను (సీపీ) బీఎస్ఈ బాండ్స్ ప్లాట్‌ఫామ్‌పై లిస్ట్ చేయాలని బీఎస్ఈకి దరఖాస్తు చేసుకుంది. ఈ కంపెనీతో పాటు ఆదిత్య బిర్లా ఫైనాన్స్, కేఈసీ ఇంటర్నేషనల్, ఆదిత్య బిర్లా మనీ, ఫుల్లర్టన్ ఇండియా క్రెడిట్.. మొత్తం ఐదు కంపెనీలు సీపీ లిస్టింగ్ కోసం దరఖాస్తు చేశాయి. గురువారం ఈ కంపెనీల కమర్షియల్ పేపర్స్‌ను లిస్ట్ చేస్తామని బీఎస్ఈ పేర్కొంది. ఈ కంపెనీలతో కలుపుకుంటే బీఎస్ఈ బాండ్స్ ప్లాట్‌ఫామ్‌పై కమర్షియల్ పేపర్స్‌ను లిస్ట్ చేసిన కంపెనీల సంఖ్య 16కు పెరుగుతుంది. ఈ కమర్షియల్ పేపర్స్ ద్వారా కంపెనీలు రూ.17,835 కోట్లు సమీకరించాయి.

**కమర్షియల్ పేపర్స్ అంటే...**

పెద్ద పెద్ద కంపెనీలు తమ స్వల్పకాలిక రుణాల కోసం ప్రామిసరీ నోట్ల రూపంలో జారీ చేసే మనీ మార్కెట్ సాధనంగా కమర్షియల్ పేపర్స్‌ను చెప్పుకోవచ్చు. వీటి మెచ్యూరిటీ కాలం జారీ చేసిన తేదీ నుంచి కనిష్టంగా ఏడు రోజులు గరిష్టంగా ఏడాది కాలం ఉంటుంది. ముఖ విలువ కంటే కొంచెం డిస్కౌంట్‌కు వీటిని జారీ చేస్తారు. ప్రస్తుతం అమల్లో ఉన్న మార్కెట్ వడ్డీరేట్లు వర్తిస్తాయి.

**రాష్ట్రీయం**

# సైకో కిల్లర్ అరెస్ట్

**రామాయంపేట శివారులో మహిళను హత్య చేసిన నిందితుడు**

ఇదివరకే పలు కేసుల్లో జైలుకు • వివరాలు వెల్లడించిన తూప్రాన్ డీఎస్పీ కిరణ్‌కుమార్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ కిరణ్ కుమార్



నిందితుడు అరుణ్

**రామాయంపేట (మెదక్)/డిచ్‌పల్లి/నిజామాబాద్ అర్బన్:** మూడు హత్యలు, అత్యాచారాలు, పలు దోపిడీలకు పాల్పడిన సైకో కిల్లర్‌ను బుధవారం మెదక్ జిల్లా రామాయంపేట పోలీసులు అరెస్ట్ చేశారు. తూప్రాన్ డీఎస్పీ కిరణ్‌కుమార్ కథనం మేరకు.. ఈ నెల 13న రామాయంపేట శివారులోని కొచ్చెరువు వద్ద హత్యకు గురైన గుర్తుతెలియని వివాహిత మృతదేహం లభ్యమైంది. దీంతో స్థానిక సీఐ నాగార్జునగౌడ్ ఆధ్వర్యంలో మూడు బృందాలు ఏర్పడి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో మృతురాలి వద్ద దొరికిన వస్తువుల ఆధారంగా మృతురాలిని నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని వినాయక నగర్‌కు చెందిన బున్ని స్రవంతి (30)గా గుర్తించారు. ఆమె రెండు సెల్‌ఫోన్లలోని డేటాను పరిశీలించగా ఒక నంబర్ అనుమానాస్పదంగా కనిపించింది. దీంతో నిందితుడి గురించి తెలుసుకున్న పోలీసులు రామాయంపేట రహదారిపై ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. ఈ క్రమంలో నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం సుద్దపల్లి గ్రామానికి చెందిన నీరుడి అరుణ్ కుమార్‌తో కలిసి స్రవంతి స్కూటీపై రామాయంపేట వైపు వచ్చినట్లు గుర్తించారు. ఈ మేరకు అతని కోసం గాలిస్తున్న పోలీసులు బుధవారం రామాయంపేట శివారులో వాహనాల తనిఖీ చేపట్టగా స్కూటీపై హైదరాబాద్ వైపు వెళ్తున్న అరుణ్ కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు అతడిని విచారించగా స్రవంతిని తానే రామాయంపేటకు తీసుకువచ్చి అత్యాచారం చేసి హతమార్చానని అంగీకరించాడు.

**గతంలో పలు నేరాలు...**

- నిజామాబాద్‌కు చెందిన షేక్ మహబూబ్ అనే ఆటో డ్రైవర్‌ను 2016లో ఆర్మూర్ మండలం పెర్కిట్ విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద నలుగురు కలిసి హత్య చేశారు. నలుగురు నిందితుల్లో అరుణ్ ఒకడు. పట్టుబడి శిక్ష అనుభవిస్తున్న క్రమంలో పోలీసుల నుంచి తప్పించుకొని పట్టుబడి మళ్లీ జైలుశిక్ష అనుభవించాడు.
- నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో బైక్ దొంగతనం కేసులో పోలీసులకు పట్టుబడి 65 రోజులు శిక్ష అనుభవించాడు.
- హైదరాబాద్‌లోని తిరుమలగిరి ప్రాంతంలో ఒక ఇంటిలో కేర్ టేకర్‌గా పనిచేసున్న క్రమంలో ఆ ఇంటిలో వృద్ధురాలిని హతమార్చి బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లి పోలీసులకు పట్టుబడ్డాడు.
- ఇటీవలే జైలు నుంచి విడుదలైన అరుణ్ కుమార్ జైలులోనే తనకు పరిచయమైన రాజు సెల్‌కు కాల్‌చేయగా, మృతురాలు స్రవంతి పరిచయమైంది. రామాయంపేట వద్ద బంగారం, నగదు దాచి ఉంచానని స్రవంతిని నమ్మించి రామాయంపేటకు తీసుకువచ్చి ఆమెపై అత్యాచారం చేసి హతమార్చాడు. నిందితుడికి రెండు పెళ్లిళ్లు కాగా, అతడి విపరీత మనస్తత్వం, ప్రవర్తనను తట్టుకోలేక ఇద్దరూ అతడిని విడిచిపెట్టి వెళ్లిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ కేసును చాలెంజ్‌గా స్వీకరించి నిందితుడిని పట్టుకున్న సీఐతోపాటు రామాయంపేట, నార్సింగి, చేగుంట ఎస్ఐలు మహేందర్, రాజేశ్, సుభాష్‌గౌడ్‌ను డీఎస్పీ అభినందించారు.

## సిద్దిపేట ఏఎస్పీ ఇంటిపై ఏసీబీ దాడులు

- రూ. 30 కోట్ల విలువైన ఆస్తి పత్రాలు స్వాధీనం
- ఏకకాలంలో కామారెడ్డి, రంగారెడ్డి, వనపర్తి జిల్లాల్లో దాడులు

సాక్షి, సిద్దిపేట/సిద్దిపేట కమాన్



ఏఎస్పీ ఇంట్లో పత్రాలు పరిశీలిస్తున్న అధికారులు

ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయనే ఆరోపణలతో సిద్దిపేట అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ గోవిందు నర్సింహారెడ్డి నివాసంపై, ఆయన స్వగ్రామం, అనుచరులు, ఇతర అనుమానితులపై బుధవారం ఏకకాలంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు దాడులు నిర్వహించారు. ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు జరిపిన దాడుల్లో భూ పత్రాలు, బంగారం తదితరాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. సిద్దిపేటలో ఉన్న నర్సింహారెడ్డి ఇంటితోపాటు హైదరాబాద్, మహబూబ్‌నగర్, షాద్‌నగర్, ఆయన స్వగ్రామం వనపర్తి జిల్లా చిన్నంబావి మండలం అయ్యవారిపల్లిలో ఏసీబీ అధికారుల బృందాలు ఏకకాలంలో దాడులు నిర్వహించాయి. ఏసీబీ అడిషనల్ ఎస్పీ ప్రసన్నారాణి, డీఎస్పీ భద్రయ్యతోపాటు ముగ్గురు సీఐలు, ఇతర సిబ్బందితో కలిసి బుధవారం తెల్లవారుజామున సిద్దిపేట సీపీ కార్యాలయంలోని ఏఎస్పీ చాంబర్‌తోపాటు ఆయన నివాసంలోనూ సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి భార్య అఖిలారెడ్డి పేరుపై ఉన్న 4 ఎకరాలతోపాటు వేరే వారి పేర్లపై ఉన్న మరో నాలుగెకరాల భూ పత్రాలతోపాటు బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. వీటితోపాటు హైదరాబాద్, కామారెడ్డి, మహబూబ్‌నగర్ ప్రాంతాల్లో ఉన్న వ్యవసాయ భూములు, ఇండ్ల స్థలాలతో పాటు, ఇతర ఆస్తుల పత్రాలు కూడా స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. వీటి విలువ సుమారుగా రూ.30 కోట్ల మేర ఉంటుందని అధికారులు అంచనా వేసినట్లు సమాచారం. అలాగే నర్సింహారెడ్డితో సన్నిహితంగా ఉండే వన్‌టౌన్ కానిస్టేబుల్ ఇంట్లో కూడా సోదాలు చేసేందుకు వెళ్లగా ఆ ఇంటికి తాళం వేసి ఉండటంతో అధికారులు వెనుతిరిగారు. బుధవారం అర్ధరాత్రి వరకు సోదాలు జరగడంతో పూర్తి వివరాలు గురువారం తెలిసే అవకాశం ఉందని పోలీసు వర్గాలు చెబుతున్నాయి.

### క్లుప్తంగా...

### ముఖ్యమంత్రిగా కేసీఆర్ విఫలం: ఉత్తమ్



**సూర్యాపేట టౌన్:** రెండోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక పరిపాలనలో పూర్తిగా విఫలం చెందారని, హామీలన్నీ తుంగలో తొక్కారని టీపీసీసీ అధ్యక్షుడు, నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం సూర్యాపేటలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతులకు ఇచ్చిన రుణమాఫీ హామీ ఎందుకు మరిచారో చెప్పాలని ప్రశ్నించారు. నిరుద్యోగ భృతి, దళితులకు, గిరిజనులకు మూడెకరాల భూమి, ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్ వంటి హామీలను కేసీఆర్ మరచిపోయారని ఆరోపించారు. 60 ఏళ్లలో తెలంగాణ అప్పులు రూ.69 వేల కోట్లు ఉంటే.. సీఎం కేసీఆర్ వచ్చాక ఆరేళ్లలో రూ.3 లక్షల కోట్లకు పెరిగాయన్నారు. ఈ నెల 26, 27 తేదీల్లో సూర్యాపేట నియోజకవర్గంలో పర్యటిస్తానని తెలిపారు.

### గుంత రేణుక అరెస్ట్

**గద్వాల క్రైం/ఆత్మకూర్:** నిషేధిత మావోయిస్టు పార్టీకి సహకరిస్తున్నారనే ఆరోపణలతో గుంత రేణుక అనే మహిళను బుధవారం గద్వాలలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆత్మకూర్ కోర్టుకు తరలించారు. గద్వాల జిల్లా మల్దకల్ మండలం ఎల్కూర్‌కు చెందిన టీవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగన్న (నాగరాజు) నిషేధిత మావోయిస్టు పార్టీలోకి యువతను నియమిస్తున్నారన్న సమాచారం అందడంతో గత అక్టోబర్ 5న అతడిని అరెస్టు చేశారు. అదే నెల 7, 11న టీవీవీ బలరాం, ఓయూ ప్రొఫెసర్ జగన్‌ను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. మావోయిస్టు పార్టీలోకి యువతను చేర్చుకుంటున్నారన్న సమాచారంతో ఈ కేసులోని ఆరుగురు సానుభూతిపరులను అరెస్టు చేశామని జిల్లా ఇన్‌చార్జ్ ఎస్పీ అపూర్వరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాగా, హైదరాబాద్‌లో మంగళవారం అరెస్టయిన చుక్కల శిల్ప, మంచు రమేశ్‌లను కోర్టు 14 రోజుల రిమాండ్‌కు పంపించింది.

### సమత కేసు నేటికి వాయిదా

**ఆదిలాబాద్‌టౌన్:** కుమురంభీం జిల్లా రాంనాయక్‌తండాలో జరిగిన అత్యాచారం, హత్యకు సంబంధించి జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న 'సమత'కేసు నిందితులను బుధవారం ఆదిలాబాద్ జిల్లా పోలీసులు జిల్లా కేంద్రంలోని కోర్టులో హాజరుపర్చారు. కేసు విచారణ గురువారానికి వాయిదా పడింది.

## భయం గుప్పిట్లో వలస కార్మికులు

- స్వదేశానికి తీసుకురావాలని వేడుకోలు
- ఏజెంట్లు మోసం చేశారని కుటుంబీకుల ఫిర్యాదు



పోలీస్ స్టేషన్ వద్ద బాధితుల కుటుంబ సభ్యులు

**సిద్దిపేట రూరల్:** బతుకుదెరువు కోసం భార్యా పిల్లలు, తల్లిదండ్రులను వదిలి పరాయి దేశం వెళ్లిన వలస కార్మికులను నకిలీ ఏజెంట్లు నమ్మించి నిండా ముంచుతున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి... సిద్దిపేట జిల్లా రూరల్ మండలం చింతమడక గ్రామానికి చెందిన అనుమగారి కోటి, స్వామి, సుతారి కనకయ్య, ఎన్సాన్‌పల్లి గ్రామానికి చెందిన నర్సింలు, ఇర్కోడ్ గ్రామానికి చెందిన మాట్ల రవీందర్‌లు బతుకుదెరువు కోసం బయటి దేశం వెళ్లాలనుకున్నారు. వేములవాడకు చెందిన గడ్డం గంగాధర్, సిరిసిల్లకు చెందిన ప్రకాశ్ అనే ఏజెంట్లను ఆశ్రయించారు. దీంతో ఆ ఏజెంట్లు వారి వద్ద నుంచి రూ.లక్ష వరకు తీసుకుని సౌదీలో గార్డెన్‌లో పని చేస్తే మంచి జీతం అందిస్తారని ఆరు నెలల క్రితం ముంబై నుంచి సౌదీకి పంపించారు. అయితే అక్కడ వారికి గార్డెన్ పని కాకుండా వేరే పనులు చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

**పెట్రోల్ బావిలో పనులు:** సౌదీలో గార్డెన్ పని అని చెప్పి తమను పెట్రోల్ బావుల్లో ప్రమాదకర పనులు చేయిస్తున్నారని, తాము ఈ పనులు చేయమని కంపెనీ యజమానికి చెబితే ఆయన ఒక రోజు పాటు తమను ఎండలో నిలబెట్టారని బాధితులు తెలిపారు. చేసేదేమీ లేక అదే పని చేయాల్సి వస్తుందని తమ గోడును వెల్లబోసుకున్నారు. ఏజెంట్‌కు ఫోన్ చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాగైనా తమకు న్యాయం చేసి ఇండియాకు వచ్చేలా చూడాలని కోరారు. కాగా, సౌదీలో గార్డెన్‌లో పని చేయాలని, జీతం బాగుంటుందని చెప్పి డబ్బులు తీసుకున్న ఏజెంట్లు అక్కడ వేరే పనులు చేయిస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని బుధవారం సిద్దిపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో బాధిత కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు.

## వజ్రాలకోసం దోపిడీ యత్నం

**గుడిహత్నూర్ (బోథ్):** కొందరు దుండగులు సినీ ఫక్కీలో వజ్రాల కోసం దోపిడీకి ప్రయత్నించిన సంఘటన ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని 44వ జాతీయ రహదారిపై మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. బుధవారం ఉట్నూర్ డీఎస్పీ బి.డేవిడ్ ఈ వివరాలు వెల్లడించారు. గుజరాత్‌కు చెందిన ఓ వజ్రాల వ్యాపారి కారులో డ్రైవర్లు కరణ్ పటేల్, విశాల్‌పటేల్ నాగ్‌పూర్ మీదుగా హైదరాబాద్ వెళ్తున్నారు. అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో బట్టిసావర్‌గావ్‌కు చేరగానే.. మూడు కార్లలో వచ్చిన నలుగురు దుండగులు వీరిని అడ్డగించి కరణ్, విశాల్‌పై దాడి చేసి కారును లాక్కెళ్లారు. డ్రైవర్లను మరో కారులో తీసుకెళ్లి ఉట్నూర్ రహదారిపై రాఘాపూర్ వద్ద వదిలివెళ్లారు. దీంతో బాధితులు గుడిహత్నూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్పీ విష్ణు వారియర్ ఈ కేసు దర్యాప్తు కోసం 3 బృందాలను ఏర్పాటు చేశారు. నిందితులు లాక్కెళ్లిన కారును మహారాష్ట్రలోని వారకౌత వద్ద స్వాధీనం చేసుకున్నారు. కారులో వజ్రాల రవాణాకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన లాకర్లు ధ్వంసమైనట్లు గుర్తించారు. కాగా, కారులో వజ్రాలు లేవని సదరు వ్యాపారి ఫోన్‌లో పోలీసులకు తెలిపారు. కేసును దర్యాప్తు చేస్తున్నారు.

### కోహీర్‌లో 10 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత

**కోహీర్ (జహీరాబాద్):** రాష్ట్రంలో చలి ప్రభావం తీవ్రమైంది. బుధవారం సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వాతావరణ శాఖ నివేదిక ప్రకారం బుధవారం ఉదయం మండల కేంద్రమైన కోహీర్‌లో అత్యల్పంగా 10.07 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. జహీరాబాద్ మండలంలోని అల్గోల్, సత్వార్ గ్రామాల్లో 11.08 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

### క్లిమామ్‌కు అంతర్జాతీయ పురస్కారం



దివ్యారెడ్డి

**నిర్మల్‌టౌన్:** హైదరాబాద్ కేంద్రంగా వెల్‌నెస్ అండ్ ఫారమ్స్ రంగంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న క్లిమామ్‌కు అంతర్జాతీయంగా అరుదైన గౌరవం లభించింది. దుబాయ్‌లో బుధవారం నిర్వహించిన ఇంటర్నేషనల్ ఫోరం ఫర్ అడ్వాన్స్‌మెంట్స్ ఇన్ హెల్త్ కేర్ కార్యక్రమంలో క్లిమామ్ వ్యవస్థాపకురాలు అల్లోల దివ్యారెడ్డికి అవార్డును అందజేశారు. హెల్త్ కేర్ లీడర్ కేటగిరీలో క్లిమామ్ వెల్‌నెస్ అండ్ ఫారమ్స్‌కు టాప్–100లో చోటు దక్కింది. అవార్డు రావడం పట్ల అల్లోల దివ్యారెడ్డి సంతోషం వ్యక్తం చేశారు.

### విద్యార్థుల పట్ల హెచ్‌ఎం వికృత చేష్టలు

**జనగామ అర్బన్/జనగామ రూరల్:** జనగామ జిల్లా మరిగడి ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంగా పనిచేస్తున్న బాలు నాయక్ కొంత కాలంగా విద్యార్థుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ వికృత చేష్టలకు పాల్పడుతున్నట్టు వెల్లడైంది. బాలికలు టాయ్‌లెట్‌కు వెళ్తే వారిని వెంబడించి ఇబ్బందులకు గురిచేసే వాడు. చిన్నారులను ఒళ్లో కూర్చోబెట్టుకుని అసభ్యకర వీడియోలు చూస్తూ తాకరాని చోట తాకుతూ ఇబ్బంది పెట్టేవాడు. అయితే ఐదో తరగతి చదివే ఓ చిన్నారి ఈ విషయాన్ని దల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లడంతో విషయం బుధవారం బయటపడింది. పోలీసులకు ఫిర్యాదు చేయగా బాలునాయక్‌ను అదుపులోకి తీసుకున్నారు. డీఈఓ యాదయ్య హెచ్‌ఎంను సస్పెండ్ చేశారు.



## విటమిన్ 'డి' కోసం..!

'ఇదేంటీ.. అంతమంది శిశువులను ఎత్తుకుని కనిపిస్తున్నారు.. వైద్యానికిగాని వచ్చారా!'అనిపిస్తోంది కదూ! మీ అనుమానం నిజమే. వారు వచ్చింది వైద్యంకోసమేగానీ.. వైద్యుడి వద్దకు మాత్రం కాదు. ఉదయంపూట వచ్చే సూర్యకిరణాలతో చిన్నారులకు 'డి'విటమిన్ లభిస్తుందని డాక్టర్ సూచించడంతో మంచిర్యాల జిల్లాకేంద్రం ఆసుపత్రిలో జన్మించిన శిశువులను వారి బంధువులు ఇదిగో ఇలా బుధవారం ఉదయం 8 గంటలకు ఎత్తుకుని ఆసుపత్రి ఎదుట కనిపించారు.

- గెల్లు నర్సయ్య యాదవ్, సాక్షి ఫొటోగ్రాఫర్ మంచిర్యాల

# ఆర్టీసీకి రూ.500 కోట్ల బోనస్?

- గాడిన పడుతున్న రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ
- వచ్చే ఏప్రిల్ నాటికి బ్రేక్ఈవెన్ దాటనున్న వైనం
- లాభం కనిపించగానే బోనస్ ప్రకటించే చాన్స్
- చార్జీల పెంపు, పొదుపు చర్యలతో పెరిగిన ఆదాయం
- 'కిలోమీటరు ఆదాయం' రూ.30 నుంచి రూ.35కు..




**సాక్షి, హైదరాబాద్:** ఆర్టీసీ అనగానే అప్పులు, నష్టాలే గుర్తుకొస్తాయి.. లాభం, బోనస్ అనేవి ఆ సంస్థలోని ఉద్యోగులకు కలలో మాటనే.. అయితే ప్రస్తుతం పరిస్థితి మారింది. క్రమక్రమంగా ఆర్టీసీ గాడిన పడుతోంది. కేవలం 20 రోజుల్లో చోటు చేసుకున్న పెనుమార్పులు బోనస్‌పై ఆశలు రేకెత్తిస్తున్నాయి. పరిస్థితి ఇలాగే ఉంటే.. వచ్చే ఆర్థిక సంవత్సరం ప్రభుత్వం బోనస్ రూపంలో ఏకంగా రూ.500 కోట్లు ఇచ్చేందుకు సిద్ధంగా ఉందని విశ్వసనీయ సమాచారం. బడ్జెట్ ద్వారా ఆర్టీసీకి కేటాయించే రూ.వేయి కోట్లలో సగం మొత్తాన్ని బోనస్‌గా ఇచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. గరిష్టంగా ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున బోనస్ అందే అవకాశముంది.

### మార్చి తర్వాత బ్రేక్ ఈవెన్‌కు..

వచ్చే మార్చి తర్వాత ఆర్టీసీ బ్రేక్ ఈవెన్ (లాభనష్టాలు లేని సమస్థితి)కు చేరుకుంటుందని ఆర్టీసీ అంచనా వేస్తోంది. ఆ తర్వాత మరో నాలుగైదు నెలల్లో హైదరాబాద్‌లో మినహా మిగతా ప్రాంతాల్లో లాభాలు కనిపించే అవకాశముంది. ఆర్టీసీని పునరుద్ధరించిన తర్వాత స్వయంగా సీఎం కె.చంద్రశేఖర్‌రావు పర్యవేక్షణలో అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఆయన క్రమం తప్పకుండా అధికారులతో భేటీ అవుతూ పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు అందిస్తున్నారు. తాను రవాణాశాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఆర్టీసీ నష్టాలను నివారించి రూ.14 కోట్ల లాభాలు తెచ్చానని స్వయంగా పలు సందర్భాల్లో ఆయన పేర్కొన్న సంగతి తెలిసిందే. ఇప్పుడు స్వయంగా ముఖ్యమంత్రి హోదాలో ఆర్టీసీని పర్యవేక్షిస్తున్నందున లాభాలను కూడా పునరుద్ధరించే అవకాశముంది. సమ్మె తర్వాత తీసుకున్న కొన్ని చర్యలు ఆర్టీసీ నష్టాలను భారీగా తగ్గించేందుకు దోహదం చేయబోతున్నాయి.

### కిలోమీటరుకు ఆదాయంలో పెరుగుదల..

ఆర్టీసీలో ప్రతి కిలోమీటరుకు వచ్చే ఆదాయం (ఈపీకే)కు ఎంతో ప్రాధాన్యముంది. గతేడాది ఇదే సమయంలో ఈపీకే గరిష్టంగా రూ.30గా ఉంది. కానీ ప్రస్తుతం అది రూ.35కు చేరుకుంది. సోమవారం రోజైతే ఏకంగా రూ.38గా నమోదైంది. సమ్మెకు పూర్వం ప్రతి కిలోమీటరుకు ఆర్టీసీ రూ.7 చొప్పున నష్టాలు చవిచూస్తోంది. తాజాగా ఆదాయం పెరగటంతో ఆ నష్టం రూ.2కు పడిపోయింది. ఇక ఆ రూ.2ను కూడా తగ్గించి సున్నాకు తీసుకొస్తే బ్రేక్ ఈవెన్ సాధ్యమవుతుంది. ప్రస్తుతం రోజువారీ ఆదాయంలో రూ.1.8 కోట్ల మేర పెరుగుదల నమోదవుతోంది. ఇందులో మరో రూ.30 లక్షల వరకు చేరితే బ్రేక్ ఈవెన్‌కు మార్గం సుగమమవుతుంది. ప్రస్తుతం మూఢాలు మొదలైనందున శుభకార్యాలు లేవు. తిరిగి సంక్రాంతి తర్వాత శుభకార్యాలు మొదలవుతాయి. ఏకబిగిన మే వరకు ఉంటాయి. దీంతో ఫిబ్రవరి నాటికి బ్రేక్ ఈవెన్ సాధ్యమయ్యే దిశగా అడుగులు పడుతున్నాయి.

### ఆదాయం పెరుగుదలకు కారణాలివే..

- పెరిగిన బస్సు చార్జీలు సాలీనా రూ.800 కోట్ల వరకు తెచ్చి పెట్టే అవకాశముంది.
- సిబ్బందిలో పెరిగిన క్రమశిక్షణ వల్ల అదనంగా ఆదాయం పెరగనుంది.
- ప్రస్తుతం వేయి బస్సుల వరకు తగ్గిస్తున్నారు. దీంతో నిర్వహణ (సిబ్బంది జీతాలు కాకుండా) ఖర్చులు ఆదా కానున్నాయి.
- కొత్తగా సరుకు రవాణా విభాగాన్ని ప్రారంభిస్తున్నారు. సాలీనా రూ.400 కోట్ల ఆదాయం లక్ష్యంగా అది మొదలవుతోంది. అది పూర్తిగా అదనపు ఆదాయమే.
- ఉన్న బస్సుల హేతుబద్ధీకరణ ద్వారా వృథా వ్యయాన్ని తగ్గించటంతో పాటు ఆదాయాన్ని పెంచుకోనున్నారు. సిబ్బంది హేతుబద్ధీకరణ ద్వారా ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని తొలగించనున్నారు. వారి జీతాల భారం తగ్గనుంది.
- ప్రభుత్వం బడ్జెట్ ద్వారా ఇచ్చే మొత్తంలోంచి కొన్ని అప్పులు తీర్చనున్నారు. వాటిపై సాలీనా చెల్లించే రూ.200 కోట్ల వడ్డీ భారం కొంత తగ్గనుంది.

### మీ ఆర్టీసీ ఎలాగుంది?

**సాక్షి, హైదరాబాద్:** నష్టాల నుంచి గాడిలో పడేందుకు తీవ్రంగా శ్రమిస్తున్న మన ఆర్టీసీ పరిస్థితిని ఇప్పుడు రాజస్తాన్ ఆర్టీసీ అధ్యయనం చేయబోతోంది. దేశవ్యాప్తంగా ప్రభుత్వ రంగ రవాణా సంస్థలు తీవ్ర ఆర్థిక ఒడిదుడుకులు చవిచూస్తున్నాయి. చిన్న ఆర్టీసీలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నాయి. ఈ నేపథ్యంలో తక్కువ బస్సులతో ఉన్న రాజస్తాన్ ఆర్టీసీ టీఎస్‌ఆర్టీసీని అధ్యయనం చేయాలని నిర్ణయించింది. ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ఇక్కడ అనుసరిస్తున్న తీరును తెలుసుకోవాలని నిర్ణయించింది.



# తృణమో పణమో తిందాం తప్పక

### తృణధాన్యాలతో పిల్లల ఎదుగుదల భేష్

- 50 శాతం వృద్ధి ఉన్నట్లు గుర్తింపు
- ఇక్రిశాట్, అక్షయపాత్ర ఫౌండేషన్ పరిశోధనలో వెల్లడి

**సాక్షి, హైదరాబాద్:** తృణధాన్యాలతో కూడిన ఆహారం పిల్లల శారీరక ఎదుగుదలను ఎక్కువ చేస్తుందని హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న అంతర్జాతీయ మెట్ట ప్రాంత పంటల పరిశోధన కేంద్రం (ఇక్రిశాట్) నేతృత్వంలో జరిగిన ఓ పరిశోధనలో వెల్లడైంది. మూడు నెలలపాటు తృణధాన్యాలతో కూడిన భోజనం తినడం ద్వారా విద్యార్థుల ఎదుగుదలలో 50 శాతం వృద్ధి కనిపించిందని స్పష్టమైంది. ఢిల్లీలో బుధవారం జరిగిన ఓ కార్యక్రమంలో నీతిఆయోగ్ సభ్యుడు రమేశ్ చంద్, రైతు ఆదాయాన్ని రెట్టింపు చేసేందుకు ఉద్దేశించిన సాధికార సంస్థ అధ్యక్షుడు అశోక్ దళవాయి పరిశోధన వివరాలు వెల్లడించారు. 'స్మార్ట్‌ఫుడ్ స్టడీ'పేరుతో ఇక్రిశాట్ కర్ణాటకలో పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని సరఫరా చేసే అక్షయ పాత్రతో కలసి ఈ పరిశోధన చేపట్టింది. బెంగళూరు పరిసరాల్లోని నాలుగు గ్రామాల్లో కొంతమంది విద్యార్థులను రెండు గ్రూపులుగా విభజించారు. ఓ గ్రూపునకు తృణధాన్యాలతో తయారుచేసిన ఇడ్లీ, కిచిడీ, ఉప్మా, బిసిబేళేబాత్‌లను అందించారు. బియ్యం స్థానంలో సజ్జలు, రాగులు, సామలను ఉపయోగించారు. అలాగే మరో గ్రూపు విద్యార్థులకు సాంబార్ అన్నం ఆహారంగా ఇచ్చారు. నిర్దిష్ట కాలం తర్వాత రెండు గ్రూపుల్లోని పిల్లల ఎదుగుదలను పోల్చి చూశారు. తృణధాన్యాలు ఆహారంగా తీసుకున్న వారి శరీర కొలతలు ఇతరుల కంటే చాలా మెరుగ్గా ఉన్నట్లు గుర్తించారు. తృణధాన్యాల ఆహారంపై శాస్త్రీయంగా జరిగిన తొలి అధ్యయనం ఇదేనని ఇక్రిశాట్‌కు చెందిన న్యూట్రిషనిస్ట్ ఎస్.అనిత తెలిపారు. కేవలం తృణధాన్యాలను వాడటం కాకుండా ఏ రకమైన తృణధాన్యాన్ని ఉపయోగిస్తున్నాం? ఎలా వండుతున్నాం? ఏ ఇతర ఆహార పదార్థాలతో కలిసి తింటున్నాం? అన్న అంశాలూ ముఖ్యమేనని స్పష్టం చేశారు.

### పోషకాహార లోపాలకు చెక్..

రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలన్న కేంద్ర ప్రభుత్వ ఆలోచన సాకారం కావాలంటే తృణధాన్యాల సాగుకు ప్రోత్సాహం ఇవ్వడం అవసరమని ఈ పరిశోధన చెబుతోందని డాక్టర్ అశోక్ దళవాయి తెలిపారు. ఇక్రిశాట్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రీసెర్చ్‌తో కలిసి మెరుగైన వంగడాల సృష్టికి కృషిచేస్తోందని ఇక్రిశాట్ డైరెక్టర్ డాక్టర్ పీటర్ కార్‌బెర్రీ తెలిపారు. పాఠశాల విద్యార్థుల మధ్యాహ్న భోజన పథకంలో తృణధాన్యాలను చేర్చడం ద్వారా పోషకాహార లోపాలను సరిదిద్దేందుకు అవకాశం ఉంటుందని ఈ పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్తలు అభిప్రాయపడ్డారు. కనీస మద్దతు ధర, చౌక ధర దుకాణాల ద్వారా తృణధాన్యాల పంపిణీ చేపడితే రైతులకూ ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. మరిన్ని పోషకాలు ఉన్న తృణధాన్యాలను గుర్తించి వాటి సాగుకు ప్రోత్సాహకాలు అందించడం అవసరమని పేర్కొన్నారు.

# హైదరాబాద్‌లో జీఎస్టీ దాడులు

## ఎగ్గొట్టిన పన్నుల విలువ రూ.40 కోట్ల పైమాటే!

**సాక్షి, హైదరాబాద్:** హైదరాబాద్‌లో గూడ్స్ సర్వీస్ ట్యాక్స్ (జీఎస్టీ) అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. పలువురు నిర్మాణ, స్టీల్, చిట్‌ఫండ్, ఇంటర్నేషనల్ స్కూల్స్, ఇతర విద్యా సంస్థల వ్యాపారాలపై బుధవారం ఉదయం ఏకకాలంలో దాడులు జరిగాయి. నగరంలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, మేడ్చల్ తదితర 20 ప్రాంతాల్లో నిర్వహించిన ఈ దాడులు రాత్రి వరకు కొనసాగాయి. ఇంతకాలం ఆయా వ్యాపారులు తాము జీఎస్టీ పరిధిలోకి రామనే ధీమాతో జీఎస్టీ కట్టలేదని సమాచారం. కానీ 2017కు ముందు వీరు తమ వ్యాపారాలకు సంబంధించి సర్వీస్ ట్యాక్స్ కూడా కట్టలేదని అధికారులు గుర్తించారు. సాయంత్రం వరకు జరిగిన దాడుల్లో వీరందరూ దాదాపు రూ. 30 కోట్ల నుంచి 40 కోట్ల వరకు పన్ను ఎగవేసినట్లుగా తెలిసింది. ఈ దాడుల్లో పలు కీలక పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటిని అధ్యయనం చేశాక, ఎగవేసిన పన్నుల విలువ మరింత అధికంగా ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. మరో రెండ్రోజుల వరకు దాడులు కొనసాగుతాయని సమాచారం. ఈ దాడుల్లో సినీ రంగానికి చెందిన వ్యక్తుల వ్యాపారాలు కూడా ఉన్నాయని తెలుస్తోంది.

# వైల్డ్ లైఫ్ బోర్డు పునర్నియామకం

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర వైల్డ్ లైఫ్ బోర్డును ప్రభుత్వం మళ్లీ నియమించింది. ఈ మేరకు బోర్డును రీ కాన్‌స్టిట్యూట్ చేస్తూ బుధవారం ప్రభుత్వ పర్యావరణ అటవీ శాఖ ఉత్తర్వులు(జీవో 64) జారీ చేసింది. బోర్డులో నియమితులైన వారి పదవీకాలం మూడేళ్లపాటు కొనసాగుతుందని అందులో పేర్కొంది. ఈ బోర్డుకు చైర్మన్‌గా సీఎం, వైస్‌చైర్మన్‌గా అటవీ, పర్యావరణ శాఖ మంత్రి వ్యవహరిస్తారు. అలాగే మరో 18 మంది సభ్యులను నియమించింది. అందులో ఎమ్మెల్యేలు కోనేరు కోనప్ప, మర్రి జనార్ధన్‌రెడ్డి, వనమా వెంకటేశ్వర్‌రావు, వరల్డ్ వైడ్ ఫండ్ చైర్మన్ అనిల్‌కుమార్, దక్కన్‌బ్రెడైర్స్ అధ్యక్షుడు జేవీడీ మూర్తి, ఇతర సభ్యులు ఉంటారు. సంవత్సరంలో కనీసంగా రెండుసార్లు బోర్డు సమావేశం నిర్వహించాల్సి ఉంటుందని ప్రభుత్వం పేర్కొంది.

# గోశాలల్లోని జీవాల కోసం సంచార వైద్యశాలలు: తలసాని



**సాక్షి, హైదరాబాద్:** వచ్చే ఏడాది జనవరి నుంచి జీహెచ్‌ఎంసీ పరిధిలోని గోశాలల్లో ఉండే జీవాలకు వైద్యసేవలు అందించేందుకు సంచార పశు వైద్యశాలలను ఏర్పాటు చేయనున్నట్టు పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ చెప్పారు. పశుసంవర్ధక డైరెక్టరేట్ కార్యాలయంలో బుధవారం జరిగిన రాష్ట్ర జంతు సంక్షేమ బోర్డు సమావేశంలో మంత్రి తలసాని పాల్గొని మాట్లాడారు. జంతు సంరక్షణ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని, జీవాలను రవాణా చేసే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. జంతు సంక్షేమ బోర్డు సమావేశాలను ప్రతి 4 నెలలకోసారి నిర్వహిస్తామని, బోర్డు కోసం త్వరలోనే డైరెక్టరేట్‌లో కార్యాలయం ఏర్పాటు చేస్తామని చెప్పారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో అనధికార పెట్‌షాపులున్నాయని, వాటన్నిటికీ శాఖ నుంచి సర్టిఫికెట్లు ఇవ్వాలని, వాటిని రెండేళ్లకోసారి రెన్యువల్ చేయించుకునే విధానాన్ని తీసుకుని రావాలని చెప్పారు. అనుమతి లేని కబేళాలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. గోశాలల నిర్వాహకులు, జంతు ప్రేమికులు, రెడ్‌క్రాస్, బ్లూక్రాస్ వంటి సంస్థల సభ్యులను కూడా ఏప్రిల్‌లో నిర్వహించే బోర్డు సమావేశానికి ఆహ్వానించి వారి సలహాలు, సూచనలు కూడా తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధక కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, డైరెక్టర్ లక్ష్మారెడ్డి, అడిషనల్ డైరెక్టర్ రాంచందర్, పోలీస్ శాఖ ఐజీ బాలనాగదేవి, వైల్డ్ లైఫ్ ఓఎస్డీ శంకరన్, జీహెచ్‌ఎంసీ చీఫ్ వెటర్నరీ ఆఫీసర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



ఫొటో చూశారుగా.. అమ్మాయి భలే ముద్దుగా ఉంది కదూ. టామ్ జోర్క్‌లాండ్ అనే చిత్రకారుడు గీశాడు దీన్ని. అయితే ఏంటి అంటున్నారా? చాలా విశేషాలే ఉన్నాయి ఈ చిత్రం వెనుక. ఈ అమ్మాయి ఈ కాలపు మనిషి కాదు. సుమారు 5,700 ఏళ్ల క్రితం నివసించి ఉండొచ్చని అంచనా. డెన్మార్క్‌లోని సైల్‌థోలమ్ అనే

## డీఎన్‌ఏ గీసిన బొమ్మ!



ప్రాంతంలో తవ్వకాల్లో లభించిన ఓ బబుల్‌గమ్ (ఓ చెట్టు బెరడు. బబుల్‌గమ్‌లా నమిలేవారట) అవశేషం నుంచి ఈ అమ్మాయి చిత్రాన్ని రూపొందించారు శాస్త్రవేత్తలు. అదెలా అంటే ఈ బబుల్‌గమ్ అవశేషంలో అమ్మాయి తాలూకూ డీఎన్‌ఏ లభించింది. దీని ఆధారంగా మొత్తం జన్యుక్రమాన్ని పునర్నిర్మించారు. అంతేకాకుండా నమిలిన కారణంగా ఆ అవశేషానికి నోటిలోని బ్యాక్టీరియా, ఆ చెట్టులో ఉండే సూక్ష్మజీవుల ఆనవాళ్లూ కనిపించాయి. వీటన్నింటి ఆధారంగా ఆ డీఎన్‌ఏ కలిగిన వ్యక్తి మహిళ అని గుర్తించారు. అంతేకాకుండా ఒడ్డూ పొడవు, కనులు, చర్మం రంగు వంటి వాటిని నిర్ధారించారు. టామ్ జోర్క్‌లాండ్ ఈ చిత్రాన్ని గీశారు.

### మద్యం అమ్మకాలను నియంత్రించాలి: కోదండరాం

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో మద్యం అమ్మకాలను నియంత్రించాలని తెలంగాణ జన సమితి(టీజేఎస్) అధ్యక్షుడు కోదండరాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీజేఎస్ కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మద్యం అమ్మకాల నియంత్రణకు రిటైర్డ్ జడ్జితో కమిటీ వేయాలన్నారు. పర్మిట్ రూంలను, బెల్ట్ షాపులను ఎత్తివేయాలని, మద్యం అమ్మకాల సమయాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. అన్ని జిల్లాల్లో మద్యం పాలసీపై సదస్సులు నిర్వహించాలని తమ రాష్ట్ర కమిటీ సమావేశంలో నిర్ణయించామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో మద్యం అమ్మకాలు గతంలో కంటే రూ.20 వేల కోట్లు అదనంగా పెరిగాయన్నారు.

MARUTI SUZUKI
NEXA

CREATE NEW EXPERIENCES WITH THE BEST OFFERS OF THE YEAR.
Avail great year-end offers before the stock runs out.



LIMITED PERIOD OFFERS ONLY
VALID TILL 31st DECEMBER 2019

| BRAND | BALENO (P) | BALENO (D) | IGNIS | S-CROSS | CIAZ (P) | CIAZ (D) |
|---|---|---|---|---|---|---|
| CONSUMER OFFER* | ₹25 000 | ₹25 000+5 YEAR WARRANTY | ₹30 000 | ₹50 000+5 YEAR WARRANTY | ₹25 000 | ₹40 000+5 YEAR WARRANTY |
| EXCHANGE OFFER | ₹15 000 | ₹15 000 | ₹25 000 | ₹40 000 | ₹40 000 | ₹40 000 |
| CORPORATE OFFER | ₹5 000 | ₹10 000 | ₹10 000 | ₹10 000 | ₹10 000 | ₹10 000 |
| TOTAL SAVINGS# | ₹45 000 | ₹67 400 | ₹65 000 | ₹1 22 900 | ₹75 000 | ₹1 12 700 |

Contact us at 1800-200-[6392] 1800-102-[NEXA] www.nexaexperience.com NOW YOU CAN ALSO BOOK ONLINE
WARANGAL: NEXA WARANGAL EAST (ADARSHA AUTO WORLD PVT. LTD. PH: 9133398806),
KARIMNAGAR: NEXA RAMPUR (ADARSHA AUTO WORLD PVT. LTD. PH: 8897096633),
NIZAMABAD: NEXA NIZAMABAD EAST (VARUN MOTORS PH: 9160991616),
NALGONDA: NEXA NALGONDA NORTH (PAVAN MOTORS PVT LTD PH: 9100051403).
*Offer may vary from variant to variant. #Total savings include Consumer Offer + Exchange Offer + Highest Corporate Offer and a 5-year warranty (2-year standard warranty + 3-year extended warranty) on all NEXA Diesel cars.
connect — Offered separately as Genuine NEXA Accessory

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

epaper.sakshi.com